ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
ప్రకాశం
జిల్లా వార్తలు
బుధవారం 6, నవంబరు 2024


సంతనూతలపాడులోని శ్రీ నాగేంద్ర సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో పూలతో అలంకరించిన పుట్ట

నాగన్నా.. చల్లంగా చూడన్నా..

నాగుల చవితిని జిల్లావ్యాప్తంగా ప్రజలు మంగళవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. తెల్లవారుజాము నుంచే నాగేంద్రుని పుట్టల వద్దకు భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆవుపాలు పోసి, చలివిడి, వడపప్పు మొదలైనవి నివేదించి పూజలు చేశారు. ఒంగోలులోని పలు ప్రాంతాల్లో ఉన్న పుట్టల వద్ద కోలాహలం నెలకొంది.

- ఆంధ్రజ్యోతి, ఒంగోలు కల్చరల్


ఒంగోలు రంగారాయుడు చెరువు వద్ద ఉన్న నాగేంద్రుడి పుట్టలో పాలుపోసి పూజలు చేస్తున్న భక్తులు

సెక్టోరల్ పోస్టులకు సగం మందికిపైగా అనర్హులే

- ఆరింటికి 26మంది అర్హులు
- అర్హతలేని 32 మంది దరఖాస్తు



ఒంగోలు విద్య, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర శిక్ష ప్రాజెక్టులో ఖాళీగా ఉన్న సెక్టోరల్ అధికారుల పోస్టుల భర్తీకి దరఖాస్తు చేసుకున్న వారిలో సగానికిపైన అనర్హులుగా తేలారు. మొత్తం ఆరు పోస్టులకు 58మంది స్కూలు అసిస్టెంట్లు దరఖాస్తు చేయగా వీరిలో 26మంది మాత్రమే అర్హులని నిర్ధారించారు. 32మంది అర్హత లేని వారిగా గుర్తించారు. సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్టులో సెక్టోరల్, అసిస్టెంట్ సెక్టోరల్ అధికారుల పోస్టులు ఉన్నాయి. వీటిలో ఏఎంవో, ఏపీవో పోస్టుల్లో గతంలో నియమితులైన వారు కొనసాగుతుండగా మిగిలిన ఐదు సెక్టోరల్, ఒక అసిస్టెంట్ సెక్టోరల్ అధికారి పోస్టు ఖాళీగా ఉన్నాయి. కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశాల మేరకు ఖాళీగా ఉన్న పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తూ డీఈవో ఇటీవల నోటిఫికేషన్ జారీ చేశారు. సీఎంవో, ఐఈ కోఆర్డినేటర్, ఏఎల్ఎస్ కోఆర్డినేటర్, జీసీడీవో, ఎంఐఎస్ అండ్ ప్లానింగ్ కోఆర్డినేటర్ సెక్టోరల్ పోస్టులు, ఏఎస్‌వో అసిస్టెంట్ సెక్టోరల్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానించారు. అయితే పూర్వ కలెక్టర్ దినేష్‌కుమార్ ఉన్నప్పుడే నాలుగు పోస్టులకు

మిగతా 4వ పేజీలో

గత ప్రభుత్వ పాపాలు నేడు శాపాలుగా పరిణమిస్తున్నాయి. ఇందుకు మార్కాపురం మెడికల్ కళాశాలే ఉదాహరణ. కాలేజీ భవన నిర్మాణ పనులు కొంతకాలంగా నిలిచిపోయాయి. రెండు రోజుల నుంచి కాంట్రాక్టు సంస్థ తమ నిర్మాణ సామగ్రిని ఇక్కడి నుంచి తరలిస్తోంది. దీంతో ఇక బిచాణా ఎత్తేసినట్లే! అన్న ప్రచారం స్థానికంగా నడుస్తోంది. మార్కాపురం మండల పరిధి రాయవరం గ్రామ సమీపంలోని జాతీయ రహదారి పక్కన మెడికల్ కాలేజీ నిర్మాణాన్ని 2022 మేలో అప్పటి వైసీపీ ప్రభుత్వం ప్రారంభించింది. మొదటి నుంచి పనులు నత్తనడకన సాగాయి. అందుకు నిధుల సమస్య ప్రధాన కారణమైంది. గత కొన్ని నెలలుగా నిర్మాణ సంస్థ పనులను పూర్తిగా నిలిపివేసింది. సోమవారం నుంచి ఏకంగా సామగ్రిని కూడా లారీలలో తరలించే ప్రక్రియను మొదలుపెట్టింది. దీంతో మెడికల్ కాలేజీ పరిస్థితి ఏమిటన్న చర్చ మొదలైంది.

మధ్యలోనే వదిలేశారు!

- గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో 19 శాతమే పూర్తి
- ఈ విద్యా సంవత్సరం తరగతులకు ఎన్ఎంసీ నో
- కాంట్రాక్టు సంస్థ తాత్సారమే కారణం
- మార్పు భయంతో తాజాగా చేతులెత్తేసిన వైనం
- కళాశాల నుంచి నిర్మాణ సామగ్రి తరలింపు


కొంతమేర మాత్రమే పూర్తయిన మెడికల్ కాలేజీ అడ్మినిస్ట్రేషన్ బ్లాక్

నత్తనడకన మార్కాపురం మెడికల్ కాలేజీ పనులు

మార్కాపురం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం మెడికల్ కాలేజీ నిర్మాణం అగమ్యగోచరంగా మారింది. పనులను చేపట్టిన కాంట్రాక్టు సంస్థ చేతులెత్తేసినట్లు తెలుస్తోంది. రెండు రోజులుగా నిర్మాణ సామగ్రిని కాలేజీ ప్రాంతం నుంచి తరలించేస్తోంది. ఇందుకు సంబంధించి అధికారులకు ఎటువంటి సమాచారం లేకపోవడంతో ఇక ఆ సంస్థ నిర్మాణాన్ని వదిలేసినట్లే అన్న చర్చ స్థానికంగా నడుస్తోంది. గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 16 మెడికల్ కాలేజీల నిర్మాణాలను ఒకేసారి 2022 మేలో ప్రారంభించింది. అప్పటికే 11 మెడికల్ కాలేజీలు ఉన్నాయి. నిరుపేద, మధ్య తరగతి వర్గాలకు అందని ద్రాక్షగా ఉన్న వైద్య విద్యను చేరువ చేయడం, కాలేజీలకు అనుబంధంగా ఏర్పాటు చేసే వైద్యశాలల ద్వారా కార్పొరేట్ వైద్యం పేదలందరికీ అందించాలన్న లక్ష్యంతో వీటిని ఏర్పాటు చేస్తున్నట్లు నాటి ముఖ్యమంత్రి జగన్ చెప్పారు. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు విరుద్ధంగా ఉన్నాయి. ఘనంగా ప్రారంభాలైతే చేశారు కానీ కొన్నింటికి

మిగతా 4వ పేజీలో


ఇతర ప్రాంతానికి తరలించేందుకు లారీలో ఎక్కిస్తున్న టైల్స్

కూచిపూడి హైస్కూల్ పనులు ప్రారంభిస్తాం

- ఎంఈవో రంగయ్య
- ఎస్ఎంసీ కమిటీతో సమావేశం


కూచిపూడి పాఠశాల యజమాన్య కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న ఎంఈవో రంగయ్య

మద్దిపాడు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : అర్ధాంతరంగా ఆగిపోయిన కూచిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవన నిర్మాణ పనులను తిరిగి ప్రారంభిస్తామని ఎంఈవో రంగయ్య తెలిపారు. 'పరదాల కింద చదువు.. వానొస్తే సెలవు' శీర్షికన మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించారు. డీఈవో కిరణ్‌కుమార్ ఎంఈవో రంగయ్యతో ఫోన్‌లో మాట్లాడారు. తక్షణమే నిర్మాణ పనులను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో కూచిపూడి చేరుకున్న ఎంఈవో.. పాఠశాల యాజమాన్య కమిటీతో సమావేశమయ్యారు. కమిటీ ఖాతాలో ఉన్న రూ.6.60లక్షలతో పనులు ప్రారంభించాలని నిర్ణయించారు. ఆమేరకు ఎస్ఎంసీ చైర్మన్‌కు సూచించారు. అందుబాటులో ఉన్న నిధులను ఖర్చు చేస్తే తిరిగి మరికొంత మంజూరయ్యే అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు. బుధవారం నుంచి పనులు ప్రారంభించనున్నట్లు ఎంఈవో విలేకరులకు తెలిపారు. సమావేశంలో ప్రధానోపాధ్యాయురాలు సరస్వతి, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ చిన్నసుబ్బారావు, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు వై.వెంకటరెడ్డి, పెద్దలు పాల్గొన్నారు.


చర్యలకు సిద్ధం

- సీఎంవో ఆదేశాలతో కదిలిన సహకార శాఖ అధికారులు
- డీసీసీబీ వ్యవహారంలో రోజంతా హైడ్రామా
- సీఈవో రాజీనామా!
- సెక్షన్ 51 విచారణ వైపు అడుగులు

ఒంగోలు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో చోటుచేసుకున్న అక్రమాల వ్యవహారంపై చర్యలకు రంగం సిద్ధమవుతోంది. అందుకు సంబంధించి మంగళవారం పలు పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఈ అక్రమాలపై ఏకంగా సెక్షన్ 51 విచారణ వేసే వైపు ఉన్నతస్థాయిలో అడుగులు పడుతున్నాయి. అదేసమయంలో స్థానికంగా బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జి నేతృత్వంలోని పాలకమండలి దిద్దుబాటు చర్యలను వేగవంతం చేసింది. వారి ఆదేశాల మేరకు బ్యాంకు సీఈవో కోటిరెడ్డి మంగళవారం రాత్రి రాజీనామా చేసినట్లు తెలిసింది. అయితే ఈ విషయంలో రోజంతా పెద్ద హైడ్రామానే చోటుచేసుకున్నట్లు సమాచారం. బ్యాంకులో అక్రమాలపై విచారణ నేపథ్యంలో సీఈవోను బాధ్యతల నుంచి తప్పించడంతోపాటు సమగ్ర విచారణ కోసం సెక్షన్ 51 విచారణ కోరుతూ కలెక్టర్ రాసిన లేఖలపై సకాలంలో అటు ఉన్నత స్థాయిలో, ఇటు బ్యాంకు పాలక మండలి నుంచి చర్యలు లేని విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' బహిర్గతం చేసిన విషయం విదితమే. ఇందుకు సంబంధించిన వరుస కథనాలు రాష్ట్ర, జిల్లాస్థాయి అధికారులు, ప్రభుత్వ పెద్దలలో విస్తృత చర్చకు దారితీశాయి. విషయం నేరుగా ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి వెళ్లింది. దీంతో సీఎం కార్యాలయం



మిగతా 4వ పేజీలో


దొరువులో ఉన్న కనకదుర్గమ్మ దేవాలయం

డీఈవోకు షోకాజ్ నోటీసు

- డీఆర్సీ సమావేశానికి గైర్హాజరుపై కలెక్టర్ సీరియస్



ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్‌కుమార్‌కు కలెక్టర్ తమీమ్ అన్సారియా షోకాజ్ నోటీసు ఇచ్చారు. ఒంగోలులో సోమవారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అధ్యక్షతన జిల్లా సమీక్షా మండలి (డీఆర్సీ) సమావేశం జరిగింది. ఈ సమావేశానికి డీఈవో గైర్హాజరయ్యారు. దీనిపై కలెక్టర్ సీరియస్ అయ్యారు. షోకాజ్ నోటీసు జారీ చేశారు.

చరిత్రకు చిహ్నం.. ఏదీ వైభవం

ప్రాభవం కోల్పోతున్న కనిగిరి దుర్గం దొరువు

- ఆక్రమణలతో కుంచించుకుపోతున్న వైనం
- చిల్లచెట్లతో మూసుకుపోయిన ఊటబావి
- శతాధిక మర్రిచెట్టుకు పొంచి ఉన్న ముప్పు

వివరాలు 4వ పేజీలో


బ్యాంకర్ల సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ అన్సారియా, ఎస్పీ దామోదర్, అధికారులు

బ్యాంకర్లు ఉదారతతో వ్యవహరించాలి

- రుణాల మంజూరుకు ముందుకురావాలి
- కౌలు రైతులకు ప్రాధాన్యం ఇవ్వాలి
- కలెక్టర్ తమీమ్ అన్సారియా సూచన

4

'పొలం పిలుస్తోంది' పేలవం

- పత్తాలేని అనుబంధ శాఖల అధికారులు
- తూతూమంత్రంగా అవగాహన కార్యక్రమాలు

పొదిలి, నవంబరు 5 : ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పొలం పిలుస్తోంది కార్యక్రమం క్షేత్రస్థాయిలో పేలవంగా సాగుతోంది. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి రైతులను రాజుగా చూడాలనే ఉద్దేశంతో పొలం పిలుస్తోందిని ప్రభుత్వం అమలు చేస్తోంది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ, అనుబంధ శాఖల సిబ్బంది పాల్గొని రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వాల్సి ఉంది. అయితే క్షేత్రస్థాయిలో అందుకు విరుద్ధంగా సాగుతోంది. వ్యవసాయశాఖ అధికారులు మినహా మిగిలిన శాఖల వారు అప్పుడప్పుడు చుట్టపుచూపుగా వస్తున్నారు. కొన్నిశాఖల అధికారులు కనీసం కనిపించడం కూడా లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్థక, పట్టుపరిశ్రమ శాఖ, ఆత్మ, ఎంఐపీ, పాడి పరిశ్రమ, మార్కెటింగ్ శాఖలతోపాటు ప్రజాప్రతినిధులు పాల్గొనాలి. వీటితోపాటు రైతుమిత్ర సంఘాలు, భూసార పరిరక్షణ అధికారులు పాల్గొని వ్యవసాయ అభివృద్ధికి అవసరమైన సలహాలు ఇవ్వాలి. ప్రతి మంగళ, బుధవారాల్లో రెండు గ్రామాల్లో ఉదయం 8.30 నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 2 నుంచి 5.30 గంటల వరకు జరిగే పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పొలాలను పరిశీలించి అభ్యుదయ రైతులను ప్రోత్సహించాల్సి ఉంది. ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాలపై అవగాహన

మిగతా 4వ పేజీలో


ఏలూరులో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏవో, ఉద్యాన అధికారి మినహా కనిపించని ఇతర శాఖల అధికారులు

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత



రామకోటమ్మకు చెక్కును అందజేస్తున్న మంత్రి స్వామి

టంగుటూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎం.నిడమలూరుకు చెందిన కట్టా రామకోటమ్మకు సీఎం సహాయ నిధి నుంచి రూ.67వేలు మంజూరైంది. అందుకు సంబంధించిన చెక్కును మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి తూర్పునాయుడుపాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆమెకు మంగళవారం అందజేశారు. సురేష్‌రెడ్డి, ఎం.నిడమలూరు టీడీపీ నాయకులు బోడపాటి అంజిబాబు, టీడీపీ ఎస్సీసెల్ మండల నాయకుడు పిడుగురాళ్ల సురేష్ పాల్గొన్నారు.

సెక్టోరల్ పోస్టులకు సగం మందికిపైన అనర్హులే!

(3వ పేజీ తరువాయి)

నోటిఫికేషన్ ఇచ్చారు. అయితే దానిని నిలిపివేసి తాజాగా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నోటిఫికేషన్ ఇచ్చారు.

అనర్హులు ఇలా...

సమగ్ర శిక్షలోని ఆరు సెక్టోరల్ పోస్టులకు 58మంది, స్కూలు అసిస్టెంట్లు దరఖాస్తు చేసుకున్నారు. సీఎంవో పోస్టుకు అత్యధికంగా 17మంది, జీసీడీవో పోస్టుకు అతి తక్కువగా కేవలం రెండు దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. సీఎంవో పోస్టుకు దరఖాస్తు చేసిన 17 మందిలో పది మంది అర్హులు కాగా ఏడుగురు అనర్హులు. ఐఈ కోఆర్డినేటర్ పోస్టుకు ఎనిమిది మంది దరఖాస్తు చేసుకోగా వీరిలో ఇద్దరు మాత్రమే అర్హులు కాగా ఆరుగురు అనర్హులు. ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ పోస్టుకు 14మందిలో ఆరుగురు అర్హులు కాగా 8మంది అనర్హులుగా తేలారు. జీసీడీవో పోస్టుకు ఇద్దరిని అర్హులుగా గుర్తించారు. ఎంఐఎస్‌అండ్ ప్లానింగ్ కోఆర్డినేటర్ పోస్టుకు తొమ్మిది మంది దరఖాస్తు చేయగా వీరిలో ముగ్గురు అర్హులు కాగా ఆరుగురు అనర్హులు. ఏఎస్‌వో పోస్టుకు ఎనిమది మంది దరఖాస్తు చేసుకోగా ముగ్గురు అర్హులు, ఐదుగురు అనర్హులుగా తేలారు. సెక్టోరల్ పోస్టులకు కొన్ని అర్హతలను నిర్దేశించారు. గతంలో ఐదు సంవత్సరాలకుపైగా ప్రాజెక్టులో పనిచేసిన వారు అనర్హులు. అదేవిధంగా స్కూలు అసిస్టెంట్‌గా కనీసం ఎనిమిది సంవత్సరాలు సర్వీసు కలిగి స్థానికులై ఉండాలి. 58 సంవత్సరాల లోపు వయస్సు ఉండాలి. కొన్ని పోస్టులకు పీజీ విద్యార్హతలు. ఎంఐఎస్‌అండ్ ప్లానింగ్ కోఆర్డినేటర్ పోస్టుకు గణితంలో స్టాటిస్టిక్స్, కంప్యూటర్ కోర్సు ఉండాలి. ఈ అర్హతలు లేని వారిని అనర్హులుగా ప్రకటించారు.

చర్యలకు సిద్ధం

(3వ పేజీ తరువాయి)

కూడా దీనిపై దృష్టి సారించింది. అలాగే సోమవారం కూడా డీఆర్సీ సమావేశానికి వచ్చిన ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కూడా ఈ వ్యవహారంపై జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడి తక్షణ చర్యలకు సూచించారు.

పాలకమండలి సమావేశంలో..

ఆ నేపథ్యంలో మంగళవారం బ్యాంకు పాలకమండలి సమావేశం పర్సన్ ఇన్‌చార్జీ అయిన జేసీ గోపాలకృష్ణ నేతృత్వంలో మంగళవారం బ్యాంకులో జరిగింది. కలెక్టర్ సూచనల మేరకు సీఈవో విషయంపై చర్చ కోసం ఆ మీటింగ్ నిర్వహించినా అందులో తక్షణం ఎలాంటి నిర్ణయం తీసుకోలేకపోయారు. సీఈవోను తొలగించడం కన్నా ఆయనే రాజీనామా చేస్తే బాగుటుందన్న భావనతో పర్సన్ ఇన్‌చార్జీ సూచనలతో బ్యాంకు అధికారులు పలుమార్లు సీఈవోతో సంప్రదింపులు చేసినట్లు సమాచారం. ఈ విషయంలో రోజంతా హైడ్రామా జరగ్గా ఎట్టకేలకు రాత్రి సమయానికి సీఈవో తన రాజీనామాను పీఏసీ చైర్మన్‌కు ఇచ్చినట్లు తెలిసింది. అయితే దానిని ధ్రువీకరించి చెప్పేందుకు బ్యాంకు ప్రస్తుత అధికారులు ధైర్యం చేయడం లేదు. మొత్తం మీద సీఈవో కోటిరెడ్డి రాజీనామా చేసినట్లు సహకార బ్యాంకు ఉద్యోగులలో రాత్రి పొద్దుపోయాక విస్తృత చర్చ సాగింది. ఆ విషయం అలా ఉంచితే బ్యాంకులో అక్రమాలు, కలెక్టర్ రాసిన లేఖలపై ఉన్నతాధికారులు సకాలంలో స్పందించని విషయం సీఎం దృష్టికి వెళ్లింది. దీంతో ప్రస్తుత సహకార శాఖ రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు కదిలారు. బ్యాంకులో అక్రమాలను నిగ్గుతేల్చేందుకు సెక్షన్ 51 విచారణ వైపు మొగ్గుచూపుతున్నట్లు సమాచారం. ఇందుకు సంబంధించి ఉన్నతాధికారులు పలు విషయాలపై మంగళవారం కలెక్టర్ అన్సారియాతో మాట్లాడినట్లు తెలిసింది. ఫిర్యాదులో పేర్కొన్న అంశాలపై ప్రాథమిక నివేదిక ఇవ్వాలని కలెక్టర్‌కు వారు సూచించినట్లు తెలిసింది. ఆ నివేదిక ఆధారంగా సెక్షన్ 51 విచారణ వేసే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం.

క్వారీల్లో తనిఖీలు

చీమకుర్తి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి) : రామతీర్థం గ్రానైట్ క్వారీల్లో నిర్వహిస్తున్న భద్రతా వారోత్సవాల్లో భాగంగా తనిఖీ బృందాలు రెండోరోజైన మంగళవారం తనిఖీలు నిర్వహించారు. గోల్డెన్ గ్రానైట్ క్వారీలో మేనేజర్ గిరి తనిఖీ బృంద సభ్యులకు స్వాగతం పలికారు. కార్మికులతో భద్రతా ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం క్వారీలో నిర్వహించే కార్యకలాపాలను బృందసభ్యులు పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేశారు. పెరల్, మిడ్‌వెస్ట్, జెమ్, కామాక్షి, బీబీఎల్ గ్రానైట్ క్వారీల్లో తనిఖీలు జరిపారు.

చరిత్రకు చిహ్నాం.. ఏదీ వైభవం

- ప్రాభవం కోల్పోతున్న దుర్గం దొరువు
- ఆక్రమణలతో కుంచించుకుపోతున్న స్థలాలు
- చిల్లచెట్లలో ఊటబావి
- శతాధిక ఊడల మర్రిచెట్టుకు పొంచి ఉన్న ముప్పు

కనిగిరి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణ దేవరాయల కాలం నాటి దొరువుకు దుర్గతి పట్టింది. దొరువు ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా మారుస్తామన్న హామీ కలగా



శతాధిక ఊడల మర్రిచెట్టును నరికి ఆ కొమ్మలను తరలిస్తున్న దృశ్యం

మారింది. పాలకులు పట్టించుకోకపోవడంతో కనిగిరి చారిత్రక రుజువులు కనుమరుగయ్యే పరిస్థితి నెలకొంది. దుర్గం దొరువుకి ఎంతో చరిత్ర ఉంది. శ్రీకృష్ణదేవరాయులు కనిగిరి ప్రాంతాన్ని పాలించిన రోజుల్లో ప్రజలు, సైనికులు, రాజకుటుంబాల కోసం కొండ కింద దొరువును నిర్మించారు. ఆ తర్వాత వచ్చిన యాదవ రాజులు, బహమనీ సుల్తానులు, బ్రిటీషు పాలకులు కూడా ఈ దొరువు నీటినే వాడుకునేవారు. ప్రస్తుతం దొరువు నీరంతా పచ్చగా మారి దుర్వాసన వస్తుంది. దశాబ్దాలు మారుతున్నా దొరువు అభివృద్ధికి ఎవరూ ముందుకు రాకపోవటంతో నాటి ప్రాభవం కోల్పోతుంది.

దొరువు స్థలంలో ఆక్రమణలు

పట్టణంలోని దొరువు కొండ కింద ఐదు ఎకరాల స్థలం ఉంది. 2009లో ఎమ్మెల్యేగా ఉన్న ముక్కు ఉగ్రనరసింహారెడ్డి దొరువు కట్టకు రక్షణగా ఫెన్సింగ్ వేయించారు. ఆ తర్వాత ఆ ఫెన్సింగ్ ఆనవాళ్లు కూడా లేకుండా ఆక్రమణకు గురవుతోంది. కొంత మంది శాశ్వత నిర్మాణాలు చేసుకున్నారు. మరికొంతమంది స్థలాలను కబ్జా చేసి రిజస్ట్రేషన్లు పుట్టించినట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. దొరువు కట్ట స్థలం రెండు వైపులా కొంతమేర ఆక్రమణకు గురయింది. ఆ ప్రాంతం చిల్లచెట్లు, పిచ్చిచెట్లతో నిండి చీకటి కార్యకలాపాలకు కేంద్రంగా మారింది. పోలీసులు కూడా అటువైపు వెళ్ళకపోవటంతో కార్యకలాపాలకు అడ్డాగా మారింది. పర్యాటక కేంద్రం మాట అటుంచి కనీసం ప్రాభవాన్ని కాపాడాల్సిన మున్సిపాల్టీ పాలకులు ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు.

నిరుపయోగంగా ఊటబావి

నాటి చారిత్రక వైభవాలకు ఆలవాలంగా ఉన్న గుర్తులు చెరిపేసేందుకు కొంతమంది అక్రమార్కులు దుశ్చర్యలకు పాల్పడుతున్నారు. దుర్గం పాలనా వైభవంలో సైనికులకు, వారి అశ్వాలకు, ఏనుగులకు సేద తీర్చిన దొరువు వద్ద ఉన్న శతాధిక ఊడల మర్రిచెట్టుకు ప్రస్తుతం ముప్పు వాటిల్లే దుస్థితి ఏర్పడింది. కొంతమంది అక్రమార్కులు దొరువు ప్రాంతంలో రిజిస్ట్రేషన్లు పుట్టించి, చివరకు ఊడల మర్రిచెట్టు కూడా రిజిస్ట్రేషన్ సర్వేలో నిదే అని ప్రచారం చేయటం అనుమానాలకు తావిస్తుంది. కనిగిరి ప్రజల దాహార్తిని తీర్చిన ఊట బావి నిరుపయోగంగా మారింది.



పాచిపట్టిన దుర్గం దొరువు నీరు



అక్రమ నిర్మాణాలతో కుచించుకు పోతున్న దొరువు కరకట్ట

ప్రశ్నార్థకంగా మారిన పార్కు ఏర్పాటు

నగర పంచాయతీ వైసీపీ పాలకవర్గం ఏర్పడి నాలగో సంవత్సరం పూర్తి కావస్తుంది. ఎన్నికల సందర్భంగా ప్రస్తుత పాలకవర్గం నేతలు దొరువును పార్కుగా తీర్చిదిద్దుతామని, పర్యాటక కేంద్రంగా మారుస్తామని ఇచ్చిన హామీ నెరవేర్చలేక పోయారు. దొరువు అభివృద్ధికి విడుదల చేసిన రూ.2 కోట్లు దుర్వినియోగమయ్యాయి. దొరువు కట్ట వద్ద ఉన్న శతాదిక ఊడల మర్రిచెట్టు చుట్టూ అరుగు ఏర్పాటుచేసి పాదచారులు సేదతీర్చుకునే ఏర్పాట్లు చేస్తామని చెప్పిన హామీ నెరవేర్చ లేదు. దొరువులో వ్యర్థాలతో ఆ ప్రాంతమంతా దుర్వాసన వస్తుంది. దీంతో దొరువు వద్ద ఉన్న దేవాలయాలకు భక్తులు రావాలంటేనే జుగుప్సాకరంగా మారింది. కొండపైన దుర్గాదేవి ఆలయాలకు వెళ్లే భక్తులు ముక్కు మూసుకుని వెళ్లే పరిస్థితి ఏర్పడింది.

నాటి ప్రాభవాన్ని కాపాడాలి

- సోమిశెట్టి శ్రీనివాసులు, మానవతా సంస్థ సభ్యులు, హిందూ ధార్మికులు

ఎంతో పురాతన చరిత్రకు సాక్ష్యంగా ఉన్న రాయల దుర్గం దొరువు ప్రాభవాన్ని కాపాడాల్సిన ఆవశ్యకత ప్రభుత్వంపై, మున్సిపాల్టీ పాలకులపై ఉంది. ఆప్రాంతం అపరిశుభ్రంగా మారింది. ఇక్కడ అంకాలమ్మ దేవాలయం, దొరువు శివాలయం, బ్రహ్మంగారి ఆలయం, కొండపైన విజయమార్తేండేశ్వరాలయం, దొరువులో దుర్గాంబాలయం ఉంది. ఆయా దేవాలయాలకు వెళ్ళాలంటే భక్తులకు అసౌకర్యంగా మారింది. ఇప్పటికైనా పాలకులు స్పందించి దుర్గం దొరువు ప్రాంతాన్ని ఆహ్లాదకర, అధ్యాత్మిక ప్రాంతంగా తీర్చిదిద్దాలి.

కూటమి ప్రభుత్వ పాలన ఘోరం

రాష్ట్రంలో దాడులు,మహిళలపై అత్యాచారాలు, హత్యలు : కారుమూరి

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలన ఘోరంగా ఉందని వైసీపీ రీజనల్ కో ఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు ఆరోపించారు. ప్రభుత్వం వచ్చిన ఐదు నెలల కాలంలోనే దాడులు, హత్యలు, అత్యాచారాలు జరుగుతున్నా పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. స్థానిక వైసీపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి పాలనపై ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తిడుతున్నారంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. కూల్‌డ్రింక్‌ల కన్నా మద్యమే అధికంగా దొరుకుతుందని ఎద్దేవాచేశారు. ప్రభుత్వం రాష్ట్రంలో ఎక్కడైనా ఉచిత ఇసుక లభిస్తుందా అని ప్రశ్నించారు. జమిలి ఎన్నికలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. వైసీపీ ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ క్రిమినల్స్ కంటే పోలీస్ వ్యవస్థ బలహీన పడిందని, కూటమి మంత్రులే అంగీకరిస్తున్నారని చెప్పారు. ప్రజల పక్షాన నిలబడి వైసీపీ పోరాటం చేస్తోందన్నారు.



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులతో సమావేశం

వైసీపీ జిల్లా పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ నాగేశ్వరరావు పార్టీలోని వివిధ సంఘాల నేతలతో సమావేశం నిర్వహించారు. జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ వెంకాయమ్మ, దర్శి, వైపాలెం ఎమ్మెల్యేలు డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి, చంద్రశేఖర్, ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు అన్నా రాంబాబు, కే నాగార్జునరెడ్డి, బుర్రా మధుసూదన్‌యాదవ్, టీజేఆర్ సుధాకర్‌బాబు, కసుకుర్తి ఆదెన్న, నియోజకవర్గ ఇన్‌చార్జులు హనిమిరెడ్డి, దద్దాల నారాయణ, ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు తదితరులు ఉన్నారు.

మధ్యలోనే వదిలేశారు

(3వ పేజీ తరువాయి)

మాత్రమే ప్రాధాన్యం ఇచ్చి ఇప్పటివరకు ఐదు కాలేజీలను మాత్రమే ప్రారంభించారు. మిగిలిన కాలేజీల నిర్మాణాలకు గత ప్రభుత్వం సక్రమంగా నిధులు కేటాయించకపోవడంతో ఎక్కడి పనులను అక్కడే కాంట్రాక్టర్ నిలిపివేశాడు. ఈ సంవత్సరం ఐదు కాలేజీలు ప్రారంభం కావాల్సి ఉంది. పనులు పూర్తికాలేదని నేషనల్ మెడికల్ కౌన్సిల్ ఈ సంవత్సరం జూన్‌లో తనిఖీలు చేపట్టి అడ్మిషన్లను నిలిపివేసింది. దీంతో ప్రస్తుత ప్రభుత్వం కాలేజీల నిర్మాణాలను ఏవిధంగా ముందుకు తీసుకెళ్లాలనే అంశంపై ఉన్నతస్థాయిలో మేధోమథనం చేస్తున్నారు. పబ్లిక్ ప్రైవేటు పార్టనర్‌షిప్ (పీపీపీ) విధానం మెరుగైనదని కూటమి ప్రభుత్వం యోచిస్తోంది. ఈక్రమంలో దాదాపు అన్ని కాలేజీల నిర్మాణాలను గంపగుత్తగా తీసుకున్న కాంట్రాక్ట్ సంస్థ మెగా ఇంజనీరింగ్ కాలేజీల వద్ద నుంచి నిర్మాణ సామగ్రిని తరలించే పనిలో పడింది. మార్కాపురం మెడికల్ కాలేజీ వద్ద నుంచి కూడా గత రెండు రోజులుగా నిర్మాణ సామగ్రిని తరలిస్తోంది.



పునాదుల దశలోనే వైద్యశాల నిర్మాణం

పనులు పూర్తైంది 19 శాతమే..

మార్కాపురం మెడికల్ కాలేజీకి మండలంలోని రాయవరం వద్ద ప్రభుత్వం 50 ఎకరాలను కేటాయించింది. మొత్తం రూ.475 కోట్లతో బోధనాసుపత్రిని నిర్మించాల్సి ఉంది. 2022లోనే అన్ని కాలేజీలకు వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేసినా నిర్మాణ కాంట్రాక్ట్ సంస్థ 2023 ఫిబ్రవరిలో ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. అదేసంవత్సరం పనులు ప్రారంభించింది. కానీ మొదటి నుంచి పనులు నత్తనడకన సాగుతున్నాయి. 2024-25 విద్యాసంవత్సరంలో తరగతులు నిర్వహించాలని యోచించి పట్టణంలోని ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో అప్పటికే ఉన్న 150 పడకలకు అదనంగా మరో 300 పడకల నిర్మాణాన్ని తాత్కాలిక పద్ధతిలో నిర్మాణం చేసింది. ఆపడకలు 2024 జూన్‌లో అందుబాటులోకి వచ్చాయి. సుమారు రూ.8 కోట్లు కేటాయించినా కాంట్రాక్ట్ సంస్థ మెగా ఇంజనీరింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ రూ.3 కోట్ల పనులు మాత్రమే చేసింది. ఇంకా అక్కడ రూ.5 కోట్ల మేర పనులు పెండింగ్‌లో ఉన్నాయి.

పునాదుల్లోనే పనులు

రాయవరంలోని మెడికల్ కాలేజీ వద్ద మొత్తం 28 రకాలైన నిర్మాణాలను పూర్తిచేయాల్సి ఉంది. వైద్యశాలకు సంబంధించి పునాదుల స్థాయిలోనే పనులు నిలిచిపోయాయి. కాలేజీకి సంబంధించిన పనులు మాత్రం 40శాతం మేర పూర్తయ్యాయి. విద్యార్థుల హాస్టల్ భవనాల ప్రగతికి కూడా ఓ మోస్తరుగానే ఉంది. మిగిలిన వాటిలో 15 విభాగాలకు చెందిన పనులు ఇంకా ప్రారంభించలేదు. మొత్తం మీద ఇప్పటివరకు 20శాతంలోపు మాత్రమే పనులు జరిగాయి. నిర్మాణం పూర్తిచేసేందుకు గడువు 2025 జూలై వరకు ఉన్నా పనుల తీరును చూస్తే మరో రెండేళ్లకు పైగానే పట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి.

సామగ్రిని తరలిస్తున్న విషయం తెలియదు

విజయభాస్కర్, ఈఈ, ఏపీఎంఐడీసీ

మార్కాపురం మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు ఇప్పటి వరకు 19శాతం మాత్రమే పూర్తయ్యాయి. పనులు చేస్తున్న మెగా ఇంజనీరింగ్ సంస్థకు పెండింగ్ బిల్లులు ఇవ్వాల్సి ఉంది. కాలేజీ వద్ద నుంచి వారికి సంబంధించిన సామగ్రిని ఇతర పనుల వద్దకు తరలించి ఉండొచ్చు. ఆ విషయం మా దృష్టికి రాలేదు. ప్రభుత్వం ఏజెన్సీని మార్చాలనే ఉద్దేశంతో ఉన్నట్లు తెలుసుకుని సామగ్రిని తరలిస్తున్నారేమో.

'పొలం పిలుస్తోంది' పేలవం

(3వ పేజీ తరువాయి)

కల్పించాలి. ముఖ్యంగా ఉద్యానవన పంటల సాగులో మెళకువలను నేర్పించాలి. పాడిపరిశ్రమ గ్రామీణ ఆర్థికాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తుంది. ఈనేపథ్యంలో పశుపోషకులకు అవగాహన కల్పించాలి. అదేవిధంగా భూసార పరీక్షలు నిర్వహించి మట్టినమూనాలను సేకరించడంతో పాటు అందుకు అనుగుణంగా రైతులు వినియోగించాల్సి ఎరువులపై స్పష్టత ఇవ్వాల్సి ఉంది. దీంతో పాటు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడం మార్కెటింగ్ కమిటీల ద్వారా ఉత్పత్తులను విక్రయించడం అందుకు అవసరమైన కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాల్సి ఉంది. రైతులు పండించిన పంట ఉత్పత్తులను నిల్వచేసుకునేందుకు అవసరమైన గిడ్డంగులను నిర్మించడం వంటి రైతుప్రయోజన కార్యక్రమాలు చేపట్టాలి.

వ్యవసాయాధికారులు మాత్రమే హాజరు

వ్యవసాయ అధికారులు మాత్రమే కార్యక్రమంలో పాల్గొని ముందుకు సాగిస్తున్నారు. దీంతో పొలం పిలుస్తోంది పేలవంగా సాగుతోంది. గ్రామస్థాయి ప్రజాప్రతినిధులు సైతం అటువైపు కన్నెత్తి చూసిన దాఖలు కూడా లేకపోవడం శోచనీయం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని ముఖ్యంగా పొలంబడి కార్యక్రమంలో పాల్గొనాల్సిన ఆయా శాఖలు సిబ్బంది పాల్గొనే విధంగా చూడాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ ఆశయం నెరవేర్చే విధంగా సమర్థవంతంగా పొలంబడి కార్యక్రమాలు జరిగే విధంగా చూడాలని రైతులు కోరుతున్నారు.

అనుబంధ శాఖల అధికారులు డుమ్మా

పొదిలి మండలంలో గత నెలరోజులుగా జరుగుతున్న కార్యక్రమాలను పరిశీలిస్తే అక్టోబరులో జువ్వలేరు, ఈగలపాడు, పాములపాడు, కుంచేపల్లి, తలమళ్ల, ఆముదాలపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాలు జరిగాయి. అయితే ఈ గ్రామాల్లో జరిగిన కార్యక్రమాలకు కేవలం వ్యవసాయశాఖకు సంబంధించిన అధికారులు, గ్రామ సహాయకులు మినహా ఏశాఖ అధికారులు పాల్గొన లేదు. అయితే మంగళవారం ఏలూరు, ఉప్పలపాడు గ్రామాల్లో జరిగిన కార్యక్రమంలో మాత్రం ఉద్యాన అధికారి పాల్గొన్నారు. గతంలో మల్లవరం గ్రామంలో జరిగిన కార్యక్రమానికి పశువైద్యాధికారి హాజరయ్యారు. మిగిలిన వారంతా డుమ్మా కొట్టారు.

బ్యాంకర్లు ఉదారతతో వ్యవహరించాలి

కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): అల్పాదాయ వర్గాలు, స్వయం సహాయక సంఘాలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, కౌలు రైతులకు రుణాలు మంజూరు చేయడంలో బ్యాంకర్లు ఉదారతతో వ్యవహరించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో మంగళవారం సాయంత్రం డిస్ట్రిక్ కన్సల్టేటివ్ కమిటీ(డీసీసీ), డిస్ట్రిక్ లెవల్ రివ్యూ కమిటీ (డీఎల్ఆర్సీ) సమావేశానికి కలెక్టర్ అధ్యక్షత వహించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలకు సంబంధించి నిర్దేశిత లక్ష్యాల మేరకు లబ్ధిదారులకు రుణాలు ఇవ్వాలన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో జిల్లా క్రెడిట్ ప్లాన్ లక్ష్యం రూ.20,591.18 కోట్లు నిర్ణయించగా ఈ ఏడాది సెప్టెంబరు 30 నాటికి రూ.13,420.90 కోట్ల రుణాలు మంజూరు చేశారన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో పంట రుణాలకు సంబంధించి ఖరీఫ్‌లో రూ.3,900.40 కోట్ల లక్ష్యం కాగా, రూ.5,141.38 కోట్లతో లక్ష్యానికి మంచి రుణాలు మంజూరు చేశారన్నారు రబీలో రూ.4737.16 కోట్లుగా నిర్ణయించినట్లు తెలిపారు. సీసీఆర్సీ కార్డ్ ఉన్న ప్రతి కౌలు రైతుకు అర్హత మేరకు రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ సూచించారు. డీఆర్డీఏ ద్వారా 32,657 స్వయం సహాయక సంఘాలకు రూ.1671.03కోట్లు రుణాలు మంజూరు లక్ష్యంగా నిర్ణయించగా 10,880 సంఘాలకు రూ.715.43 కోట్లు ఇచ్చారన్నారు. లక్ష్యం మేరకు సంఘాలకు రుణాలు ఇచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అన్నిరకాల సంక్షేమ పథకాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ఎస్పీ ఏఆర్.దామోదర్ సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండేలా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. అపరిచితుల నుంచి ఎస్ఎంఎస్‌లు, ఈ మెయిల్, వాట్సాప్‌ల ద్వారా వచ్చే బ్లూకలర్ లింక్స్‌ను క్లిక్ చేస్తే మీ మొబైల్ డేటా మొత్తం సైబర్ నేరగాళ్ల చేతిలోకి పోతుందన్నారు. ఎవరైనా మోసపోతే వెంటనే 1930కి కాల్ చేయాలని సూచించారు. సమావేశంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ రమేష్, వివిధ శాఖల అధికారులు వసుంధర, రవికుమార్, శ్రీనివాసులు, డాక్టర్ బేబిరాణి, వెంకటేశ్వర్లు, రమణ, శ్రీనివాసరావు, ఉదయకుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

అర్జీలను సహేతుకంగా పరిష్కరించాలి

కలెక్టర్ అన్సారియా ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం) అర్జీలు సహేతుకంగా పరిష్కారమయ్యేలా పర్యవేక్షించాల్సిన బాధ్యత సంబంధిత డివిజన్ సబ్‌కలెక్టర్, ఆర్డీవోలదేనని జిల్లాకలెక్టర్ తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. స్థానిక కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో జాయింట్‌కలెక్టర్ గోపాలకృష్ణతో కలిసి ఒంగోలు డివిజన్ పరిధిలోని రెవెన్యూ అధికారులతో మంగళవారం జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. అర్జీలను క్షేత్రస్థాయి అధికారులు పరిష్కరిస్తున్న తీరును ఆయా డివిజనల్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. మీకోసం అర్జీలను పరిష్కరిస్తున్న తీరుపై ఆడిట్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రెవెన్యూ సమస్యలపై వస్తున్న అర్జీలు రాన్రాను తగ్గుముఖం పడుతున్నాయని చెప్పారు. జేసీ గోపాలకృష్ణ మాట్లాడుతూ అర్జీల పరిష్కారం గడువు చివరి తేదీ వరకు వేచి చూడవద్దన్నారు. సాగునీటి సంఘాలకు ఎన్నికలు ఉన్నందున నీటి వనరులు ఆక్రమణలకు గురికాకుండా చూడాలని చెప్పారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి చిన్న ఓబులేషు, ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న, డీఎస్‌వో పద్మశ్రీ, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల భారాలు ప్రజలపై మోపొద్దు



మాట్లాడుతున్న ఈశ్వరయ్య

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల భారాలు ప్రజలపై మోపకుండా ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. స్థానిక మల్లయ్యలింగం భవన్‌లో జిల్లా కార్యవర్గ సమావేశం అనంతరం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలలు గడవక ముందే రూ.6.72వేల కోట్లు విద్యుత్ భారాలు పెంచేందుకు సమాయత్తమైందన్నారు. ఎన్నికల ముందు ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పెంచిన విద్యుత్ భారాలను ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. మూడు జిల్లాల ప్రజల కరువును నివారించే వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణంపై వారంలో ఒక రోజులో ప్రభుత్వం సమీక్ష చేయాలలన్నారు. కనిగిరి ప్రాంతంలో నిమ్జ్ ఊసేలేదన్నారు. నిర్మాణాలు చేపట్టకపోతే ఆ భూములను రైతులకు వెనక్కు ఇవ్వాలన్నారు. ఖరీఫ్, రబీ సీజన్లు దాటుతున్న ప్రకటించిన రూ.20వేల పెట్టుబడి సాయం ఏదని ప్రశ్నించారు. ప్రజాసమస్యల పరిష్కారం కోసం సీపీఐ ఆధ్వర్యంలో ఈనెల 18న సచివాలయాల ఎదుట జరిగే ధర్నాలను విజయవంతం చేయాలని కోరారు. పట్టణ ప్రాంతంలో పేదలకు రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడుసెంట్ల ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్నారు. టిడ్కో గృహాలను వెంటనే పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లాకార్యదర్శి ఎంఎల్.నారాయణ, ఆర్.వెంకట్రావు, అందే నాసరయ్య, కొత్తకోట వెంకటేశ్వర్లు, రామకృష్ణ, ప్రభాకర్, నల్లూరి మురళీ, విజయ, బాలకోటయ్య పాల్గొన్నారు.

గ్రానైట్ ఫ్యాక్టరీల సమస్యల పరిష్కారానికి కృషి

- మార్కాపురం ఎమ్మెల్యే కందుల

చీమకుర్తి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి) : గ్రానైట్ ఫ్యాక్టరీ ఓనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించటానికి స్థానిక ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్‌తో కలిసి తాను కృషి చేస్తానని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తెలిపారు. రామతీర్థం వద్ద ఉన్న వీటీసీలో గ్రానైట్ ఫ్యాక్టరీ ఓనర్ల అసోసియేషన్ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే కందుల మాట్లాడుతూ డీఎంఎఫ్ నిధులు వినియోగించి గ్రానైట్ ప్రభావిత ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని డీఆర్సీ సమావేశంలో ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని కోరినట్లు తెలిపారు. గ్రానైట్ వ్యర్థాలు డంప్ చేయటానికి స్థలాన్ని కొని ఇచ్చే పరిస్థితిలో ప్రభుత్వం లేదని, దగ్గరలో ఉన్న ప్రభుత్వ స్థలాలు, కొండపోరంబోకు స్థలాన్ని గుర్తించినట్లయితే సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. ఇక ప్రభుత్వం నుంచి అందాల్సిన సబ్సిడీ బకాయిలు, విద్యుత్ చార్జీల తగ్గింపుల గురించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని చెప్పారు. అనంతరం అసోసియేషన్ నాయకుడు కాట్రగడ్డ రమణయ్య, యర్రగుంట్ల శ్రీనివాసరావు, లగడపాటి శ్రీనివాసరావు, సూర్యప్రకాశరావు, నూకల సురేంద్ర, కందిమళ్ల గంగాధరరావు, ఉన్నం సుబ్బారావు, అహ్మద్ బాషా, భవాని ప్రసాద్, మలినేని వెంకటేశ్వర్లు, రాము, సుబ్బారావు, శ్రీనివాసరెడ్డి, నూకల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. అనంతరం నేతలను సన్మానించారు.త



ఎమ్మెల్యే కందులను సత్కరిస్తున్న అసోసియేషన్ నాయకులు

భక్తి శ్రద్ధలతో నాగులచవితి


నాగయ్యకు క్షీరం




రంగారాయుడు చెరువు పుట్ట వద్ద బారులు

నాగులచవితి పర్వదిన వేడుకలు మంగళవారం జిల్లాలో అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగాయి.కార్తీకమాసం శుద్ధ చవితిని నాగులచవితి పర్వదినంగా భావించి ఆ రోజున నాగేంద్రుని పూజించటం ఆనవాయితీ. ఒంగోలు నగరంలోని వివిధ ప్రదేశాల్లో ఉన్న నాగేంద్రుని పుట్టల దగ్గరకు వేకువ నుంచే భారీ సంఖ్యలో భక్తులు వచ్చి పూజలు చేశారు. రంగారాయుడు చెరువు దగ్గర ఉన్న పుట్ట వద్ద రద్దీ నెలకొంది. ఐశ్వర్యనగర్, అన్నవరప్పాడు, భాగ్యనగర్, స్కందగిరి మొదలైన చోట్ల నాగేంద్రుని పుట్టల్లో భక్తులు ఆవుపాలు పోసి, చలివిడి, వడపప్పు నివేదించారు. కేశవస్వామిపేట గంగా పార్వతీ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానం, తూర్పుపాలెం రాజరాజేశ్వరస్వామి దేవస్థానం, స్కందగిరి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం, సంతపేట సాయిబాబా మందిరం, అచలానంద ఆశ్రమం, ఐశ్వర్యనగర్ శ్రీకృష్ణమందిరాల్లో మహిళలు పెద్దసంఖ్యలో హాజరై పూజలు చేశారు.

- ఒంగోలు కల్చరల్


రంగారాయుడు చెరువు వద్ద పుట్టలో పాలుపోస్తున్న మహిళలు


మొక్కుతున్న యువతి

నేర వార్తలు

ట్రాక్టర్ అపహరణ

కామేపల్లి (జరుగుమల్లి), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కామేపల్లి గ్రామానికి చెందిన పత్తిపాటి నరసింహారావుకు చెందిన ట్రాక్టర్ అపహరణకు గురైంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం ఏపీ 40సిఎం 2677 నంబరు గల ట్రాక్టర్‌ను ఆయన నాలుగు నెలల క్రితం కొనుగోలు చేశారు. రోజూ మాదిరిగానే సోమవారం రాత్రి దాన్ని కొష్టం వద్ద ఉంచి ఇంటికి వచ్చారు. మంగళవారం ఉదయం చూడగా ట్రాక్టర్ కనిపించలేదు. దీంతో జరుగుమల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మద్యం అక్రమంగా విక్రయిస్తున్న మహిళ అరెస్టు

సింగరాయకొండ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జరుగుమల్లి మండలం వావిలేటిపాడులో మద్యం అక్రమంగా విక్రయిస్తున్న ఒక మహిళను ఎక్సైజ్ సీఐ మేడికొండ శివకుమారి మంగళవారం అరెస్ట్ చేశారు. ఆమె వద్ద ఆరు బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం సింగరాయకొండ సర్కిల్ కార్యాలయానికి తరలించారు. ఈ సందర్భంగా శివకుమారి మాట్లాడుతూ గ్రామాల్లో బెల్టు దుకాణాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

కానిస్టేబుల్ ఆత్మహత్యాయత్నం

మద్దిపాడు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మద్దిపాడు పోలీస్‌స్టేషన్‌లో పనిచేసే కానిస్టేబుల్ ఆత్మహత్యాయత్నం చేసుకున్న సంఘటన మంగళవారం జరిగింది. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో తాళ్లూరుకు చెందిన యానం వెంకటేశ్వరరెడ్డి కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన భార్య రెండు నెలల క్రితం మరణించింది. అప్పటి నుంచి వెంకటేశ్వర్లు ముభావంగా ఉంటూ మానసికంగా ఆందోళన చెందుతున్నాడు. ఈక్రమంలో ఆయన స్వగృహంలో ఎలుకల మందును అరటికాయలో పెట్టుకుని తినగా కొద్దిసేపటి తర్వాత గమనించిన కొడుకు, కోడలు ఒంగోలులోని ఆసుపత్రికి తరలించారు. అక్కడ ఆయనకు వైద్యం అందజేస్తున్న సమాచారం.

మద్యం దుకాణం వద్దని మంత్రికి వినతి

కొండపి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పొదిలి రోడ్డులోని ఓ ప్రైవేటు కల్యాణ మండపం సమీపంలో మద్యం దుకాణం ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. విషయం తెలుసుకున్న స్థానిక మహిళలు మంగళవారం కొండపిలో ఓ ప్రైవేటు కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖామంత్రి డాక్టర్ స్వామిని కలిశారు. తాము ఉండే ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయవద్దని, వేరేచోటకు మార్పించాలని కోరారు. స్పందించిన మంత్రి ఎక్సైజ్ అధికారులకు వెంటనే ఫోన్ చేసి కల్యాణ మండపం సమీపంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయవద్దని ఆదేశించారు. ఈ దుకాణం ఇప్పటి వరకు మండలంలోని పెట్లూరులో నడుస్తోంది. అక్కడ అమ్మకాలు తక్కువగా ఉండటంతో దాన్ని లైసెన్సుదారులు కొండపిలోని పొదిలి రోడ్డులో ఏర్పాటు చేయాలని ప్రయత్నిస్తున్నారు. ఆ ప్రాంతంలో కల్యాణ మండపంతో పాటు, ప్రైవేటు స్కూల్ ఉన్నాయి. గ్రామానికి దూరంగా ఏర్పాటు చేయించాలని స్థానికులు మంత్రికి విజ్ఞప్తి చేశారు.

ఆర్టీసీ అప్రెంటీస్‌షిప్‌నకు 13 నుంచి ఇంటర్వ్యూలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో అప్రెంటీస్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు కాకుటూరులోని ఆర్టీసీ జోనల్ సిబ్బంది శిక్షణ కళాశాలలో ఇంటర్వ్యూలు జరుగుతాయని ఆ కళాశాల ప్రిన్సిపల్ వీ శ్రీధర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రకాశం జిల్లాకు సంబంధించి 13వ తేదీ, నెల్లూరుకు 14వ తేదీ, తిరుపతి, చిత్తూరు జిల్లాలకు 15వ తేదీ ఇంటర్వ్యూలు జరుగుతాయని తెలిపారు.

మర్రిపూడిలో బీసీ బాలుర హాస్టల్

మంజూరు చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు

ఫలించిన మంత్రి స్వామి చొరవ

మర్రిపూడి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన మర్రిపూడిలో బీసీ బాలుర వసతి గృహం ఏర్పాటుకావాలన్న గ్రామస్థుల చిరకాల కోరిక ఎట్టకేలకు నెరవేరింది. రాష్ట్ర మంత్రి, స్థానిక శాసనసభ్యుడు అయిన డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి చొరవతో ప్రభుత్వం హాస్టల్‌ను మంజూరు చేసింది. కొండపిలో మూసివేసిన బీసీ బాలుర వసతి గృహాన్ని మర్రిపూడికి మారుస్తూ కలెక్టర్ తమీమ్ అన్సారియా ఉత్తర్వులు ఇచ్చారు. పొదిలి బీసీ బాలికల హాస్టల్ సంక్షేమ అధికారికి తాత్కాలికంగా ఇక్కడి వసతి గృహం బాధ్యతలు అప్పగించారు. మర్రిపూడిలో బీసీ బాలుర వసతి గృహం ఏర్పాటు చేయాలని గ్రామస్థులు చాలాకాలంగా కోరుతున్నారు. ఇదే విషయాన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ ఉప్పు సాయిబాబు ఇటీవల మంత్రి స్వామి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన మంత్రి వసతి గృహం ఏర్పాటు చేయాలని కలెక్టర్‌కు సూచించారు. అనంతరం జిల్లా బీసీ సంక్షేమ సహాయాధికారి శ్రీనివాసరావు క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. మర్రిపూడిలో హాస్టల్ ఏర్పాటు చేస్తే ఆ గ్రామంతోపాటు చుట్టుపక్కల గ్రామాల్లోని 244 మంది విద్యార్థులకు ఉపయోగపడుతుందని ఆయన ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. ఈనేపథ్యంలో మర్రిపూడికి బాలుర వసతి గృహం మంజూరు చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారు. వసతి గృహానికి అవసరమైన అద్దె భవనాలను పరిశీలించేందుకు రెండురోజుల్లో జిల్లా అధికారులు రానున్నారు.

ఈ సందర్భంగా మర్రిపూడి మండల ప్రజలు మంత్రి స్వామికి కృతజ్ఞతలు తెలిపారు.


మంత్రి స్వామి

ప్రజలందరూ మెచ్చేలా పనిచేయాలి

- అభివృద్ధి, సంక్షేమంలో సెక్రటరీలదే కీలక పాత్ర
- ఎమ్మెల్యేలు దామచర్ల, బీఎన్
- సచివాలయ సెక్రటరీలు, కార్పొరేషన్ సిబ్బందితో సమావేశం

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సచివాలయ సెక్రటరీలు ప్రజలు మెచ్చేలా పనిచేసి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని ఒంగోలు, సంతనూతలపాడు ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, బీఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం ఒంగోలు కార్పొరేషన్ ఆధ్వర్యంలో సచివాలయ సెక్రటరీలు, కార్పొరేషన్ సిబ్బందితో సమీక్ష సమావేశం మేయర్ గంగాడ సుజాత అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులుగా హాజరైన ఎమ్మెల్యేలు ప్రసంగించారు.

గతంలో లాగ పనిచేస్తే కుదరదు : దామచర్ల

సచివాలయాల్లో సేవలపై ప్రజలు మెచ్చుకునేలా ఉండాలని, గతంలోలాగ పనిచేస్తే కుదరదని ఎమ్మెల్యే దామచర్ల స్పష్టం చేశారు. ఇక నుంచి అనిన విభాగాల సెక్రటరీలు తమ సచివాలయం పరిధిలోని ప్రతి ఇంటికీ వెళ్లి కుటుంబ సమగ్ర సర్వే నిర్వహించాలని ఆదేశించారు. ఆ వివరాలను నమోదు చేసి కమిషనర్‌కు నివేదిక అందించాలని తెలిపారు. ఇకపై ప్రతి పది సచివాలయాలపై ఒక సూపర్‌వైజర్‌ను నియమించి పనితీరును పరిశీలిస్తామన్నారు. కూటమి ప్రభుత్వం అవినీతి లేని పాలన అందించే దిశగా సాగుతోందని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందాలని సూచించారు. రేషన్‌కార్డులు, ఇంటి స్థలాలు, పింఛన్లు, ఇతరత్రా సమస్యల అర్జీలను స్వీకరించి సకాలంలో ఆన్‌లైన్ చేయాలన్నారు. పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందాలని తెలిపారు. అలాగే కార్పొరేషన్‌లో ప్రక్షాళన మొదలైందని, ఇందుకోసం కార్పొరేషన్ కమిషనర్, ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్‌లో సమర్థవంతమైన అధికారులు వచ్చారన్నారు. వారి సూచనలు, ఆదేశాల మేరకు సమష్టిగా పనిచేయాలని ఆదేశించారు. సెక్రటరీలకు సమస్యలు ఏవైనా ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని దామచర్ల హామీ ఇచ్చారు. విధుల్లో నిర్లక్ష్యం వహించినా, ప్రజల నుంచి ఫిర్యాదులు అందినా చర్యలు తప్పవని హెచ్చరించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జనార్దన్, పక్కన ఎమ్మెల్యే బీఎన్, మేయర్ సుజాత

జవాబుదారీతనంగా ఉండాలి : బీఎన్

సచివాలయాల ఉద్యోగులు శ్రద్ధతో పనిచేస్తూ ప్రజలకు జవాబుదారీతనంగా ఉండాలని ఎమ్మెల్యే బీఎన్ పేర్కొన్నారు. వచ్చామా.. వెళ్లామా.. విధంగా కాకుండా మంచి సేవలు అందిస్తే ఫలితాలు మెరుగ్గా ఉంటాయన్నారు. ప్రజలు సంతోషంగా ఉండాలన్నా, పౌరసేవలు సక్రమంగా అమలు జరిగినపుడు అన్నీ సాధ్యపడతాయని చెప్పారు. అనంతరం కమిషనర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇకపై సచివాలయాల్లో సేవలపై సమీక్షలు, తనిఖీలు ఉంటాయని, విధులకు గైర్హాజరు కాకుండా, మూమెంట్ రిజిస్టరు పాటించాలన్నారు. డిప్యూటీ మేయర్ వేమూరి బుజ్జి, కూటమి కార్పొరేటర్లతోపాటు, ఇద్దరు వైసీపీ కార్పొరేటర్లు, నగరంలోని అన్ని సచివాలయ సెక్రటరీలు, సెక్షన్ హెడ్‌లు పాల్గొన్నారు.

నేడు ఒంగోలులో మెగా జాబ్‌మేళా

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు బుధవారం ఒంగోలులో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ తెలిపారు. ఇటీవల పలువురు నిరుద్యోగులు ఉద్యోగాల కోసం అర్జీలు అందజేశారన్నారు. అయితే వారికి ఉద్యోగం, వారి కుటుంబసభ్యులకు భరోసా కల్పించేందుకు తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు దామచర్ల తెలిపారు.

ఒంగోలులోని ఏ1 ఫంక్షన్‌హాలులో ఉదయం 9గంటల నుంచి జాబ్‌మేళా ప్రారంభం అవుతుందని, 10వ తరగతి నుంచి ఇంజనీరింగ్ పూర్తి చేసిన వారికి టెక్ మహేంద్ర, అదాని కంపెనీలతోపాటు 40 ప్రముఖ కంపెనీలలో ఉద్యోగాలు కల్పిస్తామని, జిల్లాలోని నిరుద్యోగ, యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

టీ నాయుడుపాలెం హైస్కూల్‌ను సందర్శించిన డీఈవో


ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈవో, డిప్యూటీ ఈవో

టంగుటూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తూర్పునాయుడుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్‌కుమార్ సందర్శించారు. గత ఏడాది పదోతరగతిలో 100శాతం ఉత్తీర్ణత సాధించిన విషయాన్ని తెలుసుకొని ప్రధానోపాధ్యాయిని సుధారాణి, ఉపాధ్యాయులను అభినందించారు. ఈసందర్భంగా డీఈవో పలు సూచనలు చేశారు. పదో తరగతి విద్యార్థులు ప్రత్యేక తరగతలు నిర్వహించాలన్నారు. వెనుకబడిన వారి పట్ల శ్రద్ధ తీసుకోవాలన్నారు. పాఠశాల రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట డిప్యూటీ ఈవో సామా సుబ్బారావు, జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు సెక్రటరీ మర్రిబోయిన శ్రీనివాసరావు ఉన్నారు.

విద్యుత్‌శాఖ ఇన్‌చార్జి ఏఈగా హర్దీష్

కొండపి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ శాఖ కొండపి మండల ఏఈగా హర్దీష్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం ఆయన జరుగుమల్లి ఏఈగా పనిచేస్తున్నారు. ఇప్పటి వరకూ కొండపి ఏఈగా ఉన్న కుంచాల కోటయ్యను అధికారులు బదిలీ చేశారు. ఆయన మంగళవారం సాయంత్రం రిలీవ్ అయ్యారు. మూడున్నర సంవత్సరాలుగా ఇక్కడ పనిచేసిన కోటయ్య వినియోగదారులకు సేవలు అందించడంలో మెరుగ్గా పనిచేశారు. అయితే ఇటీవల కొందరు సిబ్బంది మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామిని కలిసి కోటయ్యపై ఫిర్యాదు చేశారు. కులం పేరుతో దూషించారని ఒకరు, కొట్టారని మరొకరు ఆరోపించారు. వెంటనే ఆయన్ను బదిలీ చేయాలని వినతిపత్రం సమర్పించారు. అదేసమయంలో కోటయ్యకు మద్దతుగా కొందరు ఉద్యోగులు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆయనపై చేసిన ఫిర్యాదులో వాస్తవం లేదన్నారు. వృత్తిపరంగా, వినియోగదారులకు సేవలు అందించే విషయంలో కఠినంగా ఉంటారని అందులో వారు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు కోటయ్యను బదిలీ చేశారు.

వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం

- అందజేసిన ఎస్పీ దామోదర్

ఒంగోలు క్రైం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి) : పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల విజేతలకు ఎస్పీ ఏఆర్.దామోదర్ బహుమతులను అందజేశారు. పోలీసు సిబ్బంది, పాఠశాల విద్యార్థులకు వేర్వేరుగా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం ఒంగోలులోని ఎస్పీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ప్రథమ బహుమతి రూ.5వేలు, ద్వితీయ బహుమతి రూ.3వేలు, తృతీయ బహుమతి రూ.2వేలు నగదును ప్రదానం చేశారు.

విజేతల వివరాలు

పోలీసు సిబ్బంది విభాగంలో..ఒంగోలు వన్‌టౌన్‌లో పనిచేస్తున్న మహిళ హెడ్‌కానిస్టేబుల్ పి.శ్రీదేవి, శ్యాట్‌టీమ్ కానిస్టేబుల్ కె.సత్యనారాయణ, పెద్దారవీడులో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న బి.ఎవాంజలి మొదటి మూడు బహుమతులు గెలుచుకున్నారు.

విద్యార్థుల విభాగంలో.. బి.వెంకటమ్మ, ఎస్‌కే.షకీబ్, డి.పావననందన ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందుకున్నారు. ఇక పోలీసు పిల్లల విభాగంలో.. జి.సాయినిహారిక, ఎం.ప్రీతిఅనన్య, వి.తరుణ్ బహుమతులు అందుకున్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ అశోక్‌బాబు, ఏఆర్ డీఎస్పీ చంద్రశేఖర్, ఆర్ఐలు రమేష్‌కృష్ణన్, రమణారెడ్డి, సీతారామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలులో పేకాట శిబిరంపై దాడి

అదుపులో 12 మంది జూదరులు

రూ.2.32 లక్షలు స్వాధీనం

కేసు నమోదు చేసిన తాలూకా పోలీసులు

ఎస్పీ ఆదేశాలతో పోలీసులు రైడ్

ఒంగోలు క్రైం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నగరంలో మంగళవారం పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి 12 మందిని అదుపులోకి తీసుకొని రూ.2.32 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. మంగమూరు రోడ్డులో ఓ భవనంలో గది అద్దెకు తీసుకొని పేకాట శిబిరం నిర్వహిస్తుండడం చర్చనీయాంశమైంది. పి.శివ అనే వ్యక్తి నగరంలో ఉన్న జూదరులకు ఫోన్లు చేసి పిలిపించి శిబిరంలో సకల సౌకర్యాలు ఏర్పాటు చేసి ఆడిస్తున్నాడు. అందుకుగాను ఒక్కొక్కరి వద్ద రూ.1000 నుంచి రెండు వేల వరకు వసూలు చేస్తున్నాడు. అంతేకాకుండా వారికి అవసరమైన డబ్బు కూడా శివే ఫైనాన్స్ చేస్తున్నాడు. చాలాకాలంగా ఈ శిబిరం నడుస్తున్నట్లు పోలీసు విచారణలో తేలింది. శిబిరం నిర్వాహకుడు శివకు ఇంకా అనేక స్థావరాలు ఉన్నట్లు తెలుస్తోంది. పేకాటకు వెళ్లిన వారిని రోజుకొక ప్రదేశానికి తీసుకెళ్లి ఆడిస్తుండడం గమనార్హం. పేకాట శిబిరాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసిన ఎస్పీ ఏఆర్.దామోదర్ ఆదేశాల మేరకు ఒంగోలు తాలూకా సీఐ అజయ్‌కుమార్ తనసిబ్బందితోపాటు ఏఆర్ పోలీసులతో కలిసి పేకాట శిబిరంపై దాడి చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని సీఐ చెప్పారు. పేకాట శిబిరం నిర్వహించే ప్రాంతమైన మంగమూరు రోడ్డులో పలు పాఠశాలలతోపాటు ముఖ్యులు నివాసం ఉంటారు. అదీ రోడ్డు పక్కనే మొదటి అంతస్తును అద్దెకు తీసుకొని పేకాట ఆడిస్తుండడంతో ప్రజలు విస్తుపోతున్నారు.



పేకాట శిబిరం నిర్వహిస్తున్న భవనం ఇదే


లోపల మందు ఏర్పాట్లు



అభివృద్ధి పనులు వేగవంతం

● ఎమ్మెల్యే దామచర్ల


మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఒంగోలు(రూరల్), నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ పాలనలో ఇక నిరంతరంగా అభివృద్ధి పనులు చేపడతామని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. మంగళవారం ఒంగోలు మండలం చేజర్లలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రం, హెల్త్ క్లీనిక్ భవనాలను ఆయన ప్రారంభించారు. అనంతరం సీసీరోడ్డు నిర్మాణం కోసం శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ ఉపాధి నిధులతో గ్రామంలో సైడుకాలువలు, సీసీరోడ్లు నిర్మించుకోవాలని కోరారు. అనంతరం వైద్యులు సంజీవరెడ్డి, మాలకొండారెడ్డి బహూకరించిన 12 పల్స్ ఆక్సీమీటర్‌లను ఏఎన్ఎంలకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చాగంటి రవికుమార్‌రెడ్డి, ఎంపీడీవో శేషుబాబు, డీఈ రామ్‌మోహన్, ఏఈ రామ్‌కుమార్, వైద్యాధికారి సుందరప్రసాద్, ఏడీఏ రమేష్‌బాబు, ఏవో కిషోర్‌బాబు, టీడీపీ మండల అధ్యక్షుడు నలమోతు బాలగంగాధర్, నాయకులు చుంచు శింగయ్య, పాతూరి పూర్ణచంద్రరావు, గద్దె వెంకటకృష్ణ పాల్గొన్నారు.

చీమకుర్తిలో ఆక్రమణల తొలగింపు షురూ

● టీపీఎస్, చిరువ్యాపారుల మధ్య వాదులాట

చీమకుర్తి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి) : చీమకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని ఆక్రమణల తొలగింపునకు అధికారులు మంగళవారం శ్రీకారం చుట్టారు. సైడు డ్రైన్స్‌పై, రహదారికి ఇరువైపులా స్థలాలను ఆక్రమించుకొని చిరువ్యాపారాలను నిర్వహించుకుంటున్న వారు అధికారుల చర్యలతో ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. తొలుత పట్టణంలోని పాత బస్టాండ్‌సెంటర్ నుంచి మున్సిపల్ కార్యాలయంతో పాటు పలు ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలకు వెళ్లే రోడ్డు పల్లపోతువారి వీధిని అధికారులు ఎంచుకున్నారు. టీపీఎస్ శారద ఆక్రమణలను దగ్గరుండి మరీ తొలగించారు. ఈ సందర్భంగా చిరువ్యాపారాలుతో వాదులాట జరిగింది. చివరికి సిబ్బంది సహకారంతో ఆక్రమణలను తొలగించారు. కాగా పట్టణంలోని అన్ని ప్రధాన వీధుల్లో ఆక్రమణలను తొలగించటానికి అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. రాజకీయ ఒత్తిడిలు ఎదురైతే తప్ప ఈ ప్రక్రియను ఆపేది లేదనే తీరులో అధికారులు ఉన్నారు.

ఫీజు బకాయిలను విడుదల చేయాలి : ఎస్ఎఫ్ఐ

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్ లో ఉన్న రూ3వేల కోట్ల ఫీజులను చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సీహెచ్.వినోద్ డిమాండ్ చేశారు. అన్ని రకాల ఫీజులను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఒంగోలులో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారం జరిగే రాష్ట్రమంత్రి వర్గసమావేశంలో పెండింగ్‌లో ఉన్న ఫీజులను విడుదల చేసేలా తీర్మానం చేయాలన్నారు. అమ్మకు వందనం పథకాన్ని అమలు చేసి ప్రతి విద్యార్థికి రూ. 15వేలు ఇవ్వాలని, వసతిగృహాల్లో పెండింగ్ ఉన్న మెస్, కాస్మోటిక్ చార్జీలను విడుదల చేయాలని కోరారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలను పెంచాలని డిమాండ్ చేశారు. ఎస్టీ హాస్టల్స్‌లో అక్షయపాత్ర ద్వారా భోజన సరఫరా చేసే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవడంతో పాటు జిల్లా యూనివర్శిటీ నిర్మాణం కోసం నిధులు కేటాయించాలని కోరారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అంతకు ముందు నగరంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు కె.విజయ్, బి.వీరాస్వామి, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా నాగులచవితి


ఆంజనేయకాలనీలోని పుట్టవద్ద పూజలు చేస్తున్న భక్తులు

సింగరాయకొండ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పది గ్రామాల్లో మంగళవారం నాగుల చవితి వేడుకలను ప్రజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పాతసింగరాయకొండ భవనాసి వద్ద నాగేంద్రుడికి ప్రత్యేక పూజలు చేశారు. సింగరాయకొండ ఆంజనేయకాలనీలోని ఆంజనేయస్వామి గుడి వద్ద ఉన్న పుట్టలో మహిళలు పాలుపోశారు. పలు గ్రామాల్లో నాగేంద్రుడి పుట్టల వద్ద మహిళలు అధికసంఖ్యలో పాల్గొని పూజలు చేశారు.

కొండపిలో..

కొండపి: నాగుల చవితి సందర్భంగా కొండపిలోని పోలేరమ్మ, కొండేపమ్మ ఆలయాల్లో ఉన్న పుట్టల వద్ద మహిళలు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. పుట్టలో పాలుపోసి హారతులిచ్చారు.

సంతనూతలపాడులో..

సంతనూతలపాడు: మండలంలోని పలు ఆలయాల్లో నాగులుచవితి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంతనూతలపాడులోని త్రిపురాతంకస్వామి ఆలయంలో వెనుకవైపు ఉన్న పుట్ట వద్ద భక్తులు పాలు పోసి తమ మొక్కులను తీర్చుకున్నారు. మద్దులూరు రోడ్డులోని శ్రీనాగేంద్ర, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో వాస్తు సిద్ధాంతి నాగేశ్వరరావుచారి పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు. ఆలయ నిర్వాహకులు సన్నమూరి సుబ్బనాచారి, రాజేష్‌గుప్తా, బి.శ్రీనివాసరావు, శరత్, టీడీపీ మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, రాష్ట్ర సెక్రటరీ అడకా స్వాములు, జడ్పీటీసీ దంపతులు డి.రమణమ్మ, చెంచిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉప్పుగుండూరులో..

నాగులుప్పలపాడు: ఉప్పుగుండూరులోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాలయంలో ఈవో రామకృష్ణ, చైర్మన్ కుంచాల నాగరాజు ఆధ్వర్యంలో నాగులచవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మోటుమర్రి నాగేశ్వరరావు, భక్తులు పాల్గొన్నారు.





టీడీపీ సభ్యత్వ నమోదు

టంగుటూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఎం.నిడమలూరులో టీడీపీ సభ్యత్వ నమోదును మంగళవారం ప్రారంభించారు. గ్రామ టీడీపీ అధ్యక్షుడు కాకుమాని శ్రీకాంత్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, ఐటీడీపీ ప్రతినిధి ఇంటింటికీ వెళ్లి కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత సీనియర్ నాయకుడు, గ్రామ టీడీపీ గౌరవాధ్యక్షుడు కటారి కోటయ్య సభ్యత్వాన్ని నమోదు చేసుకొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు శ్రీచైతన్య విద్యార్థి


శ్రేయశ్‌ను అభినందిస్తున్న నిర్వాహకులు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం లాయర్‌పేట లోని శ్రీచైతన్య ఒలంపియాడ్ స్కూలు విద్యార్థి శ్రేయశ్ అండర్-14 రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక స్కూలులో ప్రిన్సిపాల్ అపర్ణశిరీష, రీజనల్ ఇన్‌చార్జి అనిల్‌కుమార్, సమన్వయకర్త జి.శ్రీనివాసరావు, డీన్ వై.శ్రీనివాసరావు, ఏవో బాలకృష్ణ, పీఈటీ ఆర్.రామారావు అభినందించారు.

వరిలో సస్యరక్షణ చర్యలు

మద్దిపాడు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): వరి పైరు సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏవో కె.రమేష్‌బాబు పేర్కొన్నారు. దొడ్డవరంలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమంలో వరిపైరును పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం ప్రత్యామ్నాయ పంటలు మినుము, శనగ సాగుచేసే విధానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో సిబ్బంది స్పందన, ఘడియపూడి విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ శిరీష, రైతులు పాల్గొన్నారు.

ట్యూబ్‌లైట్లు అందజేత

నాగులుప్పలపాడు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ మేరకు అమ్మనబ్రోలు గురుకుల పాఠశాలకు ట్యూబ్‌లైట్లను ఎస్ఐ బి.శ్రీకాంత్ మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.మాధవి, ఎస్ఎంసీ చైర్మన్ మల్లయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కల పంపిణీ

ఒంగోలు(రూరల్), నవంబరు 5(ఆంధ్రజ్యోతి): వెంగముక్కపాలెంలో మంగళవారం రైతులకు ఒంగోలు పొగాకు వేలం కేంద్రం-2 నిర్వహణాధికారి సత్య శ్రీనివాస్ మొక్కలను పంపిణీ చేశారు. నాటిన ప్రతి మొక్క బతికేలా చూడాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పెద్దిరెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.





పల్లెవెలుగులో ప్రయాణికులకు గిఫ్ట్ స్కీం : డీఎం

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీ ఒంగోలు డిపో ఆధ్వర్యంలో ప్రయాణికులకు గిఫ్ట్ స్కీమ్ అమలు చేస్తున్నట్లు డిపో మేనేజరు డి.శ్రీనివాసరావు తెలిపారు. పల్లెవెలుగు సర్వీసుల్లో ప్రయాణించే వారికి ప్రోత్సాహకంగా పొందూరు, తాళ్ళూరు, గుండాయపాలెం, కొణిజేడు, రూట్లు పరిధిలో ఈ గిఫ్ట్‌స్కీమ్ అమలు చేస్తున్నామని చెప్పారు. ప్రతి పదిహేను రోజులకు ఒకసారి డ్రా తీసి విజేతలకు సీఎంఆర్ జ్యూవెలరీ వారిచే బహుమతులు అందజేస్తామన్నారు. ఈ సందర్భంగా స్థానిక డిపోల మంగళవారం తీసిన డ్రాలో తాళ్ళూరు రూటులో ఆర్‌పీఆర్, విటల్, కొణిజేడు-పొందూరు రూటులో రత్నం, గుండాయపాలెం అన్న అనే వ్యక్తులు బహుమతులు గెలుచుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సూపరింటెండెంట్ ఎం.నాయక్, సీఎంఆర్ మాపూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక

సంతనూతలపాడు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు సంతనూతలపాడు విద్యార్థిని వి.వర్షిత ఎంపికైనట్లు హెచ్‌ఎం ప్రమోద తెలిపారు. మంగళవారం స్థానిక స్కూలులో ఆమెను ఉపాధ్యాయులు అభినం దించారు. ఈ సందర్భంగా పీడీ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ విద్యార్థిని వర్షిత డిసెంబరులో జార్ఖండ్ రాష్ట్రంలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.



కూలీలకు బీమా సౌకర్యం కల్పించాలి

మద్దిపాడు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): పచ్చాకు ముఠా కూలీలకు బీమా సౌకర్యం కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల అంజనేయులు డిమాండ్ చేశారు. స్థానిక వెలుగు ఆఫీస్ వద్ద కొంగ చిన్న అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆంజనేయులు మాట్లాడుతూ పొగాకును పనులకు వెళుతున్న కూలీలకు అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రభుత్వం నుంచి ఎటువంటి సహకారం లేదని, తక్షణమే బీమా సదుపాయం కల్పించాలన్నారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు నెరుసుల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



క్రైం సమాచారం

రేషన్ డీలర్‌పై 6ఏ కేసు నమోదు

పెద్దారవీడు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని తోకపల్లి రేషన్ డీలర్ ఉప్పలపాటి నాసరయ్యపై 6ఏ కేసు నమోదు చేసినట్లు ఎంఆర్ఐ ఎన్.గోపి మంగళవారం తెలిపారు. తహసీల్దార్ పులి శైలేంద్రకుమార్ ఆదేశాల మేరకు సోమవారం రాత్రి రేషన్‌దుకాణంలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. తనిఖీలలో 2624 కేజీల బియ్యం, 56 కేజీల కందిపప్పు తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. పూర్తి నివేదికను తహసీల్దార్ శేలేంద్రకుమార్‌కు ఇచ్చినట్లు తెలిపారు.

15 మద్యం సీసాల పట్టివేత

బేస్తవారపేట,నవంబరు5(ఆంధ్రజ్యోతి): మండలంలోని అక్కపల్లె గ్రామంలో బెల్టుషాపు నిర్వహిస్తున్న ఓ వ్యక్తి వద్ద తనిఖీలు చేయగా 15 మద్యం క్వార్టర్ సీసాలు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై రవీంద్రారెడ్డి తెలిపారు.

బేకరీలో బూజు పట్టిన ఎగ్‌పఫ్ అమ్మకం

బేస్తవారపేట, నవంబరు5 (ఆంధ్రజ్యోతి): బేస్తవారపేటలో ఓ బేకరీకి రాజ్ కుమార్ అనే వ్యక్తి వెళ్లి మంగళవారం ఎగ్‌పఫ్ కొనుగోలు చేశాడు. ఆ పఫ్ తింటుండగా బూజు పట్టింది. దీంతో ఇదేంటని బేకరి నిర్వాహకుడిని రాజ్‌కుమార్ నిలదీశాడు. బేకరీ నిర్వహకుడు తనకు సంబంధం లేదని, నీఇష్టం వచ్చినవారికి ఫిర్యాదు చేసుకోవచ్చని, దురుసుగా సమాదానం ఇచ్చాడు. దీంతో రాజ్ కుమార్ అనే వ్యక్తి ఫుడ్ ఇన్స్‌పెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. బేస్తవారపేలో విచ్చలవిడిగా నాశిరకం వంట వస్తువులు వినియోగిస్తూ బేకరీలో తయారు చేస్తూన్నారని సంబంధిత అధికారులు తనిఖీలు చేయాలని పలువురు కోరుతున్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కార్మిక, ఉద్యోగ సంఘం నాయకులు

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఈనెల 11న ఒంగోలులో నిర్వహించనున్న సభను జయప్రదం చేయాలని మాదిగ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు భిక్షాలు మాదిగ అన్నారు. స్థానిక కోర్టుసెంటర్‌లో ఒంగోలులో జరిగే సభకు సంబంధించి పోస్టర్‌ను ఆ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఆవిష్కరించారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు వెలువరించి అనంతరం మొట్టమొదటి సారిగా మాదిగల ముద్దుబిడ్డ కృష్ణ మాదిగ ఒంగోలు వస్తున్నారని ఈ సభను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మాదిగ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు హైజాక్, శేషయ్య, అదనపు ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యాక్షులు జీవరత్నం, మార్కాపురం అధ్యక్షుడు ఏలియా, ఎంఎస్‌పీ రాష్ట్ర నాయకుడు కాశీరావు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌లకు శిక్షణ

మార్కాపురం రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి). మండలంలోని రాయవరం గ్రామం వద్ద ఉన్న సీఎల్ఆర్‌సీ భవనంలో మంగళవారం మండలంలోని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సీఎల్ఆర్‌సీ ట్రైనర్ శ్యాంసన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఆర్ఈజీఎస్ మార్కాపురం క్లస్టర్ ఏపీడీ నిర్మలాదేవి మాట్లాడుతూ ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో గ్రామీణ ప్రాంత ప్రజలకు వారి గ్రామంలోనే ఉపాధి కల్పించాలన్నారు. గ్రామంలో, రైతులు సాగు చేస్తున్న పొలాల్లో నీటి లభ్యతను పెంచేందుకు కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఎటువంటి అవకతవకలకు తావు లేకుండా గ్రామాలలో పనులు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీవో జీవరత్నం, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

కొమరోలు, నవంబరు5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బుధవారం విద్యుత్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. కావున కొమరోలు పట్టణ ప్రజలు ఈ విషయాన్ని గమనించి విద్యుత్ అధికారులకు సహకరించాలన్నారు.

చట్టాన్ని ఉల్లంఘిస్తున్న మున్సిపల్ అధికారులు



దీక్షలు చేస్తున్న కార్మికులు

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ అధికారులు చట్టాన్ని యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నారని సీఐటీయూ జిల్లా నాయకులు సోమయ్య అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదురు కార్మికులు చేస్తున్న దీక్షలు మంగళవారం 22వ రోజుకు చేరాయి. దీక్ష శిబిరాన్ని ప్రారంభించి సోమయ్య మాట్లాడుతూ.. 21మంది మున్సిపల్ కార్మికులను అక్రమంగా తొలగించి అధికారులు, అధికార పార్టీ నాయకులు చట్టాన్ని ఉల్లంఘిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కక్షసాధింపు చర్యలతో 20 సంవత్సరాలకు పైగా పనిచేస్తున్న కార్మికులను విధుల నుంచి తొలగించడం ఏమిటని ప్రశ్నించారు. మున్సిపల్ కమిషనర్ ఆప్కాస్ నిబంధనలు ఉల్లంఘించి అరాచక పద్ధతులకు తెర తీశారని అన్నారు. ఈ దీక్షల్లో షబ్బీర్, గొట్టం హరి, శీను, కనకయ్య, అబ్దుల్ హసీం, హుస్సేన్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరు విద్యావంతులు కావాలి

పుల్లలచెరువు, నవంబరు5(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని ప్రతి ఒక్క నిరాక్షరాసులు తప్పని సరిగా వయోజన విద్య ద్వారా చదువు నేర్చుకొని విద్యావంతులు కావాలని ఎంపీడీవో వసంతరావునాయక్ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయం లో సాక్షరభారత్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరాక్షరాసులకు ఈ నెల నుంచి వచ్చే ఏడాది మార్చి 15వ తేదీ వరకు ప్రతి రోజు రెండు గంటల పాటు 200 గంటలు బోధన జరగాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కందుల వెంకటయ్య, సాక్షరభారత్ మండల కోఆర్డీనేటరు శ్యాముల్, ఎంపీఎం నూనె వెంకటయ్యఅధికారులు పాల్గొన్నారు.

విద్య ప్రాధాన్యతను తెలియజేయాలి

● మండల ప్రత్యేక అధికారి భాగ్యవతి



సమావేశంలో మాట్లాడుతున్న భాగ్యవతి

మార్కాపురం రూరల్ నవంబరు 5 (ఆంధ్రజ్యోతి). విద్య ప్రాధాన్యతను గ్రామీణ ప్రాంతాల లో మహిళలకు వివరించాలని మండల ప్రత్యేక అధికారి వై.భాగ్యవతి తెలిపారు. స్థానిక ఎస్సీ బీసీ కాలనీలోని డ్వాక్రా బజారులో వయోజన విద్యాశాఖ, వెలుగు డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఉల్లాస్ కార్యక్రమంపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా భాగ్యవతి మాట్లాడుతూ మండలంలో నిరక్షరాస్యులైన 950 మందికి మొదటి విడతగా చదువు నేర్పించే కార్యక్రమం చేపట్టామన్నారు. మండలంలోని బోడపాడు, భూపతిపల్లి, బొందలపాడు గ్రామాలలో ఉల్లాస్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. వీరికి చదువు నేర్పేందుకు 95 మంది వలంటీర్లను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎంపీడీవో శ్రీనివాసులు మాట్లాడుతూ చదువురాని ప్రతి ఒక్కరికీ చదువు నేర్పించాల్సిన బాధ్యత చదువుకున్న వారిపై ఉందన్నారు. కార్యక్రమంలో వయోజన విద్యాశాఖ సూపర్‌వైజర్ వై.చౌదరెడ్డి, ఏపీఎం పిచ్చయ్య, ఎల్‌సీ నాగభూషణం, మండల సమాఖ్య అధ్యక్షురాలు ఝాన్సీ సీసీలు నాగయ్య, మనోకుమారి, వీవోఏలు పాల్గొన్నారు.






త్రిపురాంతకం పెద్దారవీడులో పుట్టవద్ద పూజలు చేస్తున్న భక్తులు కంభంలో నాగులపుట్టకు పూజలు మార్కాపురంలో పుట్టవద్ద కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో నాగులచవితి

పుట్టల వద్ద పాలుపోసి మొక్కులు తీర్చుకున్న మహిళలు

త్రిపురాంతకం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నాగులచవితి పండుగను మహిళలు మంగళవారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ప్రసిద్ధ పుణ్య క్షేత్రం బాలాత్రిపుర సుందరిదేవి అమ్మవారి ఆలయం పుట్ట వద్ద మహిళలు పూజలు చేసేందుకు పోటీ పడ్డారు. పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు హాజరై పుట్ట వద్ద పూజలు చేసి పాలు పోశారు. వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలోని నాగేంద్రునికి, చెరువు కట్టపై ఉన్న నాగేంద్రుని శిలలకు మహిళలు పాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు పలు గ్రామాలలో ఆలయాల వద్ద పుట్టల్లో పాలు పోసి పూజలు నిర్వహించారు.

● పెద్దారవీడు : నాగులచవితి వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహించారు. మండలంలోని పెద్దారవీడు, కొత్తపల్లి సరిహద్దులలోని పుట్టను నాగులచవితి సందర్భంగా సుందరంగా అలంకరించారు. చారిత్రక నేపథ్యంలో నాగులపుట్టలో భక్తులు పాలుపోసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు ఉపవాసాలున్నారు. ముఖ్యంగా ఈ పుట్ట వద్ద పూజలు చేస్తే సంతానలేమి సమస్య పరిష్కారమౌతుందని ప్రతీతి. దీంతో మండలంలోని గ్రామాలతోపాటు మార్కాపురం డివిజన్‌లోని ఇతర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజలు నిర్వహించారు.

● కంభం : నాగులచవితి పండుగ సందర్భంగా మంగళవారం కంభం, అర్థవీడు మండలాలలో భక్తులు పుట్టల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని సత్యమ్మగుడి వద్ద, వీరాంజనేయస్వామి దేవాలయం వద్ద, రావిపాడు గ్రామానికి వెళ్లే దారిలో, అలాగే అర్థవీడు, నాగులవరం, మొహిద్దీన్‌పురం గ్రామాలలోని నాగులపుట్టల వద్దకు మహిళ భక్తులు పసుపు, కుంకుమ, పూలు, పాలతో ప్రత్యేక పూజలు చేశారు.

● మార్కాపురం వన్‌టౌన్ : కార్తికమాసంలోని నాగులచవితి పురస్కరించుకుని పట్టణంలోని పలు ఆలయాల్లో నాగమయ్యలకు పూజలు చేశారు. శ్రీ అల్లూరి పోలేరమ్మ ఆలయంలో నాగశిలలకు పూజలు చేసి పుట్టలో పాలు పోశారు. కళ్యాణ నాగమయ్య స్వామి ఆలయంలో నాగుల పూజలు, అభిషేకాలు నిర్వహించారు. శివాలయంలో నాగశిలలకు పూజలు చేశారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు పర్యవేక్షించారు. పట్టణంలోని పలు ఆలయాల్లో నాగులచవితి భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.

పొదిలి : మండలంలోని కంభాలపాడు గ్రామంలో వెలసిన అంకాలపరమేశ్వరిదేవికి కార్తీకమాసం సందర్భంగా మంగళవారం మహాచండీహోమాన్ని నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య చండీహోమాన్ని ప్రారంభించారు. ముందుగా గణపతి పూజ, కలశస్థాపన కార్యక్రమంతో కార్యాక్రమాన్ని ప్రారంభించారు. అమ్మవారి చండీహోమం కార్యక్రమంలో పాల్గొనేందకు చుట్టుప్రక్కల గ్రామాల నుండి పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల నుండి భక్తులు పాల్గొని అమ్మవారికి చీర సారెతోపాటు మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తల్తెకుండా ఆలయ కమిటీ సభ్యులు బెల్లంకొండ విజయలక్ష్మీ సౌకర్యాలు కల్పించారు. అదేవిధంగా నాగులచవితి పండుగను మండల ప్రజలు మంగళవారం అత్యంత వైభవంగా జరుపుకున్నారు. పట్టణంలో విరాట్‌నగర్, నిర్మామహేశ్వరస్వామి దేవాలయంలో ఉన్న పుట్టల వద్దకు వెళ్లి నాగమయ్యకు పాలపోసి ప్రత్యేక పూజలు చేశారు. పుట్టలో పాలుపోసి మొక్కులు తీర్చుకున్నారు. అదేవిధంగా కార్తీకమాసం, నాగులచవితి సందర్భంగా మహిళలు దీపాలు వెలిగించి పూజలు చేశారు.





మార్కాపురంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు, నాగశిలలకు అభిషేకాలు నాగమయ్యకు పూజలు

తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది కొరత

తీవ్ర అవస్థలు పడుతున్న ప్రజలు

కంభం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : అర్థవీడు తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. దీంతో మండలంలోని వివిధ గ్రామాల నుంచి పనులపై వచ్చే ప్రజలకు పనులు జరుగక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శాసనసభ ఎన్నికల తరువాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెలరోజులకు మండల స్థాయిలో అధికారులు సాధారణ బదిలీలు చేశారు. దీనిలో భాగంగా నెల్లూరు నుంచి అర్థవీడు తహసీల్దార్‌గా బదిలీపై ప్రభుదాస్ వచ్చాడు. ఆయన బాధ్యతలు స్వీకరించి 10 రోజుల్లోనే గుండె పోటుతో మృతిచెందాడు. అప్పటి నుంచి డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్‌కు ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు అప్పగించారు. ఈయన బేస్తవారపేట నుంచి ప్రతిరోజు అర్థవీడుకు రావలసి ఉండగా సకాలంలో రావడం లేదనే విమర్శ ఉంది. సీనియర్ అసిస్టెంట్ కృష్ణయ్య మార్కాపురానికి బదిలీపై వెళ్లి నెలరోజులు కావస్తున్నా ఆయన స్థానంలో ఎవరినీ నియమించలేదు. పలు పంచాయతీలకు వీఆర్‌వోల కొరత వేధిస్తోంది. మండలంలో 12 మంది సర్వేయర్లకు గాను ఐదుగురు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. వీరు కూడా ప్రజలకు అందుబాటులో ఉండరనే చర్చ నడుస్తోంది. ఇక డిప్యూటీ తహసీల్దార్, ఆర్ఐ పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. వారి స్థానాలలో ఎవరినీ భర్తీ చేయలేదు. ఇక అర్థవీడు మండలం భౌగోళికంగా రెండుపాయలుగా చీలి ఉంది. దీంతో అర్థవీడు మండలంలో వెలగలపాయ నుంచి అర్థవీడు తహసీల్దార్ కార్యాల యానికి రావాలంటే సుమారు 70 కిలోమీటర్ల మేర ప్రయాణం చేయాల్సి ఉంటుంది. అంటే రాను, పోను 140 కిలోమీటర్లు ప్రయాణం ఉంటుంది. ఇంత ప్రయాసపడి కార్యాలయానికి వస్తే తహసీల్దార్ లేరనో, ఆర్ఐ, ఇతర సిబ్బంది అందుబాటులో లేరని చెబుతుండడంతో వివిధ పనులపై వచ్చిన మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలల విద్యార్థులు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం తహసీల్దార్ కార్యాలయానికి వస్తే తహసీల్దార్ అందుబాటులో లేరని తెలుసుకుని, ప్రభుత్వం ఇచ్చిన గడువు ముగిస్తే పాఠశాలలో ఏమి చెప్పాలో తెలియక ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు వాపోతున్నారు. తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది కొరత కారణంగా మండలంలోని రెండు లోయల్లోని ప్రజలు, రైతులు చెప్పులు అరిగేలా తిరిగినా పనులు కాకపోవడంతో ఎవరికి చెప్పుకోవాలో తెలియక అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అర్థవీడు తహసీల్దార్ కార్యాలయంలో రెగ్యులర్ సిబ్బందిని నియమించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



కంభం తహసీల్దార్ కార్యాలయం

యువతలోని నైపుణ్యాలను పెంపొందించాలి



సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న శిక్షకుడు సుబ్బారావు

పెద్ద దోర్నాల, నవంబరు5 (ఆంధ్రజ్యోతి):మండలంలోని నిరుద్యోగ యువతీ యువకులను గుర్తించి వారిలోని నైపుణ్యాలను పెంపొందించాలని ఎంపీడీవో నాసర్‌రెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సచివాలయం సిబ్బందికి అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షకుడు సుబ్బారావు మాట్లాడుతూ సచివాలయం సిబ్బంది ఆ యా ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతీ యువకులను గుర్తించాలని, వారికి ఏ అంశంలో ప్రావీణ్యం కలదో తెలుసుకుని మెరుగైన ఫలితాలు రాబట్టేందుకు ప్రత్యేక శిక్షణనిచ్చి తద్వారా సంబంధిత విభాగాలలో ఉపాధి కల్పించేందుకు తోడ్పడాలని సూచించారు. ప్రభుత్వం అందుకు తగిన ఏర్పాట్లు చేసిందని, సిబ్బంది నూరు శాతం విజయవంతం చేయాలని కోరారు.

అయ్యప్పదీక్షధారులకు చద్ది ఏర్పాటు



చద్ది చేస్తున్న అయ్యప్ప దీక్షధారులు

పెద్దారవీడు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): అయ్యప్ప దీక్షదారులకు మండలంలోని దేవరాజు గట్టు శ్రీకాశీనాయన ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్తీకమాసం సందర్భం గా అయ్యప్ప, శివ దీక్షదారులకు ప్రతిరోజూ అన్నదానం చేయనున్నట్లు ఆశ్రమ నిర్వాహకులు తెలిపారు. అయ్యప్ప దీక్షదారులతోపాటు శ్రీశైల యాత్రికులకు సైతం ఆశ్రమంలో భోజన వసతి ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

వెలిగొండ ద్వారా ప్రతి ఎకరాకు నీరివ్వండి



మంత్రితో మాట్లాడుతున్న ముత్తుముల, ఎరిక్షన్‌బాబు

గిద్దలూరు టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : వెలిగొండ ప్రాజెక్టు ద్వారా నియోజకవర్గంలో ప్రతి ఎకరాకు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి నిమ్మల రామానాయుడుకు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. మంగళవారం విజయవాడలోని సచివాలయంలో ఆయన మంత్రి నిమ్మల రామానాయుడును కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గంలోని రైతాంగం వర్షాలపైనే ఆధారపడి పంటలు సాగు చేస్తున్నారని, సాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు. వెలిగొండ పూర్తయిన తరువాత నియోజకవర్గంలో ప్రతి ఎకరాకు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గంలోని కంభం చెరువును అభివృద్ధిచేసి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని కోరారు. చెరువుల పూడికతీతకు నిధులు మంజూరు చేయాలన్నారు. గిద్దలూరు పట్టణంలోని ప్రధాన సమస్య అయిన సగిలేరువాగు పూడికతీత, మరమత్తుల కొరకు నిధులు కేటాయించి పరిష్కరించా లన్నారు. నియోజకవర్గంలో శాశ్విత తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఎమ్మెల్యే అశోక్‌రెడ్డితోపాటు మంత్రిని యర్రగొండపాలెం టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు ఉన్నారు.

పేకాట శిబిరంపై దాడి, 8 మంది అరెస్టు

కంభం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కంభం మండలం పెద్దనల్లకాల్వ గ్రామంలో పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేసి 8 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.5590 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై నరసింహారావు తెలిపారు. ఎస్సై మాట్లాడుతూ మండలంలో చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చెకుముకి సంబరాలు

కంభం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పాఠశాల స్థాయి సైన్స్ చెకుముకి సంబరాలను మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రశ్నాపత్రాలను ఎంఈవో బి.మాల్యాద్రి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే పోటీ పరీక్షల్లో పాల్గొనడం సమగ్ర అభివృద్ధికి నాంది అని తెలిపారు. జేవీవీ మండలశాఖ అధక్షులు రమణరెడ్డి మాట్లాడుతూ ఆదిమ మానవుల నుండి ఆధునిక మానవుని వరకు జరిగిన అన్ని పరిణామాలకు సైన్స్ ప్రధాన కారణమన్నారు. సమాజంలో శాస్త్రీయ దృక్పథాలను పెంపొందించేలా జేవీవీ ముందడుగు వేస్తుందన్నారు. 2200 మంది విద్యార్థులు ఈ టెస్టులో పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, కన్వీనర్ షేక్ నాయబ్‌రసూల్, ఉపాధ్యాయులు మొయినుద్దీన్, వీరనారాయణ, ఖాశింపీరా, పాండురంగబాబు, నాగేంద్ర, ఇగ్బాల్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి



అర్జీలు స్వీకరిస్తున్న రెవెన్యూ సిబ్బంది

పెద్దారవీడు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): రీ సర్వేకు సంబంధించిన రెవెన్యూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఎంఆర్ఐ ఎన్.గోపి అన్నారు. మండలంలోని దేవ రాజుగట్టులో మంగళవారం రీసర్వే సమస్యలపై రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఆర్ఐ గోపి మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు సమస్యలపై వచ్చిన అర్జీలను కంప్యూటరీకరిస్తున్నామన్నారు. గ్రామసభలో వచ్చిన 48 అర్జీలలో 33 అర్జీలు ఎల్‌పీఎంలలో తేడాలకు సంబంధించినవికాగా, 7 పొలాల విస్తీర్ణంలో మార్పు నమోదు, 8 పేరు తప్పుగా నమోదు కావాటానికి సంబంధించి వచ్చాయన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ వెంకటేశ్వర్లు, వీఆర్వో విజయభాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

పంట బీమా ఆవశ్యకతపై రైతులకు అవగాహన



గిద్దలూరులో మాట్లాడుతున్న ఏవో విజయభాస్కర్‌రెడ్డి

గిద్దలూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రైతులు విధిగా పంట బీమా చేయించాలని ఏవో ఎం.విజయభాస్కర్‌రెడ్డి సూచించారు. మండలంలోని కొమ్మునూరు, తాళ్ళపల్లి గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ, 2024-25 రబీ సీజన్‌లో ప్రధానమంత్రి ఫసల్‌బీమా యోజన పథకం కింద రైతులు స్వతహాగా తమ వాటా చెల్లించాలని కోరారు. ఈ సీజన్‌లో పప్పుశనగ, మినుము, వరి, జొన్న, మొక్కజొన్న, మిరప తదితర పంటలకు పంటల బీమా పథకం వర్తిస్తుందని పేర్కొన్నారు. ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్‌పుస్తకం, పంట ధృవీకరణ పత్రం, బ్యాంక్ అకౌంట్, ఫోన్ నంబరు తీసుకుని మీసేవ, సీఎస్‌సీ సెంటర్లలో బీమా నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

● పెద్దదోర్నాల : ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని రైతులు వినియోగించుకోవాలని ఏవో జవహర్‌లాల్ నాయక్ అన్నారు. మండలంలోని నల్లగుంట్ల, కొర్రప్రోలు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో జవహర్‌లాల్ నాయక్ ఆయా గ్రామాల్లో సాగు చేసిన మినుము, మిరప, జొన్న, పంటలను పరిశీలించారు. సస్యరక్షణ చర్యలపై పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రబీలో సాగుచేసిన పంటలకు బీమా ప్రీమియం చెల్లించాలన్నారు. ఈ నెల 15వ తేదీ చివరి రోజు కావడంతో రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగ పర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో చైతన్య కుమార్, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

● కొమరోలు : రైతులు సాగుచేస్తున్న తమ పంటలకు బీమా తప్పనిసరిగా చేయించుకోవాలని ఏవో రాజశ్రీ తెలిపారు. మండలంలోని చింతలపల్లి, రాజుపాలెం గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యాక్రమం ద్వారా రైతులకు అధికారులు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఏవో రాజశ్రీ మాట్లాడుతూ పంట బీమా చేయించుకోవడం ద్వారా ప్రకృతి విపత్తుల సమయంలో పరిహారం పొందవచ్చన్నారు. మైక్రోఇరిగేషన్ అధికారి మోహన్‌క్రిష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం ద్వార 90శాతం రాయితీపై బిందుసేద్యం పరికరాలను రైతులకు అందిస్తున్నామన్నారు. కార్యాక్రమంలో రైతులు, అధికారులు పాల్గొన్నారు.

● మార్కాపురం రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి). పత్తిపంటలో సస్యరక్షణ చర్యలపై రైతులకు మండల వ్యవసాయాధికారి దేవిరెడ్డి శ్రీనివాసులు అవగాహన కల్పించారు. మండలంలోని తిప్పాయపాలెం, నికరంపల్లి గ్రామలలో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆ గ్రామాలలో రైతులు సాగుచేస్తున్న పంటలను పరిశీలించి పలు సలహాలు సూచనలు ఇచ్చారు. గ్రామంలోని రైతుసేవా కేంద్రంలో రైతులతో సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ పంటలు సాగు చేసిన ప్రతి రైతు తన పంటను తప్పనిసరిగా ఈ-క్రాప్ చేయించుకోవాలన్నారు. పంటలను ఈ క్రాప్ చేయించుకుంటేనే ప్రభుత్వం నుండి అందాల్సిన రాయితీలు, పథకాలు వరిస్తాయన్నారు. ప్రభుత్వం రైతులకు అందిస్తున్న వివిధ పథకాలను, రాయితీల వివరాలను వివరించారు. పొగాకు పంటకు ప్రత్యామ్నాయంగా కంది, మినుము, శనగ పంటలను సాగుచేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం రబీ సీజన్‌లో సాగు చేసే మినుము, శనగ, మొక్క జొన్న, వరి, మిరప పంటలకు ఫసల్ బీమా పథకంలో భాగంగా రైతులు మీసేవా కేంద్రాలలో గానీ, సచివాలయాలలో పంటలబీమా చెల్లించాలన్నారు. కార్యక్రమంలో రైతుసేవా కేంద్రాల సిబ్బంది శంకర్‌నాయక్, గణేష్, గ్రామాల రైతులు పాల్గొన్నారు.

గిద్దలూరు : రాచర్ల మండలం ఆకవీడు గ్రామపరిధిలో సాగైన బత్తాయి తోటలను ఉద్యానశాఖ అధికారి విష్ణుప్రియ పరిశీలించారు. బత్తాయి తోటల్లో సాగు యాజమాన్యం, పురుగుల ఉధృతి, తెగుళ్ల యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు వివరించారు. నీటి యాజమాన్యాన్ని సక్రమంగా పాటిస్తే అధిక దిగుబడులు వస్తాయన్నారు. బత్తాయికి ఎక్కువగా గొలుసు పురుగు, బంక తెగులు, వేరుతెగులు ఆశిస్తాయన్నారు. పురుగు నివారణ మందులను వాడుకోవాలని సూచించారు.




బత్తాయి తోటను పరిశీలిస్తున్న ఉద్యాన అధికారి విష్ణుప్రియ, దోర్నాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏవో

ముందుకుసాగని 'మొగిలిగుండాల'

- చెరువు కట్టను తొలగించిన తర్వాత పనుల నిలుపుదల
- గత ప్రభుత్వంలో బిల్లులు రాక చేతులెత్తేసిన కాంట్రాక్టర్
- కూటమి ప్రభుత్వంలో రూ.కోటి 20లక్షలు విడుదల
- పనులు ప్రారంభించి రిజర్వాయర్ నిర్మాణం

వేగవంతం చేయించాలని రైతుల వినతి



చదునుచేసిన మొగిలిగుండాల చెరువు కట్ట

తాళ్లూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాలకాలంగా నిర్మించతలపెట్టిన శ్రీబూచేపల్లి సుబ్బారెడ్డి మొగిలిగుండాల మినీ రిజర్వాయర్ నిర్మాణ పనులు కూటమి ప్రభుత్వంలో పూర్తవుతాయని రైతులు ఆశతో ఎదురుచూస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో నిర్మాణాలు చేపట్టిన కాంట్రాక్టర్ బిల్లులు చెల్లించక పోవటంతో అర్ధంతరంగా నిలిపివేశారు. గత మూడేళ్లగా రిజర్వాయర్ నిర్మాణ పనులు ముందుకుసాగక నిర్మాణపనులు నిలిచి పోయాయి.

తాళ్లూరు పరిసర ప్రాంత 20గ్రామాలకు చెందిన ప్రజల సాగునీరు, తాగునీటి కోసం దాదాపు 50ఏళ్లగా మొగిలిగుండాల రిజర్వాయర్ నిర్మాణం కోసం ఎదురుచూస్తున్నారు. తాళ్లూరు పరిసరప్రాంతాలకు చెందిన రైతాంగం కోసం శివరాంపురం సమీపాన గల మొగిలిగుండాల చెరువును మినీరిజర్వాయర్‌గా నిర్మాణం చేయాలని తలపెట్టారు. ఈక్రమంలో భూసేకరణకు టీడీపీ ప్రభుత్వంలో అప్పటి మంత్రి శిద్దా రాఘవరావు రూ.10కోట్ల 40లక్షలు నిధులు మంజూరు చేయించారు. 2019 మార్చిలో భూమి పూజ చేశారు. అయితే, ఆతర్వాత ఎన్నికలు రావటంతో పనులు ప్రారంభించలేదు. తదుపరి వైసీపీ ప్రభుత్వ అధికారంలోకి రావటం, రిజర్వాయర్ నిర్మాణపనులు చేపట్టకపోవటంతో రీటెండరింగ్ విధానం పేరిట ఆపనిని రద్దు చేశారు. అప్పటి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రద్దయిన మినీరిజర్వాయర్ నిర్మాణం నిధులను రీటెండర్ కింద మరలా రిజర్వాయర్ నిర్మాణానికి రూ.7కోట్ల 97లక్షలు, భూసేకరణకు రూ.2కోట్ల43 లక్షలు కలిపి మొత్తం ప్రాజెక్ట్ నిర్మాణానికి రూ.10కోట్ల 40లక్షల మంజూరు చేయించారు. సెప్టెంబరు 2, 2021న భూమిపూజ చేశారు.

పనులు చేపట్టిన కాంట్రాక్టర్ మూడు నెలల పాటు వేగవంతంగా చెరువు కట్ట మొత్తాన్ని చదునుచేశారు. దాదాపు 30 అడుగుల ఎత్తు, 20 అడుగుల వెడల్పుతో రెండుపర్లాంగుల పొడవున చెరువుకట్ట మట్టిని తొలగించి చదును చేశారు. అయితే, చేసిన పనులకు బిల్లులు చెల్లింపులకోసం నెలల తరబడి ఎదురు చూసి మంజూరుకాకపోవటంతో నిర్మాణ పనులు నిలిపివేశారు. బిల్లులు జమ కాకపోవటంతో యంత్రసామగ్రిని కూడా అక్కడ నుంచి తీసుకెళ్లాడు. దీంతో మూడేళ్లకు పైగా రిజర్వాయర్ నిర్మాణపనులు ఒక్క అడుగు ముందుకు పడలేదు. పనులు చేపట్టగానే భూనిర్వాసితులకు పరిహారం చెల్లిస్తామన్న అధికార యంత్రాంగం పట్టించుకున్న పాపాన పోలేదు. కొంతకాలం ఎదురు చూసిన భూనిర్వాసిత రైతాంగం రిజర్వాయర్ నిర్మాణం కోసం కేటాయించిన భూముల్లో సాగు చేపట్టారు. ఇటీవల వర్షాలు అధికంగా కురిసినా చెరువు కట్టలేకపోవటంతో చుక్కనీరు నిల్వ లేదు. చెరువు కట్టను చదును చేయటం వల్ల నీరు నిల్వలేక బోరుబావుల్లో నీరు సరిగ్గా రాకపోతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఇటీవల జరిగిన ఎన్నికల్లో టీడీపీ కూటమి ఎన్నికల ప్రచారంలో ఎంపీ మాగుంట శ్రీనివాసుల రెడ్డి, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే మొగిలిగుండాల రిజర్వాయర్‌ను పూర్తిచేసి తాళ్లూరు ప్రాంత ప్రజల కలలు సాకారం చేస్తామని హామీ ఇచ్చారు. ఆమేరకు ప్రభుత్వం అధికారంలో వచ్చిన తరువాత గత వైసీపీ ప్రభుత్వంలో కాంట్రాక్టర్ చేసిన పనులకు రూ.1కోటి 20లక్షల నిధులు విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం బిల్లులు విడుదల చేసినందున ఆశాఖ అధికారులు కాంట్రాక్టర్‌ను సంప్రదించి రిజర్వాయర్ పనులు తిరిగి చేపట్టేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో నాగులచవితి వేడుకలు

- భారీసంఖ్యలో తరలివచ్చిన మహిళలు
- పుట్టలో పాలుపోసి పూజలు

కనిగిరి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నాగులచవితి పర్వదిన వేడుకలను మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్తీకమాసం శుద్ధ చవితిని నాగులచవితి పర్వదినంగా భావించి ఆరోజున నాగేంద్రుని పూజించటం ఆనవాయితీ. ఈసందర్భంగా వివిధ ప్రదేశాల్లో ఉన్న నాగేంద్రుని పుట్టల వద్దకు భారీ సంఖ్యలో భక్తులు తరలివెళ్లి పూజలు చేశారు. తెల్లవారు జామునుంచే పలు ప్రాంతాలలో ఉన్న పుట్టల దగ్గర భక్తుల కోలాహలం నెలకొంది.

కనిగిరిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో పుట్టవద్దకు భక్తులు అశేషంగా తరలివెళ్ళి పూజలు, అర్చనలు చేశారు. దొరువు వద్ద ఉన్న శివాలయంలో, కొండపైన శివాలయంలోని నాగశిలలకు భక్తులు పూజలు చేసి దీపాలు వెలిగించారు. ఇటీవల బొడ్డుచావిడి వద్ద బయల్పడిన నాగశిలల వద్దకు మహిళలు పెద్దఎత్తున తరలివెళ్లి పూజలు చేశారు. స్థానిక సాయిబాబా దేవాలయంలోని జమ్మిచెట్టు వద్ద ఉన్న నాగశిలలకు భక్తులు పూజలు చేసి, స్వామి వారికి తీర్థప్రసాదాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.



కనిగిరి: బాబా మందిరంలోని జమ్మిచెట్టు వద్ద ఉన్న నాగశిలలు వద్ద పూజలు చేస్తున్న భక్తులు



పామూరు: నాగుల పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు

దొనకొండలో..

దొనకొండ, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆనంద ఆశ్రమంలో నాగుల చవితి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆశ్రమంలో వేంచేసిన శ్రీనాగేంద్రస్వామికి పంచామృత అభిషేకాలు, అష్టోత్తర శతనామావళి తదితర ప్రత్యేక పూజలు చేశారు. నైవేద్యాలు సమర్పించి సామూహిక హారతులు ఇచ్చారు. కురిచేడుకు చెందిన గోపాలని సుబ్బారావు, లక్ష్మీపార్వతి దంపతులు పూజా కార్యక్రమాల్లో పాల్గొని భక్తులకు అల్పాహారం అందజేశారు.

తాళ్లూరులో..

తాళ్లూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలుగ్రామాల్లో నాగుల చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తాళ్లూరులోని వెంకట్రామయ్య స్వామి ఆలయం వద్ద, గుంటిగంగ భవానీ ఆలయం వద్ద గల పుట్టల వద్ద, ఆయాగ్రామాల్లోని పుట్టల వద్ద మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. పుట్టల్లో పాలు పోసి నాగదేవతలకు చలిపిండి నైవేద్యంగా సమర్పించారు.

పామూరులో..

పామూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నాగుల చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. పట్టణంలోని అంకాలమ్మవీధిలో గల దేవసేన సమేత సుబ్రమణ్య స్వామి దేవస్థానం వద్ద గల నాగులపుట్టలో పాలుపోసి నాగేంద్రుని ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలంటూ పూజలు చేశారు. అనంతరం రావి చెట్టు, వేప చెట్టుకు పూజలు చేశారు. కార్యక్రమాల్లో దేవస్థాన నిర్వాహకులు ఓగూరి ఏడుకొండలు, భక్తులు పాల్గొన్నారు.

ముండ్లమూరులో..

ముండ్లమూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం నాగుల చవితి పండుగను పురస్కరించుకొని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారు జామునుంచే పుట్టల వద్ద పూజలు చేశారు. మండలంలోని పెదఉల్లగల్లు, మారెళ్ళ, ముండ్లమూరు, అగ్రహారం, ఈదర, భీమవరం గ్రామాల్లో నాగుల చవితి పండుగను భక్తులు ఘనంగా నిర్వహించారు.

ఉపాధిలో అంతులేని అవినీతి

- రూ.5 కోట్ల నిధులు గోల్‌మాల్
- రికవరీ చేయాలని పీడీ ఆదేశాలు

సీఎస్‌పురం(పామూరు), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఏడాది కాలంలో జరిగిన ఉపాధి పనుల్లో సుమారు రూ.5 కోట్ల మేర నిధులు గోల్‌మాల్ జరిగినట్లు డ్వామా అధికారులు తెలిపారు. రూ.9 కోట్ల మేర పనులు జరగగా, అందులో రూ.4 కోట్ల 66 లక్షల రికవరీకి ఆదేశించినట్లు డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక ఉపాధి కార్యాలయంలో 16వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. మండలంలో 23 గ్రామ పంచాయతీలకు సంబంధించిన పనుల వివరాలను డీఆర్పీలు చదివి వినిపించారు. పనులకు రానివారికి సైతం దొంగ మస్టర్లు వేసి బిల్లులు డ్రా చేశారని, సంతకాలు ఒకరే చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. కొన్ని గ్రామాల్లో అవెన్యూ ప్లాంటేషన్ కింద మొక్కలు నాటకుండనే నిధులు డ్రా చేసుకున్నట్లు గుర్తించారు.



సిబ్బంది పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న డ్వామా అధికారులు

సీఎస్‌పురం పంచాయతీలో రూ.72 లక్షల 90 వేలు, ఉప్పలపాడు పంచాయతిలో రూ.46 లక్షలు, పులుగోరుపల్లెలో రూ.45 లక్షలు, అరివేముల పంచాయతీలో రూ.38 లక్షలు, గోగులపల్లిలో రూ.29 లక్షలు, చింతపూడు పంచాయతిలో రూ.24 లక్షలు, చెర్లోపల్లిలో రూ.21 లక్షలతో పాటు ఇతర పంచాయతీల్లో కూడా నిధులు గోల్‌మాల్ జరిగినట్లు డ్వామా అధికారులు గుర్తించారు.


ఈసందర్భంగా పీడీ జోసఫ్‌కుమార్ మాట్లాడుతూ ఉపాధి పనుల్లో పెద్దఎత్తున నిధులు పక్కదారి పట్టాయని చెప్పారు. అవినీతికి పాల్పడిన వారిపై చర్యలకు ఆదేశిస్తున్నట్లు తెలిపారు. టెక్నికల్ అసిస్టెంట్లు కొలతలు చూపించకపోవడం దారుణమన్నారు. బాధ్యుల నుంచి రికవరీ చేస్తామని చెప్పారు.

కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి రూస్సీరాణి, ఏపీడీలు రారావు, వెంకటస్వామి, జిల్లా విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ సురేష్‌కుమార్, వెంకటేశ్వరరావు, ఏపీవో వాక్యవతి, తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేలో పొరపాట్లను సరిదిద్దేందుకే గ్రామ సభలు

- ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు

తాళ్లూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో భూముల రీసర్వేలో అనేక పొరపాట్లు జరిగాయని ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు అన్నారు. దీంతో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. రీసర్వేలో పొరపాట్లను సరిదిద్దేందుకు ప్రభుత్వం గ్రామ సభలు నిర్వహిస్తుందని చెప్పారు. మంగళవారం మండలంలోని మాధవరంలో జరిగిన సభకు సర్పంచ్ తాటికొండ రేణుక అధ్యక్షత వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో రైతులతో సంబంధం లేకుండా రీసర్వే చేయడంతో భూముల విస్తీర్ణాల్లో తేడాలు వచ్చాయన్నారు. తనకు చెందిన పట్టాభూమిలో కొంత భాగం గ్రామకంఠంలో పడటమే రీసర్వేలో జరిగిన తప్పిదానికి నిదర్శనమన్నారు. తమ భూహక్కుల ప్రకారం రీసర్వే గ్రామాల్లో పొలాల విస్తీర్ణాలు లేకపోవడంతో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయన్నారు. బ్యాంకుల్లో రుణాలు ఇవ్వక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎన్నికల ప్రచారంలో సీఎం చంద్రబాబు రైతాంగం పడుతున్న రీసర్వే కష్టాలను గుర్తిం చారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతుల ఇబ్బందులను తొలగిస్తామని చెప్పారన్నారు. అందులోభాగంగా గ్రామసభలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. రీసర్వే జరిగిన గ్రామాల్లో రైతులు తమ పొలం రికార్డులను పరిశీలించుకుని పొరపాట్లు ఉంటే దరఖాస్తు చేసుకోవాలన్నారు. రెవెన్యూ యంత్రాంగం రీసర్వే వల్ల జరిగిన తప్పిదాలను పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో రీసర్వే డీటీ ప్రశాంత్‌కుమార్, వీఆర్వో రమణమ్మ, విలేజ్ సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ తాటికొండ

బెల్టు షాపుపై పోలీసుల దాడి

ముండ్లమూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొప్పూడివారిపాలెంలో బెల్టు షాపుపై మంగళవారం పోలీసులు దాడులు చేశారు. అందిన సమాచారంతో ఎస్‌ఐ నాగరాజు సిబ్బందితో వెళ్ళి నిర్వాహకుడు వల్లభనేని కృష్ణమూర్తిని పట్టుకొని 42 క్వార్టర్స్ బాటిల్స్, రెండు ఫుల్ బాటిళ్ళను స్వాధీనం చేసుకున్నారు. బెల్టు షాపు నిర్వాహకుడు కృష్ణమూర్తిని అరెస్టు చేసి దర్శి కోర్టులో హాజరుపరచగా, జూనియర్ సివిల్ న్యాయాధికారి రిమాండ్ విధించినట్టు ఎస్‌ఐ తెలిపారు. ఈ దాడులో ఏఎస్‌ఐ ఎన్.వెంకటేశ్వరరెడ్డి, రైటర్ వెంకటేశ్వర్లు, మరియబాబు పాల్గొన్నారు.

చిరుధాన్యాలు సాగు చేయాలి

దొనకొండ, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): పొగాకుకు ప్రత్యామ్నాయంగా చిరు ధాన్యాలైన వరిగి, రాగి, కొర్ర పంటలను సాగుచేయాలని దర్శి వ్యవసాయ సబ్ డివిజన్ సహాయ సంచాలకులు కె.బాలాజీనాయక్ సూచించారు. మండలంలోని ఇండ్లచెరువు, వెంకటాపురం గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చిరుధాన్యాల సాగుకు పెట్టుబడి ఖర్చు తక్కువని, కూలీల ఖర్చు సహితం ఎక్కువగా ఉండదన్నారు. పశువులకు మేత సమస్య కూడా తీరుతుందన్నారు. రబీలో సాగు చేస్తున్న పంటలకు ఇన్సూరెన్స్ చేయించుకోవాలన్నారు. అనంతరం రైతులు సాగు చేస్తున్న ఆముదం, పత్తి, కంది, మిరప, పొగాకు పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సిబ్బందికి బకాయిలు చెల్లించాలి

దొనకొండ, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): అరబిందో యాజమాన్యం అక్రమంగా వసూళ్లు చేసిన పీఎఫ్ తిరిగి చెల్లించాలని, 74 మంది సీనియర్ డ్రైవర్లకు స్లాబ్ అమలు చేయాలని తదితర డిమాండ్లు పరిష్కరించాలంటూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు 104 సిబ్బంది వైద్యాధికారిణి డాక్టర్ సునీతకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మూడు నెలలుగా 104 సిబ్బందికి వేతనాలు మంజూరుకాక కుటుంబ జీవనోపాధి కష్టంగా మారిందన్నారు. ఉద్యోగులకు ఇన్సూరెన్స్ చేయించాలని, యాజమాన్యం నుంచి రావల్సిన ఇతర బకాయిలు చెల్లించేవిధంగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకొని 104 ఉద్యోగులకు న్యాయం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో 104 డీఈవో ఉదయ్‌భాస్కర్, సుభానీ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

దర్శి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా అందిస్తున్న సబ్సిడీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయాధికారి బాలకృష్ణనాయక్ సూచించారు. మంగళవారం మండలంలోని పొతకమూరు, తూర్పువీరాయపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతులు సాగుచేసిన పైర్లల్లో తెగుళ్ల నివారణకు సత్వరమే సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులు సాగుచేసిన వరి పంటను పరిశీలించి సూచనలు చేశారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని పూర్తిచేయాలి

దర్శి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితా స్పెషల్ సమ్మర్ రివిజన్ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తిచేయాలని తహసీల్దార్ ఎం.శ్రావణ్‌కుమార్ సూచించారు. 2015 జనవరి 1వ తేదిలోపు ఈ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఈనెల 9, 10, 23, 24 తేదీల్లో సమ్మర్ రివిజన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. బీఎల్‌వోలు నిర్దేశించిన కేంద్రాల వద్ద దరఖాస్తులు తీసుకోవాలన్నారు 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ ఓటర్ల జాబితాలో పేర్లు నమోదు చేయించుకోవాలని కోరారు.

'హామీలను అమలుచేయాలి'

కురిచేడు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఆశా కార్యకర్తలకు పది నెలల క్రితం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలంటూ మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రవితేజకు వినతి పత్రం అందజేశారు. ఆశాడే సందర్భంగా సీఐటీయూ మండల గౌరవాధ్యక్షుడు సందు వెంకటేశ్వర రావు అధ్యక్షతన స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఆశాలు సమావేశమయ్యారు. తమ హామీలను నెరవేర్చకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తల మండల అధ్యక్షురాలు కొండమ్మ, కార్యదర్శి నాగమల్లేశ్వరి, యోగేశ్వరమ్మ, కృపమ్మ, గౌసియా, రామకోటమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వాటర్‌బాటిళ్లు పంపిణీ

పామూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఉర్దూ పాఠశాలలోని విద్యార్థులకు టీడీపీ జిల్లా మైనార్టీ సెల్ కార్యదర్శి ఆర్‌ఆర్ రఫీ ఆర్థిక సహకారంతో సమకూర్చిన వాటర్‌బాటిళ్లు, ప్యాడ్‌లను టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో యారవ శ్రీనివాసులు, షేక్ ఖాజారహంతుల్లా, బొల్లా నరసింహారావు, సయ్యద్ అమీర్‌బాబు, షేక్ షంషూర్, గౌస్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి

పీసీపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పొగాకు సాగు తగ్గించి ప్రత్యామ్నాయ పంటలపై రైతులు దృష్టి సారించాలని ఏడీఏ ఈవీ రమణ అన్నారు. మంగళవారం మండలంలోని గుదేవారిపాలెంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పొగాకు సాగు తగ్గించి ప్రత్యామ్నాయ పంటలైన మినుము, శనగను సాగుచేయాలన్నారు. ప్రభుత్వం రాయితీపై శనగ విత్తనాలను అందజేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ప్రకాశరావు, ఏఈవో పుల్లయ్య, కిషోర్‌కుమార్, రసూల్, రైతులు పాల్గొన్నారు.

చేతి సంచుల పంపిణీ

పామూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): పర్యావరణానికి హాని కలిగించే సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని నిషేధించి కాటన్ సంచులను వాడి పర్యావరణాన్ని కాపాడాలని మానవత సేవా సంస్థ అధ్యక్షుడు ఎం.ముసలయ్య అన్నారు. పర్యావరణాన్ని కాపాడాలని కోరుతూ పట్టణంలో చేతి సంచుల వాడకంపై మంగళవారం అవగాహన కార్యాక్రమం నిర్వహించారు. అనంతరం 300 చేతి సంచులను పలువురుకు పంపిణి చేశారు. కార్యక్రమంలో వి.వెంకటేశ్వర్లు, పి.తిరుపతిరెడ్డి, టి.రమేష్, మాల్యాద్రి, ఖాజాహుసేన్, తదితరులు పాల్గొన్నారు.

రసూల్‌రెడ్డి మృతి తీరనిలోటు

సీఎస్‌పురం(పామూరు), నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొవిలంపాడు గ్రామానికి చెందిన మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు గోను రసూల్‌రెడ్డి అకాల మరణం ఎంతో బాధకరమని మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు అన్నారు. రసూల్ రెడ్డి అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. విషయం తెలుసుకొన్న బాబురావు రసూల్‌రెడ్డి మృత దేహానికి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సంతాపం తెలిపినవారిలో అగ్రికల్చరల్ విద్యాసంస్థల చైర్మన్ కేవీ ప్రకాష్‌రావు, కరస్పాండెంట్ పార్థసారధి, తదితరులు ఉన్నారు.

ఓట్ల చేర్పులు, సవరణలపై ప్రచారం

పీసీపల్లి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓట్ల చేర్పులు, సవరణలపై బీఎల్వోలు ప్రత్యేక ప్రచారం నిర్వహించాలని తహసీల్దార్ సీహెచ్ ఉష అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం బీఎల్వోలు, రాజకీయ పార్టీల నాయకులతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈనెల 9, 10, 23, 24తేదీలలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు బీఎల్వోలు వారివారి పరిధిలోని గ్రామాల్లో స్పెషల్ క్యాంపెయినింగ్‌లను నిర్వహించాలన్నారు. కొత్తగా చేర్పులు, మరణించిన వారి ఓట్ల తొలగింపులు, నమోదైన ఓట్లలో తప్పులేమైనా ఉంటే సవరణలు చేసుకోవాలన్నారు.

అవీ ఇవీ



సచివాలయ సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న కమిషనర్ డానియేలు

నిరుద్యోగులకు ఉపాధి కల్పనే లక్ష్యంగా పనిచేయాలి

కనిగిరి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ, ఉపాధి కల్పనే ధ్యేయంగా సిబ్బంది ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలని మున్సిపల్ కమిషనర్ జోసఫ్ డానియేలు అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం సచివాలయ సిబ్బందికి నైపుణ్య గణనపై శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ 19 నుంచి 59 సంవత్సరాల వరకు ఉన్న వారినుంచి విద్యార్హత పత్రాలు, ఉద్యోగ అనుభవం, తదితర సమాచారాన్ని సేకరించాలని సూచించారు. సేకరించిన సమాచారాన్ని ప్రభుత్వానికి నివేదించాలన్నారు. అలాగే, నిర్మాణ రంగం, ఉత్పత్తి రంగం, సేవారంగంలో 20లక్షల ఉద్యోగాలు కల్పించాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా సిబ్బంది పనిచేయాలన్నారు. త్వరలో నైపుణ్యగణన కార్యక్రమం మొదలవుతుందని చెప్పారు. ప్రభుత్వం నిర్దేశించిన కాల వ్యవధిలో నైపుణ్య గణన పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో నైపుణ్యగణన సర్వే చేయాల్సిన విధానాన్ని పవర్ పాయింట్ ద్వారా ప్లానింగ్ కార్యదర్శి సాయి పవన్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ఐ.ప్రసాద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'అక్షరం'తో వెలుగు

దొనకొండ, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): అక్షరం ప్రతి మనిషికి వెలుగు నిస్తుందని ఎంపీడీవో ఎం.శ్రీదేవి అన్నారు. ప్రతిఒక్కరూ చదువుకోవాలన్నారు. స్థానిక మహిళా సమాఖ్య కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన శిక్షణలో ఆమె మాట్లాడారు. మండలంలోని ఆరవల్లిపాడు, పెద్దన్నపాలెం, పోలేపల్లి పంచాయతీల్లోని డ్వాక్రా మహిళల్లో చదువుకోనివారు 1087 మందిని గుర్తించినట్టు చెప్పారు. వయోజనులకు ప్రభుత్వం సాయంత్రం సమయంలో చదువు నేర్పుతుందన్నారు. చదువు నేర్చుకోవటం వల్ల బ్యాంక్ లావాదేవీలతో పాటు ఎన్నోరకాల ప్రయోజనాలు కలుగుతాయని చెప్పారు. ఏరియా కోఆర్డినేటర్ వసుందరాదేవి మాట్లాడుతూ ప్రతిరోజు రెండు గంటలు చదువు నేర్చుకోవాలన్నారు. వచ్చే ఏడాది మార్చిలో పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్లు ఇస్తారన్నారు. కార్యక్రమంలో ఎంఈవో సాంబశివరావు, వయోజన విద్య సూపర్‌వైజర్ చెన్నారెడ్డి, ఏపీఎం వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి డేవిడ్, మండల సమాఖ్య అధ్యక్షురాలు లలినివైలెట్, తదితరులు పాల్గొన్నారు.

కంది పైరులో తెగులు నివారణ చర్యలు చేపట్టాలి

పామూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): గత నెలలో కురిసిన వర్షాలకు కంది పైరు ఏపుగా, గుబురుగా పెరగడంతో మరక మచ్చల పురుగు, శనగ పచ్చపురుగు గ్రుడ్లు పెట్టే అవకాశం ఉందని ఏవో కె.రాధ పేర్కొన్నారు. మండలంలోని కంభాలదిన్నె గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా రైతులతో కలిసి సాగులో ఉన్న కంది పైరును ఆమె పరిశీలించారు. తెగులు నివారణకు వేప నూనె, పురుగు మందులను పిచికారి చేసి తెగులు నివారణ చర్యలు చేపట్టాలని తెలిపారు. అనంతరం ఆర్బీకేలో రైతులకు పంటల సాగు విధానం గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో గ్రామ రైతులు, వ్యవసాయ అనుబంధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైన కంభాలదిన్నె విద్యార్థి

పామూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంభాలదిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన కుడుముల సందీఫ్ జిల్లాస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు ఇన్‌చార్జ్ హెచ్‌ఎం సిద్ధమూర్తి లక్ష్మీరెడ్డి తెలిపారు. ఈనెల 4న కనపర్తిలో జరిగిన అండర్ -17 విభాగంలో జరిగిన జిల్లాస్థాయి స్కూల్‌గేమ్ పోటీల్లో ఎంపికైనట్టు తెలిపారు. ఈ సందర్భంగా సందీప్‌ను పీఈటీ ఉపాధ్యాయుడు ఎం.నరసింహారావు అభినందించారు.

రెవెన్యూ రికార్డులను భద్రంగా ఉంచాలి



పాత తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో కేశవర్ధనరెడ్డి

దర్శి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ రికార్డులను సురక్షితమైన ప్రదేశంలో భద్రంగా ఉంచాలని కనిగిరి ఆర్డీవో కేశవర్ధనరెడ్డి సూచించారు. దర్శిలోని పాత తహసీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. సుమారు 115 సంవత్సరాల క్రితం బ్రిటీష్ కాలంలో ఈ భవనాన్ని నిర్మించారు. సుమారు 40 సంవత్సరాలు ఆ భవనంలో కోర్టు నడిచింది. నూతన కోర్టు భవనాలు నిర్మించిన తర్వాత ఆ భవనంలో కొంతకాలం తహసీల్దార్ కార్యాలయంగా ఏర్పాటుచేసుకొని విధులు నిర్వహించారు. 2017లో నూతన తహసీల్దార్ కార్యాలయం నిర్మించిన తర్వాత ఆ భవనం ఖాళీగా ఉంది. అందులో రెవెన్యూ రికార్డులను భద్రపరచారు. ఈక్రమంలో ఆర్డీవో ఆ భవనాన్ని పరిశీలించి రికార్డులు చూశారు. వర్షాలు పడినప్పుడు భవనం పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వర్షం పడినప్పుడు కొన్నిచోట్ల కారుతుండటంతో పరదాలు కప్పిన విషయాన్ని గుర్తుచేశారు. రెవెన్యూ రికార్డులు పటిష్టంగా భద్రపరచాలన్నారు. అంతకుముందు ఎస్టీ కుల ధ్రువీకరణ సర్టిఫికెట్ల కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వరరావు, ఆర్ఐ పరిటాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో పనులను పూర్తిచేయాలి

పామూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో జరుగుతున్న సిమెంటు రోడ్ల నిర్మాణ పనులను సకాలంలో పూర్తిచేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు సూచించారు. స్థానిక విరువూరు రోడ్డులో జరుగుతున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను మంగళవారం పరిశీలించారు. పట్టణంలోని 23 అంతర్గత రోడ్లను సీసీ రోడ్లుగా అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర రూ.5 కోట్ల ఉపాధి నిధులు మంజూరు చేశారు. పనులు దక్కించుకొన్నవారు త్వరితగతిన రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో యారవ శ్రీను, సయ్యద్ అమీర్ బాబు, షేక్ ఖాజారహంతుల్లా, ఆర్‌ఆర్ రఫీ, పందిటి హరీష్, గౌస్‌బాషా, ముబినా మౌలాలి, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి

తాళ్లూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో భూమిని రక్షించాలని మండల వ్యవసాయాధికారి బి.ప్రసాదరావు పేర్కొన్నారు. మంగళవారం అయ్యలపాలెం, నాగంబొట్లపాలెం, తూర్పుగంగవరం గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయంవల్ల జరిగే ప్రయోజనాలు, కషాయం, ఇతరత్రా ద్రావణాల తయారీ గురించి వివరించారు.

పొగాకుకు బదులు ప్రత్యామ్నాయ పంటల వైపు రైతాంగం దృష్టి సారించాలని మండల వ్యవసాయాధికారి బి.ప్రసాదరావు అన్నారు. మంగళవారం మల్కాపురం రైతు సేవా కేంద్రంలో పొగాకుకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రకృతి సాగు ఇన్‌చార్జ్ నరసింహులు, వీఏఏ వెంకట సుమ, ఐసీఆర్‌పీలు కోటి, అనంతమ్మ, వాణి, కోటిరత్నం, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ విద్యుత్ బకాయిలను వసూలు చేయాలి

ముండ్లమూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో పేరుకుపోయిన పెండింగ్ విద్యుత్ బకాయిలను స్పెషల్ డ్రైవ్ ద్వారా వసూలు చేయాలని దర్శి డివిజన్ ఏడీఈ కె.పిచ్చయ్య అన్నారు. మంగళవారం స్థానిక సబ్‌స్టేషన్‌ను ఆయన సందర్శించి సిబ్బందితో మాట్లాడారు. మండలంలో రూ.70 లక్షల మేర విద్యుత్ బకాయిలు పేరుకుపోయాయన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో కూడా బకాయిలు ఎక్కువగా ఉన్నాయన్నారు. మండలంలో ఏ గ్రామంలోనైనా విద్యుత్ స్తంభాలు శిథిలావస్థలో ఉంటే వెంటనే వాటిని తొలగించి కొత్తవి ఏర్పాటుచేయాలని ఏడీఈ ఆదేశించారు. నివాస ప్రాంతాల మధ్య వేలాడుతూ వెళ్తున్న విద్యుత్ తీగలను తొలగించాలన్నారు. కార్యక్రమంలో లైన్‌మెన్‌లు పీఎస్ఆర్ అంజనేయులు, కోటేశ్వరరావు, నాగరాజు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి



బాపట్ల జిల్లా వార్తలు

3

బుధవారం 6 నవంబరు 2024

రేపు తాళ్లాయపాలేనికి..

సీఎం చంద్రబాబు

- 400 కేవీ సబ్‌స్టేషన్ ప్రారంభించనున్న సీఎం
- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

తుళ్లూరు/గుంటూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరు మండలం తాళ్లాయపాలేనికి గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబునా యుడు రానున్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన 400/220 కే.వీ సబ్‌స్టేషన్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించను న్నారు. ఈ క్రమంలో ఆయా ఏర్పాట్లను కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ట్రాన్స్‌కో జేఎండీ కీర్తి చేకూరి, సంయుక్త కలెక్టర్ ఏ.భార్గవ్‌తేజ మంగళవారం పరిశీలించారు. అనంతరం కలెక్టర్ విలేకర్లతో మాట్లాడుతూ సీఆర్‌డీఏ పరిధిలో కార్యాలయాల డిమాండు, భవిష్యత్ అవసరాలకు తగినట్లు ఉండేలా తాళ్లాయపాలెంలో 400/220 కేవీ సబ్‌స్టేషన్‌ను జీఐఎస్ పద్ధతిలో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సబ్‌స్టేషన్ ప్రారంభోత్సవం అనంతరం ఇతర జిల్లాలకు సంబంధించిన వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి వర్చువల్ విధానంలో ముఖ్యమంత్రి ప్రారంభోత్సవాలు చేస్తారని తెలిపారు. బుధవారం సాయంత్రంలోపు పనులన్నీ పూర్తి చేసి ట్రయిల్ రన్ కూడా నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ పోవర్ స్వప్నిల్ జగన్నాథ్, ఎంటీఎంసీ కమిషనర్ అలీంబాష, ఆర్డీవో కే.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సీఎం చంద్రబాబు ప్రారంభించనున్న తాళ్లాయపాలెం విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి ట్రాన్స్‌కో జేఎండీ కీర్తి చేకూరి

కారుచౌకగా కొట్టేసి..

అడ్డగోలు అనుమతులు

- రైతులను భయపెట్టి, దాడులు చేసి భూముల కొనుగోలు
- రెవెన్యూలోకి మార్చి 400 ఎకరాల అటవీ భూముల ఆక్రమణ
- సీఎంగా చంద్రబాబు, ఎన్డీఏ రాకుంటే రాష్ట్రం పరిస్థితి వేరుగా ఉండేది
- సరస్వతి భూముల పరిశీలనలో జగన్‌పై డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ధ్వజం

మాచవరం, పిడుగురాళ్ల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): 'ముఖ్యమంత్రి పదవిని.. అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఆనాడు వైఎస్ఆర్, మొన్నటి జగన్ సరస్వతి పవర్ పేరుతో ఎన్నో అక్రమాలకు పాల్పడ్డారు. రైతులకు చెందిన భూములను కారుచౌకగా కొట్టేశారు. అడ్డగోలుగా అనుమతులు పొందారు..' అని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తెలిపారు. పల్నాడు జిల్లా మాచవరం మండలం వేమవరం, చెన్నాయపాలెం మధ్యలో సరస్వతి పవర్ ఇండస్ట్రీ పేరుతో (మిగతా 4వ పేజీలో)



సరస్వతి భూముల వద్ద మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

అధికారంతో రాసేసుకున్నారు

సహజవనరులు అందరి సొత్తు అయినా జగన్ ఇష్టానుసారంగా వాడుకున్నారు. సరస్వతి సిమెంట్స్ పేరుతో అనుమతులు ఇవ్వరేమోనని సరస్వతి పవర్ అండ్ ఇండస్ట్రీ పేరుతో అనుమతులు పొందారు. సిమెంట్‌కు ఉపయోగించే క్లింకర్ తయారీకి మాత్రమే అనుమతి తీసుకున్నారు. పర్యావరణ, పొల్యూషన్ అనుమతుల కోసం జగన్ దరఖాస్తు కూడా చేయలేదు. అధికారం అండతో 196 కోట్ల లీటర్ల కృష్ణాజలాల కేటాయింపులు చేసుకున్నారు. సీఎంగా నాడు రాజశేఖర్‌రెడ్డి, ఆ తర్వాత జగన్ వాళ్లంతట వాళ్లే సరస్వతి పేరుతో భూముల నుంచి అనుమతుల వరకు రాసుకున్నారు. వైఎస్ హయాంలో 31 సంవత్సరాల లీజుకు తీసుకున్నారు. 2014-19 మధ్యలో జగన్ 50 ఏళ్లు పాటు ఉండేలా లీజును పొడిగించుకున్నారు. రైతులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చేందుకే ఇక్కడకు వచ్చినట్లు తెలిపారు.

భూములపై విచారణకు ఆదేశాలు

రైతుల ఇష్టంతో పనిలేకుండా దాడులు చేసి భూములు కొనుగోలు చేశారు. ప్రభుత్వ భూములు, చుక్కల భూములు, కుంటలు, కాల్వలు సైతం జగన్ కలిపేసుకున్నారు. రైతుల వద్ద కొనుగోలు చేసిన భూములు కాకుండా వందల ఎకరాలు భూములు ఆక్రమించారు. అటవీ భూములున్నా రెవెన్యూ అనుమతి లేకుండానే పేరు మార్చేసుకున్నారు. దీనిపై పూర్తిస్థాయి విచారణ జరపాలని కలెక్టర్ అరుణ్‌కుమార్‌ను పవన్‌కల్యాణ్ ఆదేశించారు. రైతులపై దాడులు చేస్తే కఠినచర్యలు తీసుకోవాలని ఎస్పీని ఆదేశించారు. ఉపాధి పేరుతో రైతులకు ఆశ కల్పించి ఇప్పటి వరకు ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టకపోవడంపై కూడా సమగ్ర విచారణ జరిపిస్తామన్నారు.



ఓపెన్ టాప్ వాహనంపై నుంచి మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్



సరస్వతి భూముల వివరాలను పవన్‌కల్యాణ్‌కు వివరిస్తున్న కలెక్టర్ అరుణ్‌కుమార్, పక్కన ఎమ్మెల్యే యరపతినేని

ప్రొఫైలింగ్ యాప్‌లో సమాచారం పొందు పర్చాలి : మెప్మా పీడీ

బాపట్ల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఎస్‌హెచ్‌జీ ప్రొఫైలింగ్ యాప్‌లో సమగ్ర సమాచారం పొందుపర్చాలని మెప్మా పీడీ టీవీ విజయలక్ష్మి తెలిపారు. స్వయం సహాయక సంఘాలకు సంబంధించి సమగ్ర సమాచారాన్ని ఎస్‌హెచ్‌జీ ప్రొఫైలింగ్ యాప్‌లో పొందుపర్చే విషయమై మంగళవారం బాపట్ల మున్సిపల్ కార్యాలయంలో అద్దంకి, చీరాల, రేపల్లె, బాపట్ల మెప్మాసిబ్బందికి శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సీఎంఎం నర్రా సుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి పీడీ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రతిగ్రూప్ పూర్తి సమాచారం ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేయాలని ఆదేశించారు. సభ్యులు పేదరికం నుంచి బయట పడేందుకు, ఆర్థిక ప్రణాళికను తయారు చేయటానికి ప్రొఫైలింగ్ యాప్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అదేవిధంగా మహిళా సంఘాలు తయారు చేసిన ఉత్పత్తులను విక్రయించటానికి అర్బన్ మార్కెట్ ద్వారా అవకాశం కల్పించటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఎం కె.ఇంగ్రసెల్‌బాబు, చీరాల డీసీహెచ్ కొండయ్య, రేపల్లె సీఎంఎం అరుణకుమారి, సీవోలు విజయలక్ష్మి, సుబ్బారావు, అరుణ, సుగుణ పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న మెప్మా పీడీ విజయలక్ష్మి

సమన్వయంతో.. సత్ఫలితాలు

- జిల్లాను అభివృద్ధి దిశగా పయనింపచేస్తాం
- వేగంగా పంట కాల్వల ఆధునికీకరణ పనులు
- డీఆర్సీ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు

బాపట్ల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): 'జిల్లాను అభివృద్ధి దిశగా నడిపించాలంటే ముందుగా రాజకీయ నాయకత్వంతో పాటు అధికారులు కలిసి సమన్వయంతో పనిచేస్తేనే ఫలితాలు వస్తాయి. ఇందుకోసం చిత్తశుద్ధితో పనిచేసి జిల్లాను పురోగమన బాట పట్టిద్దాం. 95 కిలోమీటర్ల తీర ప్రాంతం ఉండడం వరం. దానిని ప్రణాళికాబద్ధంగా వినియోగించుకోగలిగితే పెద్దఎత్తున ఉపాధి అవకాశాల కల్పన జరుగుతుంది.' అని జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. బాపట్ల కలెక్టరేట్ వేదికగా మంగళవారం జరిగిన డీఆర్సీ సమావేశానికి అధ్యక్షత వహించిన ఇన్‌చార్జి మంత్రి జిల్లా అభివృద్ధికి సంబంధించి పలు అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. జలవనరులు సమృద్ధిగా అందుబాటులో ఉన్న బాపట్లలో ప్రభుత్వం తేబోతున్న ఇండస్ట్రీ పాలసీ అమలైతే పెద్దసంఖ్యలో ఉపాధి కల్పన జరుగుతుందన్నారు. సంక్షేమం అందించడంతో పాటు ఐదేళ్లలో ప్రజల తలసరి ఆదాయం పెంచడానికి కూడా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. జాబ్‌కార్డులు ఇచ్చిన వారందరికీ ఉపాధి హామీ పథకం కింద వందరోజుల పనిదినాలు కల్పించాలని ఆదేశించారు. కాల్వల మరమ్మతు పనులకు తక్షణమే టెండర్లు పిలిచి మార్చి నెలాఖరుకు పనులు పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. డీఆర్డీఏ పరిధిలోని లీడర్లపై ఫిర్యాదులు వస్తున్నాయని విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు.



సమీక్షకు హాజరైన వివిధ విభాగాల అధికారులు



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థ సారథి, పక్కన జిల్లా నేతలు

మెడికల్ కళాశాల పనులు ఎందుకు ఆగాయి

బాపట్లలోని మెడికల్ కళాశాల పనుల పురోగతితో పాటు ఏ కారణం చేత పనులు ఆపారో తెలపాలని మెడికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అధికారులను అడిగి తెలుసుకున్న నివేదిక అందించాలని మంత్రి తెలిపారు. సాగు నీటి విషయంలో ఏ ఒక్క రైతుకు అన్యాయం జరగడానికి వీల్లేదన్నారు. ఎన్టీఆర్ హౌసింగ్‌కు సంబంధించి గతంలో నిర్మించుకున్న గృహాలను అర్హులకు అందించాల్సిన బాధ్యత అధికారులదేనన్నారు. డీఆర్సీ సమావేశంలో చర్చకు వచ్చిన అంశాలకు సంబంధించి తదుపరి డీఆర్సీ నాటికి ఫలితాలు కనబడాలన్నారు.

నీటి ప్రవాహంపై పర్యవేక్షణ ఉండాలి : మంత్రి గొట్టిపాటి

పంటకాల్వల్లో నీటి ప్రవాహంపై అధికారుల పర్యవేక్షణ ఉండాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. కాల్వల లాకుల వద్ద లస్కర్లను తక్షణమే ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎత్తిపోతల పథకాలు నిరుపయోగంగా మారాయని వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. భవనాసి రిజర్వాయర్‌కు నీరందించే ప్రక్రియ వేగంగా జరగాలని తెలిపారు. కొరిశపాడు ఎత్తిపోతల పథకం పనులు నిలిచిపోవడంపై నివేదిక ఇవ్వండన్నారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

పింఛన్లలో అనర్హులను తొలగించాలి : మంత్రి అనగాని

ఎన్టీఆర్ భరోసా పింఛన్లలో అనర్హులు ఉంటే తొలగించాలని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. అదే సమయంలో అర్హత కలిగిన ఏ ఒక్కరికీ పింఛన్ అందకపోవడం జరగరాదన్నారు. చివరి ఆయకట్టుకు నీరందేలా జలవనరుల శాఖ అధికారులు ఫీల్డ్ విజిట్ చేయాలన్నారు. చాలా చోట్ల అధికారుల పర్యవేక్షణ లోపం రైతులకు శాపంగా మారుతుందన్నారు. రైతులకు మేలు చేయడమే లక్ష్యంగా యంత్రాంగం పనిచేయాలన్నారు.

చిత్తశుద్ధితో పనిచేయాలి : కలెక్టర్

స్వర్ణాంధ్ర-2047 విజన్ బాపట్ల లక్ష్యంతో యంత్రాంగం చిత్తశుద్ధితో పనిచేయాలని కలెక్టర్ వెంకటమురళి తెలిపారు. జిల్లాలోని 3.53 లక్షల మంది లబ్ధిదారులకు దీపం-2 పథకం ద్వారా మేలు జరుగుతుందన్నారు. ఇటీవల వరదలకు దెబ్బతిన్న గృహాలు, పొలాలకు రూ.69 కోట్లు పరిహారం చెల్లించామన్నారు.

లస్కర్ల నియామకం చేపట్టాలి : ఎమ్మెల్యే ఆనందబాబు

లస్కర్ల నియామకం చేపట్టి సమస్యలు పరిష్కరించాలని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు కోరారు. ఉచిత ఇసుక విధానం ఉన్నప్పటికీ ఇంకా క్షేత్రస్థాయిలో కొన్ని సమస్యలు ఉన్నాయని వాటిని పరిష్కరించేలా చర్యలు చేపట్టాలన్నారు. నిషేధిత భూముల జాబితా నుంచి పట్టా భూములను తొలగించాలని ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు కోరారు. గుంటూరు ఛానల్ పనులు వేగంగా చేపట్టాలని ఎమ్మెల్సీ లక్ష్మణరావు తెలిపారు. ఉచిత ఇసుక విధానం సక్రమంగా అమలు చేయాలని చీరాల ఎమ్మెల్యే కొండయ్య తెలిపారు. చీరాల, పర్చూరు నియోజకవర్గాల్లో ఇష్టం వచ్చినట్లు కొంతమంది ఇసుకను తవ్వుకుని వెళుతున్నారని దానిని కట్టడి చేయాలని కోరారు. ఈ సమావేశంలో జేసీ ప్రఖర్ జైన్, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

సీఎం చెప్పినా..

ఆగని ఇసుక అక్రమాలు

- అనుమతి గోరంత.. తవ్వకాలు కొండంత
- నాడు బాపట్ల ఎమ్మెల్యేతో మిలాఖత్.. నేడు చీరాలలో పాగా

చీరాల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఇసుక విషయంలో ఎక్కడా నేతల జోక్యం వద్దు.. అక్రమాలకు ఆస్కారం ఉండకూడదు.. వినియోగదారులకు లబ్ధి చేకూరాలి.. అని సీఎం చంద్రబాబు చెప్తున్నారు. కానీ చీరాల నియోజకవర్గంలో నేతల ఆధ్వర్యంలో ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా యథేచ్ఛగా సాగుతున్నాయి. ఇసుక దందా సాగించే వ్యక్తులు దొరికితే దొంగ.. లేదంటే దొర అన్నట్లుగా కార్యకలాపాలు సాగిస్తున్నారు. గోరంత అనుమతి పొంది కొండంత తవ్వేసి గతంలో బాపట్ల ఎమ్మెల్యేతో అంటకాగిన ఓ అయ్య.. ప్రస్తుతం చీరాల నియోజకవర్గంలో పాగా వేశాడు. గతంలో చీరాల, బాపట్ల మండలాల సరిహద్దుల్లో ఆయన కనుసన్నల్లో మైనింగ్ నిబంధనలకు విరుద్ధంగా భారీగా తవ్వకాలు జరిగాయి. అక్కడ నుంచి ప్రస్తుతం చీరాల మండలానికి మకాం మార్చాడు. అనుమతులకు ముందే మంచిరోజు పేరుతో ఇసుక అక్రమ తవ్వకాలు సాగించాడు. ఇదిలావుంటే వేటపాలెం మండలం పూటుకూరిసుబ్బయ్యపాలెం పంచాయతీ పరిధిలో ఎక్స్‌కవేటర్లతో ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా యథేచ్ఛగా సాగుతున్నాయి.

ఒకరిపై ఒకరు చెప్పుకుంటున్నారు

నియంత్రించేందుకు మైనింగ్ అధికారులు కొంత బాధ్యత వహిస్తుండగా రెవెన్యూ, పోలీస్ శాఖల పరంగా నామమాత్రపు చర్యలే. కీలక అధికారులతో కుదిరిన ఒప్పందాలే ఇందుకు కారణమని పలువురు విమర్శిస్తున్నారు. ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా నియంత్రణపై బాధ్యత తమది కాదంటే తమది కాదని రెవెన్యూ, పోలీస్, మైనింగ్ శాఖల అధికారులు ఒకరిపై ఒకరు చెప్పుకుంటున్నారు.

సీఎం చెప్పింది మాకు కాదు

ఇసుక, మద్యం వ్యవహారాల్లో వేలు పెట్టొద్దని సీఎం చంద్రబాబు చెప్పింది నేతలకు మాత్రమేనని తమకు కాదని కొందరు అధికారులు వ్యవహరిస్తున్నారు. అవకాశం ఉన్న ఉన్నతాధికారులు సొమ్ము చేసుకుంటున్నారు. అధికారులు తగిన చర్యలు చేపట్టి ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాను నియంత్రించకుంటే ఆ అపప్రద ప్రభుత్వం మూట కట్టుకోవల్సి వస్తుందనడంలో సందేహం లేదు.



ఈపురుపాలెం శివారులో అనుమతులకు ముందే తవ్వి రాసులు పోసిన ఇసుక, బుసక



మైనింగ్ అధికారుల పట్టుకుని ఈపురుపాలెం పోలీసులకు అప్పగించిన ఇసుక ట్రాక్టరు

టోల్ బాదుడు

- ఒకేసారి 25.9 శాతం చార్జీల పెంపు
- కమర్షియల్ వాహనాలకు ఆర్థిక భారం
- ఎన్‌హెచ్ఏఐ నిర్ణయం ఆర్టీసీపై ప్రభావం



గుంటూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): గుట్టుచప్పుడు కాకుండా జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ(ఎన్‌హెచ్ఏఐ) టోల్‌గేట్ చార్జీలను భారీగా పెంచింది. వివిధ రకాల వాహనాలపై ఒకేసారి 25.9 శాతం పెరిగింది. అంతేకాకుండా తిరుగు ప్రయాణం విషయంలో నిబంధనని సవరించింది. గతంలో ఒకసారి రిటర్న్ జర్నీ తీసుకుంటే 24 గంటల వ్యవధిలో ఎన్నిసార్లు అయినా టోల్‌గేట్‌ని క్రాస్ చేయవచ్చు. అలాంటిది ఇప్పుడు ఒక్కసారికి మాత్రమే దానిని కుదించింది. పెరిగిన టోల్‌చార్జీలు ఏపీఎస్ఆర్టీసీ పైనా ప్రభావాన్ని చూపనున్నాయి. గుంటూరు - విజయవాడ మధ్య కాజా, చిలకలూరిపేట - ఒంగోలు మార్గంలోని బొల్లాపల్లి, పిడుగురాళ్ల - పొందుగల మధ్య బ్రాహ్మణపల్లి వద్ద ఉన్న టోల్‌గేట్ల చార్జీలు భారీగా పెరిగాయి. కొత్తగా అమల్లోకి తీసుకొచ్చిన (మిగతా 4వ పేజీలో)

పొట్టకూటికి వెళుతుండగా..

- డ్రైవర్ నిర్లక్ష్యంతో ఆటో బోల్తా
- జాతీయ రహదారి నిర్మాణాల వద్ద అదుపుతప్పి ప్రమాదం
- ఐదుగురు మహిళా కూలీలకు గాయాలు
- మెరుగైన వైద్యం కోసం ఒకరు విజయవాడకు


విజయవాడకు తరలిన సుజాత


తేళ్ల అరుణ


కాకాణి దేవమ్మ


తేళ్ల అన్నామణి

చీరాలటౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : డ్రైవర్ నిర్లక్ష్యంతో పొట్టకూటికి వెళుతున్న మహిళ కూలీల ఆటో బోల్తాపడింది. దీంతో ఐదుగురు గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. చీరాల మండల పరిధిలోని విజయనగర్ కాలనీకు చెందిన అట్లూరి సుజాత (పక్కటెముకులకు గాయాలు). తేళ్ల అన్నామణి (వెన్నుపూసకు గాయం), కాకాణి దేవమ్మ(తలకు), తేళ్ల అరుణ (తలకు), కంభాలపాటి పేరమ్మ (గడ్డం) గాయపడ్డారు. మరో ఐదుగురు మహిళలు వ్యవసాయ కూలీలు. వీరంతా ఎప్పటిలాగే ఆటో డ్రైవర్ సురేష్ ఆటోలు కారంచేడు రోడ్డులోని చిట్టివాద పొలాల్లో నాట్లు వేసేందుకు వెళుతున్నారు. ఈ మార్గంలో జాతీయ రహదారి నిర్మాణాలు కూడా జరుగుతున్నాయి. నల్ల చెరువు సమీపానికి వెళ్లేసరికి డ్రైవర్ వాహనాన్ని కంట్రోల్ తప్పాడు. దీంతో ఓ వైపు చక్రం డౌన్ కాగా అకస్మాత్తుగా ఆటో బోల్తా పడింది. ఈక్రమంలో ఆటోలో ముందు కూర్చున్న సుజాతపై ఆటోతో సహా అందరూ పడ్డారు. దీంతో అందరూ ఒక్కసారిగా బిగ్గరగా కేకలు వేశారు. ఆ సమయంలో అటుగా వెళుతున్న వ్యక్తులు ఆటో నిలబెట్టారు. మొత్తానికి 10 మంది కూలీల్లో ఐదుగురు గాయపడ్డారు. క్షతగాత్రుల ను చీరాల ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తుండగా, సుజాతను మెరుగైన వైద్యం కోసం విజయవాడ తరలించారు. అలాగే డ్రైవర్ సురేష్ చేతికి గాయమైంది.

మైనర్ నిర్లక్ష్యంతో వ్యక్తికి తీవ్ర గాయాలు

భార్యకు తప్పిన ప్రమాదం


గాయపడిన వ్యక్తిని హాస్పిటల్‌కు తరలిస్తున్న పోలీసులు

చీరాలటౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఓ మైనర్ నిర్లక్ష్యంతో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన మంగళవారం సాయంత్రం చీరాల ఏరియా హాస్పిటల్ ఎదురుగా చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం స్థానిక ఉడ్‌నగర్‌కు చెందిన రవిశంకర్, శోభన దంపతులు. వారి పిల్లలను స్కూల్ నుంచి తెచ్చేందుకు ద్విచక్ర వాహనంపై వెళుతున్నారు. అదే సమయంలో ఎదురుగా అతివేగంగా మరో ద్విచక్ర వాహనంపై వస్తున్న హయ్యర్‌పేటకు చెందిన మైనర్ వీరిని ఢీకొట్టాడు. ప్రమాదంలో రవిశంకర్ ముఖంపై తీవ్రగాయాలయ్యాయి. భార్య శోభనకు ప్రమాదం తప్పింది. అయితే ఇటీవల ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా సీఐ శ్రీనివాసరావు పట్టణంలో కొన్ని నిర్దేశ ప్రదేశాల్లో సిబ్బందిని ఏర్పాటు చేశారు. ఈక్రమంలో అక్కడే విధుల్లో ఉన్న మహిళా పోలీసులు మార్తమ్మ, మమత క్షతగాత్రుడిని వెంటనే పట్టణంలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ఘటనపై పోలీసులు వివరాలు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో టీడీపీ నేత అల్లుడు మృతి


సదాశివరావు (ఫైల్)

చినగంజాం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మినీ లారీ ఢీకొట్టిన ఘటనలో టీడీపీ నేత, పర్చూరు ఏఎంసీ మాజీ చైర్మన్ యార్లగడ్డ అక్కయ్య చౌదరి అల్లుడు మృతి చెందారు. చినగంజాం, ఉప్పుగుండూరు టోల్‌ప్లాజా సమీపంలోని జాతీయ రహదారిపై మంగళవారం చోటుచేసుకుంది. ఎస్ఐ శీలం రమేష్ తెలిపిన కథనం మేరకు.. నాగులుప్పలపాడు గ్రామానికి చెందిన మారెళ్ల సదాశివరావు (49) తన ద్విచక్ర వాహనంపై కారంచేడు తన మేనమామ ఇంటికి బయలుదేరారు. టోల్‌ప్లాజా సమీపంలోని జాతీయ రహదారిపై తన ముందు వెళ్తున్న వాహనాన్ని అధిగమించే క్రమంలో ఎదురుగా విజయవాడ నుంచి ఒంగోలు వెళ్తున్న మినీలారీ సదాశివరావుని ఢీకొట్టింది. తలకు బలమైన గాయమై ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. మేనమామ జొన్నలమూడి వెంకటేశ్వర్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించినట్లు తెలిపారు. ఒంగోలులో మినీలారీని, డ్రైవర్ నాయబ్‌రసూల్‌ని అదుపులోనికి తీసుకొని చినగంజాం పోలీసుస్టేషన్‌కు తరలించారు.

సదాశివరావు పదేళ్ల కిందట కారంచేడు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు యార్లగడ్డ అక్కయ్యచౌదరి కుమార్తె శేషకుమారిని వివాహం చేసుకున్నారు. వీరికి కుమారుడున్నారు. సదాశివరావుది వ్యవసాయం కుటుంబం. తన మామ అక్కయ్యచౌదరి ఈ నెల 3వ తేదీన మృతి చెందడంతో కుటుంబసభ్యులతో కారంచేడు వెళ్లారు. అతని అంత్యక్రియలు అనంతరం 4వ తేదీ రాత్రి నాగులుప్పలపాడు గ్రామానికి వచ్చారు. మంగళవారం నాగులుప్పలపాడు నుంచి కారంచేడు గ్రామానికి వెళ్తూ రోడ్డు ప్రమాదంలో సదాశివరావు మృతి చెందారు.

మామ అంత్యక్రియలకు వెళ్లి వస్తూ..

అక్కయ్య చౌదరి ఇంట మరో విషాదం

కారంచేడు : తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, పర్చూరు వ్యవసాయ మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ యార్లగడ్డ అక్కయ్య చౌదరి ఇంట వరుస విషాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఆదివారం అక్కయ్య చౌదరి అనారోగ్యంతో మృతి చెందారు. సోమవారం స్వగ్రా మం కారంచేడులో అయనకు అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియలు జరిగి 24 గంటలు గడవక ముందే మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అల్లుడు మారెళ్ల సదాశివరావు మృతి చెందారు. చినగంజాం టోల్ ప్లాజా సమీపంలో 216 జాతీయ రహదారిపై బైక్‌పై వెళుతున్న వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. సదాశివరావు మృతి చెందారు. దీంతో అక్కయ్య నివాసంలో విషాదం నెలకొంది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కొండయ్య చీరాల ఏరియా ఆసుపత్రికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.


కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

చరిత్రకు చిహ్నం.. ఏదీ వైభవం

- ప్రాభవం కోల్పోతున్న దుర్గం దొరువు
- ఆక్రమణలతో కుంచించుకుపోతున్న స్థలాలు
- చిల్లచెట్లలో ఊటబావి
- శతాధిక ఊడల మర్రిచెట్టుకు పొంచి ఉన్న ముప్పు

కనిగిరి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణ దేవరాయల కాలం నాటి దొరువుకు దుర్గతి పట్టింది. దొరువు ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా మారుస్తామన్న హామీ కలగా మారింది. పాలకులు పట్టించుకోకపోవడంతో కనిగిరి చారిత్రక రుజువులు కనుమరుగయ్యే పరిస్థితి నెలకొంది. దుర్గం దొరువుకి ఎంతో చరిత్ర ఉంది. శ్రీకృష్ణదేవరాయులు కనిగిరి ప్రాంతాన్ని పాలించిన రోజుల్లో ప్రజలు, సైనికులు, రాజకుటుంబాల కోసం కొండ కింద దొరువును నిర్మించారు. ఆ తర్వాత వచ్చిన యాదవ రాజులు, బహమనీ సుల్తానులు, బ్రిటీషు పాలకులు కూడా ఈ దొరువు నీటినే వాడుకునేవారు. ప్రస్తుతం దొరువు నీరంతా పచ్చగా మారి దుర్వాసన వస్తుంది. దశాబ్దాలు మారుతున్నా దొరువు అభివృద్ధికి ఎవరూ ముందుకు రాకపోవటంతో నాటి ప్రాభవం కోల్పోతుంది.


శతాధిక ఊడల మర్రిచెట్టును నరికి ఆ కొమ్మలను తరలిస్తున్న దృశ్యం


నిరుపయోగంగా ఊటబావి

నాటి చారిత్రక వైభవాలకు ఆలవాలంగా ఉన్న గుర్తులు చెరిపేసేందుకు కొంతమంది అక్రమార్కులు దుశ్చర్యలకు పాల్పడుతున్నారు. దుర్గం పాలనా వైభవంలో సైనికులకు, వారి అశ్వాలకు, ఏనుగులకు సేద తీర్చిన దొరువు వద్ద ఉన్న శతాధిక ఊడల మర్రిచెట్టుకు ప్రస్తుతం ముప్పు వాటిల్లే దుస్థితి ఏర్పడింది. కొంతమంది అక్రమార్కులు దొరువు ప్రాంతంలో రిజిస్ట్రేషన్లు పుట్టించి, చివరకు ఊడల మర్రిచెట్టు కూడా రిజిస్ట్రేషన్ సర్వేలోనిదే అని ప్రచారం చేయటం అనుమానాలకు తావిస్తుంది. కనిగిరి ప్రజల దాహార్తిని తీర్చిన ఊటబావి నిరుపయోగంగా మారింది.


అక్రమ నిర్మాణాలతో కుచించుకు పోతున్న దొరువు కరకట్ట

ప్రశ్నార్థకంగా మారిన పార్కు ఏర్పాటు

నగర పంచాయతీ వైసీపీ పాలకవర్గం ఏర్పడి నాలగో సంవత్సరం పూర్తి కావస్తుంది. ఎన్నికల సందర్భంగా ప్రస్తుత పాలకవర్గం నేతలు దొరువును పార్కుగా తీర్చిదిద్దుతామని, పర్యాటక కేంద్రంగా మారుస్తామని ఇచ్చిన హామీ నెరవేర్చ లేక పోయారు. దొరువు అభివృద్ధికి విడుదల చేసిన రూ.2 కోట్లు దుర్వినియోగమయ్యాయి. దొరువు కట్ట వద్ద ఉన్న శతాధిక ఊడల మర్రిచెట్టు చుట్టూ అరుగు ఏర్పాటుచేసి పాదచారులు సేదతీర్చుకునే ఏర్పాట్లు చేస్తామని చెప్పిన హామీ నెరవేర్చ లేదు. దొరువులో వ్యర్థాలతో ఆ ప్రాంతమంతా దుర్వాసన వస్తుంది. దీంతో దొరువు వద్ద ఉన్న దేవాలయాలకు భక్తులు రావాలంటేనే జుగుప్సాకరంగా మారింది. కొండపైన దుర్గాదేవి ఆలయాలకు వెళ్లే భక్తులు ముక్కు మూసుకుని వెళ్లే పరిస్థితి ఏర్పడింది.


పాచిపట్టిన దుర్గం దొరువు నీరు

దొరువు స్థలంలో ఆక్రమణలు

పట్టణంలోని దొరువు కొండ కింద ఐదు ఎకరాల స్థలం ఉంది. 2009లో ఎమ్మెల్యేగా ఉన్న ముక్కు ఉగ్రనరసింహారెడ్డి దొరువు కట్టకు రక్షణగా ఫెన్సింగ్ వేయించారు. ఆ తర్వాత ఆ ఫెన్సింగ్ ఆనవాళ్లు కూడా లేకుండా ఆక్రమణకు గురవుతోంది. కొంతమంది శాశ్వత నిర్మాణాలు చేసుకున్నారు. మరికొంతమంది స్థలాలను కబ్జా చేసి రిజస్ట్రేషన్లు పుట్టించినట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. దొరువు కట్ట స్థలం రెండు వైపులా కొంతమేర ఆక్రమణకు గురయింది. ఆ ప్రాంతం చిల్లచెట్లు, పిచ్చిచెట్లతో నిండి చీకటి కార్యకలాపాలకు కేంద్రంగా మారింది. పోలీసులు కూడా అటువైపు వెళ్ళకపోవటంతో కార్యకలాపాలకు అడ్డాగా మారింది. పర్యాటక కేంద్రం మాట అటుంచి కనీసం ప్రాభవాన్ని కాపాడాల్సిన మున్సిపాల్టీ పాలకులు ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు.

నాటి ప్రాభవాన్ని కాపాడాలి

- సోమిశెట్టి శ్రీనివాసులు, మానవతా సంస్థ సభ్యులు, హిందూ ధార్మికులు

ఎంతో పురాతన చరిత్రకు సాక్ష్యంగా ఉన్న రాయల దుర్గం దొరువు ప్రాభవాన్ని కాపాడాల్సిన ఆవశ్యకత ప్రభుత్వంపై, మున్సిపాల్టీ పాలకులపై ఉంది. ఆప్రాంతం అపరిశుభ్రంగా మారింది. ఇక్కడ అంకాలమ్మ దేవాలయం, దొరువు శివాలయం, బ్రహ్మంగారి ఆలయం, కొండపైన విజయమార్తేండేశ్వరాలయం, దొరువులో దుర్గాంబాలయం ఉంది.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్

- అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల
- అండర్-17 రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో విజేతలుగా విశాఖ బాలురు, బాలికల జట్లు
- జాతీయస్థాయి పోటీలకు రాష్ట్ర జట్ల ఎంపిక


ఖోఖో బాలుర విజేత జట్టు(విశాఖ)కు ట్రోఫీ అందజేస్తున్న అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

తుమ్మపాల (అనకాపల్లి జిల్లా), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు వుంటుందని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. తుమ్మపాలలో మూడు రోజులపాటు నిర్వహించిన రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు సోమవారం రాత్రి ముగిశాయి. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా కొణతాల మాట్లాడుతూ, క్రీడా రంగం అభివృద్ధికి ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందన్నారు. జాతీయస్థాయి క్రీడా పోటీల నిర్వహణకు అనకాపల్లిలో స్టేడియం నిర్మించే అంశాన్ని ఇప్పటికే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లానన్నారు. అండర్-17 విభాగంలో జరిగిన ఈ పోటీల్లో ఉమ్మడి జిల్లాల నుంచి బాలురు, బాలికల జట్లు పాల్గొన్నాయి. బాలురు, బాలికల విభాగాల్లో ఉమ్మడి విశాఖ జిల్లా జట్లు విజేతలుగా నిలిచాయి. బాలుర విభాగంలో ద్వితీయ బహుమతిని ప్రకాశం జిల్లా, తృతీయ బహుమతిని కృష్ణా జిల్లా, బాలికల విభాగంలో ద్వితీయ బహుమతిని నెల్లూరు, తృతీయ బహుమతిని తూర్పుగోదావరి జిల్లా జట్లు పొందాయి.

జాతీయ పోటీలకు రాష్ట్ర జట్టు ఎంపిక

ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో డిసెంబరు ఐదు నుంచి తొమ్మిదో తేదీ వరకు జరగనున్న జాతీయస్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొనే రాష్ట్రస్థాయి అండర్-17 బాలురు, బాలికల జట్లను ఎంపిక చేశారు. బాలుర జట్టులో జి.అజయ్ (విశాఖ), బి.సాయి (విశాఖ), ప్రసాద్ (విశాఖ), వినయ్ (ప్రకాశం), పి.నరేశ్ (ప్రకాశం), రాకేశ్ (కృష్ణా), ఎం.శివ (విజయనగరం), తిరుమల (శ్రీకాకుళం), శశాంత్ గౌడ్ (అనంతపురం), ఎస్.నవీన్ (నెల్లూరు), జె.యాలప్ప (కర్నూలు), పవన్ (చిత్తూరు) వున్నారు. బాలికల జట్టులో కె.లాస్య (విశాఖ), పి.జోత్స్న (విశాఖపట్నం), జె.గీత (విశాఖపట్నం), డి.నందిని (తూర్పుగోదావరి), సీహెచ్.లావణ్య (విజయగనరం), బి.భార్గవి (నెల్లూరు), డి.రంగ మహాలక్ష్మి(గుంటూరు), కాకి దివ్య (పశ్చిమగోదావరి), కె.పవిత్ర (నెల్లూరు), ఎస్‌వ హస్మిత (చిత్తూరు), జి.దేవి (కడప), జి.భవాని (శ్రీకాకుళం) ఉన్నారు.

కారుచౌకగా కొట్టేసి.. అడ్డగోలు అనుమతులు

(3వ పేజీ తరువాయి)

జగన్ కుటుంబం కొనుగోలు చేసిన భూములను మంగళవారం పవన్‌కల్యాణ్, గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ దళితులను, రైతులను భయపెట్టి సొంత కంపెనీ కోసం జగన్ కారుచౌకగా భూములు కొనుగోలు చేశారన్నారు. మాచవరం, దాచేపల్లి మండలాల్లో సరస్వతి పవర్ ఇండస్ట్రీ పేరుతో భూములు కొనుగోలు సమయంలో రైతులకు ఇచ్చిన మాటను అప్పటి ముఖ్యమంత్రిగా ఉన్న రాజశేఖర్‌రెడ్డి, ఆ తర్వాత జగన్‌రెడ్డి మరిచారన్నారు. దళితులను, రైతులను బెదిరించి దాడులు చేసి పెట్రో బాంబులు వేసి వేట కొడవళ్లతో వెంటాడి భూములను హస్తగతం చేసుకున్నారన్నారు. ఆరుసార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన కోడెల శివప్రసాదరావుపై వైసీపీ నేతలు దుష్ప్రచారం చేసి ఫర్నిచర్ కొట్టేశాడని అక్రమంగా కేసులు పెట్టి వేధించి చనిపోయేలా చేశారన్నారు. మరి వందల ఎకరాల భూములను కారుచౌకగా కొట్టేసి, అడ్డగోలు అనుమతులు తెచ్చుకున్న జగన్‌పై ఎన్ని కేసులు పెట్టాలని ప్రశ్నించారు. సీఎంగా చంద్రబాబు, కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం రాకుంటే ఏపీ పరిస్థితి వేరుగా ఉండేదని తెలిపారు. సరస్వతి భూముల విషయంపై క్యాబినెట్‌లో చర్చిస్తామన్నారు. సరస్వతి భూములపై గతంలో జరిగిన అన్ని విషయాలను యరపతినేని ద్వారా తెలుసుకున్నానని, యరపతినేని రైతులకు అండగా ఉంటున్నారన్నారు.

రైతులపై దాడులు చేస్తే ఉపేక్షించొద్దు

సరస్వతి పవర్ ఇండస్ట్రీకి భూములిచ్చిన రైతులపై దాడులు చేస్తే ఉపేక్షించవద్దని పోలీసు అధికారులను పవన్‌కల్యాణ్ ఆదేశించారు. భూములిచ్చిన రైతుల్లో ఆత్మస్థైర్యం పెరిగేలా చూడాలని ఎస్పీ శ్రీనివాసరావును ఆదేశించారు. మాచవరం మండలం చెన్నాయపాలెంలో 272.96, పిన్నెల్లిలో 93.79, వేమవరంలో 710.63, తంగెడలో 107.365 ఎకరాలు ఉన్నాయని, వాటిలో పట్టా 1083.715, చుక్కలు 76.19, అసైన్డ్ భూములు 24.84 ఎకరాలన్నారు. అంతేకాకుండా 400 ఎకరాలు అటవీ భూములను రెవెన్యూ కిందకు మార్చేసి సరస్వతి పవర్ కోసం తీసుకున్నారన్నారు.

ఫ్యాక్టరీ నిర్మిస్తారా.. భూములిచ్చేస్తారా?

మూడేళ్లలో ఫ్యాక్టరీ నిర్మించి, యువతకు ఉద్యోగాలిస్తామని రైతులను మభ్య పెట్టి భూములు కొనుగోలు చేసి 15 ఏళ్లగా ఆ ఊసే మరిచిన జగన్ ఇప్పటికైనా ఫ్యాక్టరీ నిర్మించడమా లేదంటే భూములు తిరిగి ఇచ్చేయడమో చేయాలని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సరస్వతి పవర్ పేరుతో తక్కువ ధరకు రైతుల నుంచి కొనుగోలు చేసిన భూములను బ్యాంకుల్లో తనఖా పెట్టి వేల కోట్ల రుణాలు తీసుకున్నారని ఆరోపించారు. ఫ్యాక్టరీ నిర్మించకుండా, ఉద్యోగ అవకాశాలు కల్పించకుండా రైతులను రోజు వారి కూలీలుగా మార్చారన్నారు. ఫ్యాక్టరీ నిర్మించకపోవడంతో కొంతమంది రైతులు భూములు సాగు చేసుకునేందుకు యత్నించగా అప్పటి ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వెంకటరామిరెడ్డిలు గూండాలతో వచ్చి దాడులు చేశారన్నారు. సాక్షి పత్రికను అడ్డం పెట్టుకుని ఉన్నది లేనట్టు, లేనిది ఉన్నట్టు రాస్తూ ప్రజలను మభ్య పెడుతున్నారన్నారు. 500 ఎకరాల భూమిని సరస్వతి భూముల్లో జగన్ కలిపేసుకున్నాడన్నారు. వందలాది మంది రైతులు కొన్నేళ్లుగా ఉపాధి లేక అల్లాడిపోతున్నా జగన్‌కు ఏమాత్రం పట్టడం లేదన్నారు. అంతకముందు సరస్వతి భూములను ఓపెన్ టాప్ వాహనంపై నుంచి పవన్‌కల్యాణ్ పరిశీలించారు. అనంతరం కొందరు రైతులతో పవన్‌కల్యాణ్, యరపతినేని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ అరుణ్‌బాబు, జాయింట్ కలెక్టర్ సూరజ్‌గోనేరి, ఆర్డీవో మురళీకృష్ణలతో పాటు వివిధ శాఖల అధికారులు, టీడీపీ, జనసేన నేతలు పాల్గొన్నారు.

టోల్ బాదుడు

(3వ పేజీ తరువాయి)

చార్జీలతో కారు/జీపు/వ్యాన్ సింగిల్ జర్నీకి రూ.145, రిటర్న్ జర్నీకి రూ.220, నెలవారీ పాసు రూ.4790కి పెంచింది. అదే ఎల్‌సీవీ వాహనానికి సింగిల్ జర్నీకి రూ.245, బస్సు/ట్రక్‌కు రూ.515, మూడు యాక్సిల్ వాహనం వరకు రూ.565, 4 నుంచి 6 యాక్సెల్స్ ఉన్న వాహనాలకు రూ.810, హెచ్‌సీఎం/ఈఎంఈకి రూ.810, 7, అంతకంటే ఎక్కువ యాక్సిల్ వాహనాలకు రూ.820కి పెంచింది. రిటర్న్ జర్నీ ఎల్‌సీవీకి రూ.370, బస్సు/ట్రక్‌కు రూ.770, త్రీ యాక్సెల్ వరకు వాహనాలకు రూ.845, 4 నుంచి 6 యాక్సెల్ వరకు వాహనాలకు రూ.1215, హెచ్‌సీఎం/ఈఎంఈకి రూ.1215, ఏడు, అంతకంటే ఎక్కువ యాక్సెల్ ఉన్న వాహనాలకు రూ.1230కి పెంచేసింది. నెలవారీ చార్జీలను కూడా బాదేసింది. ఎల్‌సీవీకి రూ.8230, బస్సు/ట్రక్‌కు రూ.17085, త్రీ యాక్సెల్ వరకు రూ.18810, 4 నుంచి 6 యాక్సెల్ వాహనాలకు రూ.27035, హెచ్‌సీఎం/ఈఎంఈకి రూ.27035, ఏడు, అంతకంటే ఎక్కువ యాక్సెల్ వాహనాలకు రూ.27290కి పెంచింది.

బస్సు చార్జీలు పెంచక తప్పని పరిస్థితి

టోల్ ప్లాజా రేట్లు పెంచడంతో ఆర్టీసీ, ప్రైవేటు బస్సుల చార్జీలను తప్పక పెంచాల్సిన పరిస్థితి ఉత్పన్నమైంది. గతంలో 24 గంటల్లో ఎన్ని రిటర్న్ జర్నీలైనా చేసే అవకాశం ఉన్నందున ఆర్టీసీ, ప్రైవేటు బస్సుల ఆపరేటర్లు ఆ చార్జీలను ప్రయాణికుల వద్దనే వసూలు చేసేవారు. ఇప్పుడు ట్రిప్పుల లెక్కన టోల్‌చార్జీలు చెల్లించాల్సిన పరిస్థితి తలెత్తింది. ఉదాహరణకు తాడికొండ - మంగళగిరి మధ్య ప్రైవేటు ఆపరేటర్ గతంలో నెలవారీ పాస్ తీసుకుంటే రూ.6500 అయ్యేది. ఇప్పుడు అపరిమిత రిటర్న్ జర్నీలు ఎత్తేయడం వల్ల నెలకు దాదాపుగా రూ.45 వేలు చెల్లించాల్సిన పరిస్థితి ఉత్పన్నమైంది. ఇదే పరిస్థితి ఆర్టీసీపై కూడా పడుతుంది. దీంతో వారు టిక్కెట్ల ధరలు పెంచి టోల్ భారాన్ని ప్రయాణికుల నుంచి వసూలు చేసే అవకాశం ఉంది.

నెలవారీ పాస్ చార్జీల్లోనూ పెరుగుదల

గతంలో టోల్‌ప్లాజాకు 20 కిలోమీటర్ల పరిధిలో నివసిస్తూ సొంత వాహనాలు కలిగిన వారికి నెలవారీ పాస్‌లను జారీ చేసేవారు. రూ.150 కట్టించుకుని ఈ పాస్ ఇచ్చేవారు. నెలలో 50 సింగిల్ జర్నీలు చేసే అవకాశం ఉండేది. ఇప్పుడు దానిని రూ.340కి పెంచింది. 50 సింగిల్ జర్నీలు దాటితే అదనంగా చెల్లించాల్సి వచ్చేది.

అర్జీలను సహేతుకంగా పరిష్కరించాలి

కలెక్టర్ అన్సారియా ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం) అర్జీలు సహేతుకంగా పరిష్కారమయ్యేలా పర్యవేక్షించాల్సిన బాధ్యత సంబంధిత డివిజన్ సబ్‌కలెక్టర్, ఆర్డీవోలదేనని జిల్లాకలెక్టర్ తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. స్థానిక కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో జాయింట్‌కలెక్టర్ గోపాలకృష్ణతో కలిసి ఒంగోలు డివిజన్ పరిధిలోని రెవెన్యూ అధికారులతో మంగళవారం జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. అర్జీలను క్షేత్రస్థాయి అధికారులు పరిష్కరిస్తున్న తీరును ఆయా డివిజనల్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. మీకోసం అర్జీలను పరిష్కరిస్తున్న తీరుపై ఆడిట్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రెవెన్యూ సమస్యలపై వస్తున్న అర్జీలు రాన్రాను తగ్గుముఖం పడుతున్నాయని చెప్పారు. జేసీ గోపాలకృష్ణ మాట్లాడుతూ అర్జీల పరిష్కారం గడువు చివరి తేదీ వరకు వేచి చూడవద్దన్నారు. సాగునీటి సంఘాలకు ఎన్నికలు ఉన్నందున నీటి వనరులు ఆక్రమణలకు గురికాకుండా చూడాలని చెప్పారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి చిన్న ఓబులేషు, ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న, డీఎస్‌వో పద్మశ్రీ, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

చర్యలకు సిద్ధం

- రోజంతా హైడ్రామా అనంతరం సీఈవో రాజీనామా
- సీఎంవో ఆదేశాలతో కదిలిన సహకార శాఖ అధికారులు
- సెక్షన్ 51 విచారణవైపు అడుగులు

ఒంగోలు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో చోటు చేసుకున్న అక్రమాల వ్యవహారంపై చర్యలకు రంగం సిద్ధమవుతోంది. అందుకు సంబంధించి పలు పరిణామాలు మంగళవారం చోటుచేసుకున్నాయి. ఈ అక్రమాల బాగోతంపై ఏకంగా సెక్షన్ 51 విచారణ వేసే వైపు ఉన్నతస్థాయిలో అడుగులు పడుతున్నాయి. అదేసమయంలో స్థానికంగా బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జీ నేతృత్వంలోని పాలకమండలి దిద్దుబాటు చర్యలను వేగవంతం చేసింది. వారి ఆదేశానుసారం బ్యాంకు సీఈవో కోటిరెడ్డి మంగళవారం రాత్రి రాజీనామా చేసినట్లు తెలిసింది. అయితే ఈ విషయంలో రోజంతా పెద్ద హైడ్రామానే చోటు చేసుకున్నట్లు సమాచారం. బ్యాంకులో అక్రమాలపై విచారణ నేపథ్యంలో సీఈవోను బాధ్యతల నుంచి తప్పించడంతోపాటు సమగ్ర విచారణ కోసం సెక్షన్ 51 విచారణ కోరుతూ కలెక్టర్ రాసిన లేఖలపై సకాలంలో అటు ఉన్నత స్థాయిలో, ఇటు బ్యాంకు పాలక మండలి చర్యలు లేని విషయాన్ని ఆంధ్రజ్యోతి బట్టబయలు చేసిన విషయం తెలిసిందే. ఇందుకు సంబంధించి వరుస కథనాలు రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులు, ప్రభుత్వ పెద్దలలో పెద్ద చర్చకు దారితీయగా విషయం నేరుగా ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి వెళ్లింది. దీంతో సీఎం కార్యాలయం కూడా దీనిపై దృష్టిసారించింది. అలాగే సోమవారం కూడా డీఆర్సీ సమావేశానికి వచ్చిన ఇన్‌చార్జీ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కూడా ఈ వ్యవహారంపై జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడి తక్షణ చర్యలకు సూచించారు.

పాలకమండలి సమావేశంలో..

ఆ నేపథ్యంలో మంగళవారం బ్యాంకు పాలకమండలి సమావేశం పర్సన్ ఇన్‌చార్జీ అయిన జేసీ గోపాలకృష్ణ నేతృత్వంలో మంగళవారం బ్యాంకులో జరిగింది. కలెక్టర్ సూచనల మేరకు సీఈవో విషయంపై చర్చ కోసం ఆ మీటింగ్ నిర్వహించినా అందులో తక్షణం ఎలాంటి నిర్ణయం తీసుకోలేకపోయారు. సీఈవోను తొలగించడం కన్నా ఆయనే రాజీనామా చేస్తే బాగుటుందన్న భావనతో పర్సన్ ఇన్‌చార్జీ సూచనలతో బ్యాంకు అధికారులు పలుమార్లు సీఈవోతో సంప్రదింపులు చేసినట్లు సమాచారం. ఈ విషయంలో రోజంతా హైడ్రామా జరగ్గా ఎట్టకేలకు రాత్రి సమయానికి సీఈవో తన రాజీనామాను పీపీసీ చైర్మన్‌కు ఇచ్చినట్లు తెలిసింది. అయితే దానిని ధ్రువీకరించి చెప్పేందుకు బ్యాంకు ప్రస్తుత అధికారులు ధైర్యం చేయడం లేదు. మొత్తం మీద సీఈవో కోటిరెడ్డి రాజీనామా చేసినట్లు సహకార బ్యాంకు ఉద్యోగులలో రాత్రి పొద్దుపోయాక విస్తృత చర్చ సాగింది. ఆ విషయం అలా ఉంచితే బ్యాంకులో అక్రమాలు, కలెక్టర్ రాసిన లేఖలపై ఉన్నతాధికారులు సకాలంలో స్పందించని విషయం సీఎం దృష్టికి వెళ్లింది. దీంతో ప్రస్తుత సహకార శాఖ రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు కదిలారు. బ్యాంకులో అక్రమాలను నిగ్గుతేల్చేందుకు సెక్షన్ 51 విచారణ వైపు మొగ్గుచూపుతున్నట్లు సమాచారం. ఇందుకు సంబంధించి ఉన్నతాధికారులు పలు విషయాలపై మంగళవారం కలెక్టర్ అన్సారియాతో మాట్లాడినట్లు తెలిసింది. ఫిర్యాదులో పేర్కొన్న అంశాలపై ప్రాథమిక నివేదిక ఇవ్వాలని కలెక్టర్‌కు వారు సూచించినట్లు తెలిసింది. ఆ నివేదిక ఆధారంగా సెక్షన్ 51 విచారణ వేసే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం.

క్వారీల్లో తనిఖీలు

చీమకుర్తి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి) : రామతీర్థం గ్రానైట్ క్వారీల్లో నిర్వహిస్తున్న భద్రతా వారోత్సవాల్లో భాగంగా తనిఖీ బృందాలు రెండోరోజైన మంగళవారం తనిఖీలు నిర్వహించారు. గోల్డెన్ గ్రానైట్ క్వారీలో మేనేజర్ గిరి తనిఖీ సభ్యులకు స్వాగతం పలికారు. కార్మికులతో భద్రతా ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం క్వారీలో నిర్వహించే కార్యకలాపాలను బృందసభ్యులు పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేశారు. అదేవిధంగా పెరల్, మిడ్ వెస్ట్, జెమ్, కామాక్షి, బీవీఎల్ గ్రానైట్ క్వారీల్లో తనిఖీలు జరిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



సంతమాగులూరు, నవంబరు 5 : మండలంలోని పుట్టావారిపాలెం అడ్డరోడ్డులో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం మధ్యాహ్నం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పుట్టావారిపాలెం అడ్డరోడ్డులోని సమోసాల దుకాణం వద్ద గుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే అక్కడకు చేరుకున్న పోలీసులు ఆ వ్యక్తిని పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. అతడి ఎడమ చేతిపై చిన్న లాజర్ అని రాసివుంది. కుడి చేతివేలికి ఉన్న ఉంగరంపై శిలువ గుర్తు ఉన్నట్లు తెలిపారు.

సార్.. అంబులెన్స్ కావాలి.. గంట ఆగండి!

- అందుబాటులో లేని 108
- సరిపడా వాహనాలు లేక అత్యవసర రోగుల అవస్థలు
- రిఫర్‌లతో చేతులు దులుపుకుంటున్న ఏరియా వైద్యశాల వైద్యులు
- నిత్యం చీరాల నుంచి 6- 10 కేసులు
- మార్గమధ్యలోనే కాన్పులు
- అధికారులు పట్టించుకోవాలని ఆవేదన


మరమ్మతుకు గురైన వాహనాలు

చీరాలటౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : అత్యవసరమైతే 108కి ఫోన్ చేస్తే ఆగమేఘాల్లో వచ్చి రోగిని ఆసుపత్రికి తీసుకెళ్తుంది.. ఇది అంబులెన్స్ పని.. కానీ అంబులెన్స్‌కు కావాలని ఫోన్ చేస్తే గంట ఆగాలని అటునుంచి సమాధానం వస్తుంది. దీంతో చేసేది లేక ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సిన దుస్థితి ఉంది.

చీరాల ఏరియా వైద్యశాల 100 పడకల హాస్పిటల్‌గా రూపాంతరం చెంది నిత్యం రోగులతో బిజీబిజీగా మారింది. ఇక్కడికి మార్టూరు, ఉప్పుగుండూరు, చినగంజాం, పెదగంజాం, నాగులుప్పలపాడుకు చెందిన రోగులు నిత్యం అత్యవసర, సాధారణ వైద్య సేవల కోసం పెద్ద సంఖ్యలో వస్తున్నారు. జాతీయ రహదారితోపాటు వాహనాల రద్దీ పెరగడంతో ప్రమాదాలు అధిక సంఖ్యలో జరుగుతున్నాయి. దీంతో అత్యవసర సేవలకు గిరాకీ బాగానే పెరిగింది. ఏరియా హాస్పిటల్‌కు వచ్చే గర్భిణులు, రోడ్డు ప్రమాదాలకు సంబంధించి వైద్యులు ప్రతిసారీ ఇతర ఆసుపత్రిలకు (రిఫర్) పంపిస్తూ చేతులు దులపుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. చేసేది లేక గర్భిణులు సైతం ఒంగోలుకు వెళుతూ మార్గమధ్యలోనే కాన్పు అవుతున్నారు. పీహెచ్‌సీల్లోనే కాన్పులు జరగాలని ఒకపక్క అధికారులు సూచిస్తుంటే, ఏరియా హాస్పిటల్ మాత్రం చిన్నవాటికి కూడా రిఫర్ చేయడంపై రోగులు, వారి బంధువులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రిఫర్ రాయగానే సమస్య పెద్దదని రోగులు ఆందోళన చెందుతూ ప్రాణాలమీదికి తెచ్చుకుంటున్నారు.

అందుబాటులో లేని 108

ప్రస్తుతం చీరాల ఏరియా వైద్యశాల పరిధిలో చీరాలకు ఒకటి, వేటపాలెం 1, కారంచేడుకు ఒక 108 వాహనాలు ఉన్నాయి. అంతకుముందే హాస్పిటల్‌కు అత్యవసర పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ఏర్పాటు చేసిన అదనపు వాహనం చాలాకాలంగా మూలనపడింది. అంతకు ముందు మరో వాహనం కూడా మరమ్మతులకు చేరడంతో ప్రస్తుతం హాస్పిటల్‌లో రెండు నిరుపయోగంగా ఉన్నాయి. వాడకంలో ఉన్న వాహనాలు కూడా అంతంత మాత్రంగానే నడుస్తున్నాయి. ఈక్రమంలో అత్యవసర వైద్యం కోసం రోగులు 108ని సంప్రదిస్తే వారికి వినబడే స్వరం ఒక్కటే సుమారు గంట పడుతుంది ఉండగలా...దీంతో ప్రజలు అత్యవసర సమయాల్లో ఆందోళనకు గురవుతున్నారు. మరోవైపు హాస్పిటల్ వైద్యులు నిర్లక్ష్యంతో కొన్నిసార్లు వాహనాలు రిఫర్‌లో ఉంటున్నాయి. ఈక్రమంలో అత్యవసర వైద్యం కోసం ఆశ్రయించిన రోగులకు 108 అంబులెన్స్ సేవలు అందడం లేదు. ఈక్రమంలో వైద్యుల నిర్వాకంపై దృష్టిసారించాలని, మరమ్మతులు చేసి వాహనాలను అందుబాటులోకి తేవాలని రోగుల బంధువులు కోరుతున్నారు.

తహసీల్దార్‌గా కవిత బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరించిన కవిత

బల్లికురవ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : బల్లికురవ తహసీల్దార్‌గా దాసరి కవిత మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. సెప్టెంబర్‌లో ఆమె ఇక్కడ బాధ్యతలు తీసుకున్నప్పటికీ జిల్లా అధికారులు డిప్యూటేషన్‌పై కలెక్టర్ కార్యాలయానికి పంపారు. తిరిగి ఆమె మంగళవారం చార్జి తీసుకున్నా రు. ఇన్‌చార్జి తహసీల్దార్‌గా ఉన్న డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్ నుంచి బాధ్యతలు స్వీకరించారు. కవిత మాట్లాడుతు రైతులకు సంబందించిన పెండింగ్ సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామన్నారు. సమస్యలను ప్రజలు నేరుగా తమ దృష్టికి తీసుకురావాలని కవిత కోరారు. టీడీపీ మండల నాయకులు మలినేని గోవిందరావు, కార్యాలయ ఉద్యోగులు తహసీల్దార్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పర్చూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పర్చూరులోని బొమ్మల సెంటర్ ప్రాంగణంలో విద్యుత్ స్తంభాల ఏర్పాటులో భాగంగా బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు కరెంట్ సరఫరాను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ఏఈ రమేష్ నాయక్ మంగళవారం తెలిపారు.


క్వారీలో తనిఖీలు చేస్తున్న టీం

భద్రతపై అప్రమత్తంగా ఉంటాం

ప్రతిజ్ఞ చేసిన గ్రానైట్ కార్మికులు

బల్లికురవ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : గనులలో పనులు చేసే సమయంలో అప్రమత్తంగా ఉంటామని గ్రానైట్ కార్మికులు ప్రతిజ్ఞ చేశారు. మంగళవారం వీర్ల కొండ వద్ద ఉన్న ఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్, సాయిస్టోన్, ఇంపీరియల్, కేఎస్ఆర్ గ్రానైట్ క్వారీలలో భద్రతా వారోత్సవాలు జరిగాయి. ఈసందర్భంగా తనిఖీ బృందాలు క్వారీలలో చేపడుతున్న భద్రతా చర్యలపై పరిశీలన జరిపి నివేదికలను తయారు చేశారు. ముందుగా అన్ని క్వారీలలో కార్మికులకు భద్రత చర్యల గురించి వివరించి వారిచే ప్రతిజ్ఞ చేయించారు. ఈసందర్భంగా టీం కన్వీనర్లు మాట్లాడుతూ గనులలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ముందస్తుగా ఏటా భద్రతా వారోత్సవాలను నిర్వహిస్తున్నామని, క్వారీ యజమానుల సహకారం బాగుందని తెలిపారు. కార్యక్రమంలో టీం కన్వీనర్‌లు లీలారామ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పత్తిని సీసీఐ కేంద్రాల్లోనే అమ్మాలి


పత్తిని పరిశీలిస్తున్న ఏవో కుమారి

బల్లికురవ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రైతులలంతా పత్తికి మద్దతు ధర లభించేలా సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవాలని వ్యవసాయ శాఖ ఏవో కుమారి కోరారు. మంగళవారం మండలంలోని సోమవరప్పాడు, ఉప్పుమాగులూరు గ్రామాలలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఏవో మాట్లాడుతూ పత్తి క్వింటా రూ.7521గా ప్రభుత్వం మద్దతు ధరను నిర్ణయించి కొనుగోలు చేస్తుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రబీ పంటలకు బీమా ప్రీమియం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో పశుసంవర్థక శాఖ అధికారి శ్రీనివాస్, వీఏఏలు హనుమనాయక్, హరికృష్ణ పాల్గొన్నారు.

పంగులూరు : వరి పైరులో కాండం తొలుచు పురుగును గుర్తించినట్లు వ్యవసాయాధికారి డి.సుబ్బారెడ్డి అన్నారు. మండలంలోని బైటమంజులూరు, ముప్పవరం గ్రామాలలో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. వరి పైరుకు కాండం తొలుచు పురుగు ఆశించిదని, దాని నివారణకు సస్య రక్షణ చర్యలు చేపట్టాలని రైతులకు ఏవో సూచించారు. కార్యక్రమంలో కుక్కపల్లి ఏడుకొండలు, భాస్కరరావు, ఏఈవో ప్రభాకరరావు, వ్యవసాయ సహాయకులు పృధ్వీసాయి, దిల్లియా పాల్గొన్నారు.

వరిలో ఉల్లికోడు

అద్దంకిటౌన్ : వరిలో ఉల్లికోడు నివారణ లక్షణాలను రైతులు గమనించి చర్యలు చేపట్టాలని వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకటకృష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని పేరాయపాలెం, మోదేపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఉల్లికోడు నివారణకు కార్బో ఫ్యూరాన్ 3జీ గుళికలు వేసుకోవాలని, పైరు పిలక దశలో కార్టాప్ హైడ్రో క్లోరైడ్ 400 గ్రాములు పిచికారీ చేయాలని సూచించారు. కూరగాయల సాగు రైతులకు ప్రోత్సాహం అందిస్తున్నట్లు ఉద్యాన అధికారి ఎస్.దీప్తి తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ అనిల్‌కుమార్, ఏఈవో కోటేశ్వరరావు, వీఏఏ దుర్గారావు, బీమని శ్రీనివాసరావు పాల్గొన్నారు.


జూట్ బ్యాగులను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

పర్యావరణ పరిరక్షణతోనే ఆరోగ్యం

చీరాలటౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్క పౌరుడు పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని తద్వారా సంపూర్ణ ఆరోగ్యం అందుతుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. మంగళవారం ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పర్యావరణంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 100 మందికి జూట్ బ్యాగులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రతినిధులు బండారుపల్లి హేమంత్ కుమార్, వలివేటి మురళీకృష్ణ, నాగవీరభద్రాచారి, పవని భానుచంద్రమూర్తి, బత్తుల బ్రహ్మారెడ్డి, వడలి రాధాకృష్ణ పాల్గొన్నారు.

మొరాయిస్తున్న బైపాస్ రైడర్ బస్సులు


రొంపేరు బ్రిడ్జిపై ఆగిన బస్సు

చీరాల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : చీరాల-ఒంగోలు బైపా స్ రైడర్ బస్సులు కొన్ని సందర్భాల్లో మొరాయి స్తు న్నాయి. మంగళవా రం చీరాల నుంచి ఒంగోలు వెళుతున్న బైపాస్ రైడర్ బస్సు చినగంజాం, ఉప్పుగుండూరు మధ్య రొంపేరు బ్రిడ్జి పైన టైరుకు పం క్చర్ కావడంతో ఆగిపోయింది. 46 మంది ప్రయాణికులు ఉండగా, నలుగురు వేరే విధంగా అక్కడ నుంచి తమ గమ్యస్థానాలకు వెళ్లారు. మిగిలిన 42 మంది తరువాత చీరాల నుంచి ఒంగోలు వేళ్లే బైపాస్ రైడర్ బస్సులో ఎక్కి ఒంగోలు చేరారు. మెరుగైన సేవందించేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

టెక్నాలజీతో నైపుణ్యతను పెంపొందించుకోవాలి

పంగులూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు టెక్నాలజీ వినియోగంతో నైపుణ్యతను పెంపొందించుకుని సమాజంలో ఉన్నతంగా ఎదగాలని ఎస్ఐ వినోద్‌బాబు అన్నారు. మండలంలోని కొండమంజులూరు ఉన్నత పాఠశాలలో బాలబాలికలకు లైఫ్ స్కిల్స్‌పై పలు సూచనలు చేశారు. సెల్ ఫోన్ ద్వారా అపరిచిత వ్యక్తులతో చాటింగ్ చేయడం వలన కలిగే అనర్థాలు, ఆన్‌లైన్ గేమ్స్‌తో ఇబ్బందులను ఆయన వివరించారు. ఇలాంటి వాటికి విద్యార్థులు, యువత దూరంగా ఉండాలని సూచించారు. పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం అబ్దుల్‌సమద్, పీసీ కోటేశ్వరరావు, ప్రభాకర్, స్టాఫ్ సెక్రటరీ రామకోటిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాగుతున్న దీక్షధారుల పాదయాత్ర


పాదయాత్ర నిర్వహిస్తున్న దీక్షధారులు

సంతమాగులూరు, నవంబరు 5 : మండలంలోని కుందుర్రు గ్రామానికి చెందిన అయ్యప్ప దీక్షధారులు చేపట్టిన శబరిమల పాదయాత్ర దిగ్విజయంగా కొనసాగుతోంది. సంతమాగులూరు మండలం కుందుర్రు నుంచి ప్రారంభమైన పాదయాత్ర మంగళవారం సంతనూతలపాడు నియోజకవర్గంలోకి చేరినట్లు బృందం తెలిపింది.

నేటి నుంచి ఉపాధి గ్రామ సభలు

చినగంజాం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని గ్రామాల్లో మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి చేయాల్సిన పనుల గుర్తింపు, అంచనాల నిమి త్తం బుధవారం నుంచి గ్రామసభలను నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఏ.శ్రీనివాసమూర్తి తెలిపారు. 6వ తేదీన చింతగుంపల్లి, మోటుపల్లి, మున్నంవారిపాలెం, నీలాయపాలెం, 7న చినగంజాం, గొనసపూడి, కడవకుదురు, సంతరావూరు, 8న కొత్తపాలెం, పల్లెపాలెం, పెదగంజాం, రాజుబంగారుపాలెం పంచాయతీ కార్యాలయాల వద్ద గ్రామ సభలు జరుగుతాయని ఏపీవో జె.లక్ష్మీదేవి తెలిపారు

రెవెన్యూ రికార్డులను భద్రంగా ఉంచాలి

దర్శి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ రికార్డులను సురక్షితమైన ప్రదేశంలో భద్రంగా ఉంచాలని కనిగిరి ఆర్డీవో కేశవర్ధనరెడ్డి సూచించారు. దర్శిలోని పాత తహసీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. సుమారు 115 సంవత్సరాల క్రితం బ్రిటీష్ కాలంలో ఈ భవనా న్ని నిర్మించారు. సుమారు 40 సంవత్సరాలు ఆ భవనంలో కోర్టు నడిచింది. నూతన కోర్టు భవనాలు నిర్మించిన తర్వాత ఆ భవనంలో కొంతకాలం తహసీల్దార్ కార్యాలయంగా ఏర్పాటు చేసుకొని విధులు నిర్వహించారు. 2017లో నూతన తహసీల్దార్ కార్యాలయం నిర్మించిన తర్వాత ఆ భవనం ఖాళీగా ఉంది. అందులో రెవెన్యూ రికారులను భద్రపరచారు. ఈక్రమంలో ఆర్డీవో ఆ భవనాన్ని పరిశీలించి రికార్డులు చూశారు. వర్షాలు పడినప్పుడు భవనం పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వర్షం పడినప్పుడు కొన్నిచోట్ల కారుతుండటంతో పరదాలు కప్పిన విషయాన్ని గుర్తుచేశారు. రెవెన్యూ రి కార్డులు పటిష్టంగా భద్రపరచాలన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగులచవితి


భీమవరం వద్ద పుట్టకు పూజలు చేస్తున్న భక్తులు

చీరాలటౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : చీరాల నియోజకవర్గ పరిధిలో మంగళవారం నాగులచవితి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులు ఆలయాల వద్దకు పోటెత్తారు. నాగేంద్రుడిని మనసారా కొలిచారు. మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఈక్రమంలోనే యువతీ, యువకులు, మహిళలు ఉత్సాహంగా పుట్టల వద్దకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బల్లికురవ : మండలంలోని అన్ని గ్రామాలలో మంగళవారం ప్రజలు భక్తి శ్రద్ధలతో నాగుల చవితి పండగను జరుపుకొన్నారు. పుట్టల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, పుట్టలో పాలు పోశారు. వీర్ల గంగమ్మ దేవాలయం వద్ద ఉన్న పుట్ట వద్ద, శివాలయాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు.

చినగంజాం : మండల పరిధిలోని భక్తులు నాగుల చవితి పండుగను భక్తిశ్రద్ధలతో మంగళవారం ఘనంగా నిర్వహించారు.


కారంచేడులో పూజలు చేస్తున్న భక్తులు

నాగేంద్రస్వామి ఆలయాలల్లో, పుట్టల వద్ద భక్తులు పసుపు, కుంకులతో నాగశిలలను అలకరించి ప్రదక్షిణలు చేశారు. పుట్టలో చలిమిడి, పానకం, సజ్జలు, వడపప్పు, ఆవు పాలను వంచి, దారాలను చుట్టి పసుపు, కుంకుమలతో పూజలు నిర్వహించి తమ మొక్కులను తీర్చుకున్నారు. కొత్తపాలెంలోని బాలకోటేశ్వర స్వామి, కడవకుదురు బస్టాండ్ సమీపంలో, చినగంజాం వల్లీదేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి పూజలు చేశారు.

పర్చూరు : నాగులచవితిని భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పొలిమేర వద్ద స్వామివారి పుట్టలో పాలు పోసి, పూజలు చేశారు. ఉప్పుటూరులో పుట్టకు పూజలు చేశారు. ఆలయ కమిటీ నిర్వాహకులు కాల్వ సత్యనారాయణ నేతృత్వంలో అన్నదానం ఏర్పాటు చేశారు. కారంచేడు, అదిపూడిలో పూజలు చేశారు.

ఇంకొల్లు : గంగవరం, భీమవరంలో నాగుల పుట్టకు పూజలు చేశారు. 40 ఏళ్ల చరిత్ర కలిగిన నాగేంద్రస్వామి పుట్ట వద్దకు అధిక సంఖ్యలో మహిళలు తరలివెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మేదరమెట్ల : నాగులచవితిపండుగను మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దైవాలరావూరు, రెడ్డిపాలెం గ్రామాల్లో శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామికి పూజలు చేశారు. పుట్టలో పాలుపోసి నైవేద్యాలు సమర్పించారు. రెడ్డిపాలెంలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఏకరాతి శిలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.


వీరాంజనేయులు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి

వీరాంజనేయులు కుటుంబ సభ్యులకు మంత్రి గొట్టిపాటి పరామర్శ

బల్లికురవ. నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తపాలెం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు ధూళిపాళ్ల వీరాంజనేయులు రెండు రోజుల కిందట అనారోగ్యంతో మృతి చెందారు. మంగళవారం విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ వీరాంజనేయులు కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ విజయానికి వీరాంజనేయులు కృషి చేశారని, ఆయన మృతి తీరని లోటని గొట్టిపాటి అన్నారు. అనంతరం మంత్రి సంతమాగులూరు మండలం కామేపల్లి గ్రామంలో ఇటీవల మృతి చెందిన టీడీపీ నాయకుడు గంటా రంగారావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయనతోపాటు టీడీపీ నాయకులు మలినేని గోవిందరావు చల్లగుండ్ల రా టం బాబు, మాదాల సాంబయ్య, దద్దాల అంజయ్య, బైరపునేని అజయ్, యాగంటి సింగరయ్య, పున్నారావు ఉన్నారు.


గ్రామ సభలో మాట్లాడుతున్న తహసీల్దార్ సింగారావు

భూ సమస్యలను పరిష్కరిస్తాం

పంగులూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : భూముల రీసర్వేలో తలెత్తిన సమస్యల పరిష్కారానికి గ్రామ సభలు నిర్వహించి చర్యలు చేపడుతున్నట్లు తహసీల్దార్ పీ సింగారావు అన్నారు. మండలంలోని అలవలపాడులో మంగళవారం రీసర్వే సమస్యలపై గ్రామసభను నిర్వహించారు. అనంతరం రైతుల నుంచి దరఖాస్తులను ఆయన స్వీకరించారు. కార్యక్రమంలో రీసర్వే డీటీ అర్జున్, మండల సర్వేయర్ సురేష్, వీఆర్వో కోటేశ్వరరావు, నాగుల్‌మీరావలి పాల్గొన్నారు.

అసైన్డ్ భూమి వివాదంపై విచారణ

తోటవారిపాలెం(చీరాలటౌన్), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : చీరాల మండలం తోటవారిపాలెం పంచాయతీ రంగారావు పేటలో కొంతకాలంగా నెలకొన్న స్థల వివాదంపై తహసీల్దార్ గోపీకృష్ణ మంగళవారం విచారణ చేశారు. స్థలాన్ని పరిశీలించారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు తెలిసింది. తహసీల్దార్ వెంట రెవెన్యూ సిబ్బంది నాగకుమార్, శివారెడ్డి, గ్రామస్థులు గూడూరి శివ రామప్రసాద్, గుమ్మడి చంద్ర, గుమ్మడి సూర్యప్రకాష్ ఉన్నారు.

బాలికలకు సైకిళ్ల పంపిణీ


సైకిళ్లను పంపిణీ చేస్తున్న రోటరీ సభ్యులు

పంగులూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్ ఆఫ్ పంగులూరు ఆధ్వర్యంలో మంగళవారం పాఠశాలల బాలికలకు ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేశారు. పంగులూరు రోటరీ భవనం ప్రాంగణంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు షేక్ కాలేషావలి, డాక్టర్ బత్తుల వీరనారాయణ పర్యవేక్షణలో పంగులూరు, చందలూరు, కొండమంజులూరు ఉన్నత పాఠశాలలకు చెందిన ఐదుగురు బాలికలకు సైకిళ్లను అందచేశారు. హైదరాబాద్ నార్త్ వెలజాన్ ప్రాజెక్ట్ ద్వారా పంగులూరు క్లబ్‌కు 10 సైకిళ్లు సమకూరినట్లు డాక్టర్ వీరనారాయణ తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ క్యాంప్ చైర్మన్ చిలుకూరి వీరరాఘవయ్య, ప్రతినిధులు రాయిణి రామారావు, సుబ్బారావు, అంజనేయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాదిగల ఆత్మీయ సభను జయప్రదం చేయండి

అద్దంకిటౌన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఒంగోలులో ఈ నెల 11వ తేదీన జరిగే మాదిగల ఆత్మయ సభను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ బాపట్ల జిల్లా అధ్యక్షుడు డీ వందనం మాదిగ కోరారు. మంగళవారం అద్దంకిలోని అంబేడ్కర్ సామాజిక భవనంలో బహిరంగ సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాదిగ ఉద్యోగుల సంఘం బాపట్ల జిల్లా అధ్యక్షుడు వంగవరపు రమేష్, మాదిగ ఉద్యోగుల సంఘం అద్దంకి నియోజకవర్గ అధ్యక్షుడు అనపర్తి రమేష్, ప్రధాన కార్యదర్శి గంగవరపు సిద్ధు, బుజ్జిబాబు, పొన్నూరు నేరేంద్ర, చక్రవర్తి, కోటయ్య, మున్నంగి కోటేశ్వరరావు, ఎలీషా, ఉదయ్‌కుమార్, శ్రీనివాసరావు, అనిల్, అశోక్ పాల్గొన్నారు.

ఉద్యోగులకు చిరునామా చిమ్మిరిబండ ఎస్సీకాలనీ

- వ్యవసాయమే ప్రధాన వృత్తి
- వివిధ రంగాలలో 50 మందికి పైగా ఎంప్లాయిస్

మార్టూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మార్టూరు మం డలం చిమ్మిరిబండకు ఓ ప్రత్యేక గుర్తింపు లభించింది. ఇక్కడి ఎస్సీ కాలనీకి చెందిన వారు అధికులు ప్రభుత్వ కార్యాలయాల్లో కొలువుదీరారు. వారిలో లాయర్లు, టీచర్లు, పోలీసులు, రిజిస్ట్రార్‌లు, విద్యుత్ శాఖ, ఆరోగ్యశాఖ, రెవెన్యూ తదితర విభాగాలలో ఉద్యోగులుగా రాణిస్తున్నారు. కొందరు ఉద్యోగ విరమణ పొందినప్పటికీ ఇంకా 50 మందికి పైగానే వివిధ వృత్తుల్లో రాణిస్తున్నారు. అదే చిమ్మిరిబండ ఎస్సీ కాలనీ ప్రత్యేకత.




వందనం పేరుతో ఉన్న ప్రభుత్వ జడ్పీ హైస్కూల్

ధనిక, పేద తారతమ్యం లేకుండా కష్టపడి, ఇష్టపడి విద్యను అభ్యసించినవారిని ఆదరిస్తుంది చదువులతల్లి. పేద కుటుంబాలలోని వ్యక్తులు చదువుల తల్లిని నమ్ముకొని, జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగిన వారు ఎంతోమంది ఉన్నారు. అలాంటి కుటుంబాలు మనకు మండలంలోని చిమ్మిరిబండ గ్రామంలో ఎస్సీ కాలనీలో కనిపిస్తాయి. ఈ కాలనీకి చెందిన వారు దాదాపుగా 50 మందికి పైగా వివిధ రంగాలలో ప్రభుత్వ ఉద్యోగులుగా ఉండడం విశేషం.

చిమ్మిరిబండ గ్రామంలో 1800 మంది ఓటర్లు ఉండగా, వారిలో సగం ఓటర్లు 900 మంది ఎస్సీకాలనీకి చెందినవారు. ఈ కాలనీ వాసులలో 30 సెంట్ల నుంచి 4ఎకరాల వరకు పొలం ఉన్న రైతులు ఉన్నారు. వారంతా కష్టపడి పొలం పనులు చేసుకుంటారు. దానికి తోడు సమీపంలో సాగర్ మైనరు కాలువ ఉండడంతో సాగుపైనే ఆసక్తి చూపిస్తుంటారు. దీంతో ఈ కాలనీలో వలసలు తక్కువ. 1925లోనే ఈ కాలనీలో ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలను తాళ్లూరి వందనం అనే వ్యక్తి ప్రారంభించారు. ఆయన తదనంతరం కుమారుడు సత్యానందం, కోడలు కృపమ్మ అదే స్కూల్‌లో ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నారు. వారు కాలనీలోని వారిని చైతన్య పరచి, దాదాపుగా ప్రతి కుటుంబం నుంచి పిల్లలు బడికి వచ్చే విధంగా కృషి చేశారు. ఇంకా ఈ స్కూల్లో పలువురు ఉపాధ్యాయుల కృషితో బడికి పోయేవారి


టీచర్‌లైన ఐదుగురు కుమార్తెలతో విశ్రాంత ఉపాధ్యాయిని కృపమ్మ

సంఖ్య పెరిగింది. 2000లో యూపీ, జడ్పీ హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ అయింది. ఈ స్కూల్‌కు తాళ్లూరి వందనం పేరు పెట్టడం విశేషం. ప్రస్తుతం ఈ హైస్కూల్‌కు వందనం మవవరాలు ఇందిరా ప్రియదర్శిని ప్రధానోపాధ్యాయినిగా పనిచేస్తున్నారు. ఇటీవల కాలనీకి చెందిన ప్రభుత్వ ఉద్యోగులందరి సహకారంతో సుమారు రూ.10లక్షలతో కాలనీ వద్ద డాక్టరు బీఆర్ అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ భారీ విగ్రహాలను ఏర్పాటు చేశారు. అంతేగాకుండా కాలనీలో పేదకుటుంబాలకు, అనారోగ్యానికి గురైన వారికి కూడా వారు ఆర్థిక సాయాన్ని అందిస్తున్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 3

శ్రీ పొట్టి శ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
బుధవారం 6 నవంబరు 2024

నెల్లూరులో రూ.10లకే ఆర్టీసీ ప్రయాణం | ముగ్గురు ఎస్మార్ట్ సిబ్బంది సస్పెన్షన్ 4

ఎక్సైజ్ శాఖలో కొందరు ఉన్నతాధికారులు కరువులో ఉన్నట్టున్నారు. ఐదేళ్ల ప్రభుత్వ మద్యం దుకాణాల ద్వారా మామూళ్లు అందక అల్లాడిపోయిన ప్రభావమో.. అప్పటి నష్టాన్ని ఇప్పుడు పూడ్చుకోవాలనే తాపత్రయమో ఏమోగానీ ప్రైవేటు మద్యం వ్యాపారుల మీద పడుతున్నారు. ఇంకా షాపులు తెరిచీ తెరవకముందే 'మా మామూళ్లు మాకిచ్చేయండి.' అంటూ వెంటపడుతున్నారు. సర్కిళ్ల స్థాయిలో సమావేశాలు పెట్టి పర్మినెంట్ లైసెన్సు ఇచ్చినందుకు ఎక్సైజ్ అధికారుల పర్సనల్ పన్ను కింద ఒక్కో షాపునకు రూ.లక్ష కట్టాలని రేటు ఫిక్స్ చేశారు. ఈ షాక్ నుంచి వ్యాపారులు తేరుకోకముందే "ఇచ్చేయండి.. ఇచ్చేయండి... ఖర్చులకు కూడా ఏమీ లేదు. ఐదేళ్లుగా పస్తులున్నాం.." అంటూ ఒత్తిడి చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం వల్ల ఇతర ప్రభుత్వ శాఖల మాట ఎలా ఉన్నా ఎక్సైజ్ శాఖ మాత్రం 'ఫుల్లు' హ్యాపీగా ఉందనడానికి తెరపైకి వచ్చిన ఈ మామూళ్ల ఫిక్సేషనే నిదర్శనం.

షాపునకు రూ.లక్ష!

• రేటు ఫిక్స్ చేసిన ఎక్సైజ్ అధికారులు

- లైసెన్స్ ఇవ్వాలంటే తప్పదు మరి
- రూ.2కోట్ల సంపాదనకు అధికారుల స్కెచ్
- సమావేశం పెట్టి మరీ ఆదేశాలు జారీ
- అంత ఇచ్చుకోలేమంటూ వ్యాపారుల వేడుకోలు
- కొనసాగుతున్న బేరసారాలు.. నేడో రేపో తుది నిర్ణయం



నెల్లూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : సాధారణంగా ప్రభుత్వ శాఖల్లో ప్రత్యేకించి కొన్నింటికి చాలా డిమాండ్ ఉంటుంది. ఆ శాఖల్లో అటెండరుగా అయినా సరే బతకడానికి చాలా మంది ఉబలాటపడతారనేది నానుడి. అలాంటి కొన్ని శాఖల్లో ఎక్సైజ్ ఒకటి. ఈ శాఖలో ఉద్యోగం లభిస్తే ఇక డబ్బులే డబ్బులు. ఇంతటి ఘన కీర్తి కలిగిన ఈ శాఖ గత ఐదేళ్లుగా చాలా కష్టపడిపోయింది. మద్యం వ్యాపారం పేరుతో కొంతమంది, మామూళ్ల పేరుతో కొంతమంది తినడం ఏమిటి!? మొత్తం మేమే తింటాం!? అనే చందంగా వైసీపీ పాలకులు కొత్త ఎక్సైజ్ విధానం పేరుతో ప్రభుత్వ మద్యం దుకాణాలను తెరిచారు. చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో తెలివిగా దోపిడీ చేశారు. దీంతో పాపం ఎంతో వైభవంగా బతికిన ఎక్సైజ్ శాఖకు పైసా కూడా అదనపు ఆదాయం లేకుండా పోయింది. గడిచిన ఐదేళ్లు ఇలా జీతం తప్ప గీతం ఎరుగని కరువు కాలాన్ని ఎదుర్కొన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం మద్యంప్రియులకు కాసింత మంచి మందు లభించేలా చేయాలని, ఈ వ్యాపారంతో పది మందికి జీవనోపాధి లభించాలనే విశాల దృక్పథంతో పాత మద్యం విధానాన్ని తీసుకొచ్చింది. ఇది ఎక్సైజ్ శాఖ అధికారుల్లో ఆశలు పెంచింది. వైసీపీ పాలనలో మామూళ్ల రూపంలో ఎంత నష్టపోయారో లెక్కలేసుకొని, ఆ మొత్తాన్ని కూటమి పాలనలో వసూలు చేసుకోవాలని నిశ్చయానికి వచ్చినట్టు ఉన్నారు. ఆ క్రమంలోనే మద్యం షాపులకు పర్మినెంట్ లైసెన్సు పేపరు చేతికి ఇవ్వాలంటే ఒక్కో షాపునకు లక్ష రూపాయల చొప్పున మామూళ్లు ఇవ్వాలని షాపు యజమానులకు రేటు ఫిక్స్ చేశారు.

• సర్కిల్ అధికారులకు బాధ్యతలు

సర్కిల్ స్థాయి అధికారులకు వసూళ్ల బాధ్యతను అప్పగించారు. వారు యుద్ధప్రాతిపదికన రంగంలోకి దిగారు. తమ పరిధిలోని షాపు యజమానులను సమావేశపరిచి లైసెన్సుకు ఫిక్స్ చేసిన రేటు గురించి చెప్పారు. జిల్లాలో మొత్తం 182 షాపులు ఉన్నాయి. ఒక్కోదానికి రూ.లక్ష చొప్పున 1.82 కోట్ల రూపాయలకు స్కెచ్ వేశారు. ఈ స్థాయిలో మామూళ్లు ఇవ్వమని చెప్పే సాహసం చేయలేక వ్యాపారులు నలిగిపోతున్నారు. వాస్తవానికి వీరికున్న బాధలు వీరికున్నాయి. సువిశాల జిల్లాలో షాపు పెట్టుకోవడానికి పది అంకణాల స్థలం దొరక్క అల్లాడుతున్న మద్యం వ్యాపారులు ఉన్నారంటే అతిశయోక్తి కాదు. పది రూపాయల వ్యాపారం జరిగే ప్రాంతాలను కొందరు అధికార పార్టీ నాయకులు కైవసం చేసుకొని తమకు చెందినవారి షాపులను మాత్రమే పెట్టుకోనిస్తున్నారు. నచ్చినచోట షాపు పెట్టుకునేలా ప్రభుత్వం చట్టం చేసినా దాన్ని అమలు చేయగలిగే సత్తా ఎక్సైజ్ అధికారులకు, జిల్లా ఉన్నతాధికారులకు ఉండటం లేదు. అధికారానికి ఎదురు వెళ్లాలంటే చట్టం వణికిపోతోంది, కానీ మామూళ్లకు మాత్రం ఎగనెత్తుకొని వచ్చేస్తున్నారు సార్.. అంటూ మద్యం వ్యాపారులు వాపోతున్నారు. ఏది ఏమైతేనేం.. ఎవరు ఏమైతేనేం... ఎక్సైజ్ శాఖ మామూళ్లు మాత్రం పక్కా!? ఒకవేళ రేటు పది రూపాయలు అటు ఇటో తేడా ఉండవచ్చు కానీ ఎక్సైజ్ శాఖ తోటలో మామూళ్ల పంట పండటం మాత్రం ఖాయమనే వార్తలు వినిపిస్తున్నాయి.

తీరనున్న ఆకాంక్ష!

- నేడు డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల
- జిల్లాలో 615 పోస్టుల భర్తీ

నెల్లూరు (విద్య), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పచ్చజెండా ఊపడంతో నిరుద్యోగుల్లో ఆనందం నెలకొంది. ఇప్పటికే టెట్ ఫలితాలు విడుదలవగా, బుధవారం డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో అభ్యర్థులు ఉత్సాహంగా ఉన్నారు. రాష్ట్రంలో 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటామని ప్రకటించిన ఎన్డీఏ ప్రభుత్వం మెగా డీఎస్సీ నిర్వహణకు ఆమోదం తెలిపింది. ఉద్యోగ ఖాళీలు అధికంగా ఉన్నా గత జగన్ ప్రభుత్వం నిరుద్యోగుల ఆశలను నీరుగార్చేలా నోటిఫికేషన్ జారీ చేసింది. అప్పట్లో విద్యార్థి సంఘాలు, నిరుద్యోగులు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం నిరుద్యోగులకు ఊరట కలిగించేలా నిర్ణయం తీసుకోవడంతో ఉపాధ్యాయ అభ్యర్థుల్లో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి. ఈ డీఎస్సీలో కొత్తగా బీఈడీ, డీఎడ్ పూర్తి చేసుకున్న వారికీ అవకాశం కల్పించనున్నారు. జిల్లాలో గత ఐదేళ్లలో డీఎడ్ పూర్తి చేసిన వారు 10వేల మంది, బీఈడీ పూర్తి చేసిన మరో 10వేల మంది నిరుద్యోగులు డీఎస్సీ కోసం ఎదురుచూస్తున్నారు. వీరిలో అత్యధిక శాతం గ్రామీణ, బడుగు, బలహీన వర్గాలకు చెందిన యువతే ఉపాధ్యాయులుగా స్థిరపడాలన్న ఆలోచనతో లక్షలాది రూపాయలు వెచ్చించి కోర్సులను పూర్తి చేశారు. వీరంతా కూడా

- మిగతా 4లో..

నాగేంద్రాయ నమః



నెల్లూరు : ధర్మరాజుల ఆలయంలో నాగుల విగ్రహాన్ని పాలతో అభిషేకిస్తున్న భక్తులు

నాగులచవితి పర్వదినాన్ని జిల్లావాసులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మంగళవారం ఉదయాన్నే ఆలయాలు, చెరువు గట్లు, పొలాల గట్ల వద్ద ఉన్న పుట్టల్లో పాలు పోసి, ప్రత్యేక పూజలు చేశారు. నియమ నిష్టలతో ఉపవాస దీక్షను ఆచరించి, నాగేంద్రస్వామిని పూజించారు.

దాచూరులో అక్రమార్కుల బరితెగింపు

200 ఎకరాల ప్రభుత్వ భూమిపై కొందరి కళ్లు

ప్రభుత్వ భూమేగా.. ఆక్రమించేయ్!



ప్రభుత్వ భూమిని ఆక్రమించి నాటిన నిమ్మ చెట్లు

4

ప్రభుత్వ భూమేగా.. మమ్మల్ని అడిగేదెవరు.. ఆక్రమించేయ్.. అన్న రీతిలో కలువాయి మండలం దాచూరులో అక్రమార్కులు బరితెగించారు. ఏకంగా 200 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాహా చేసేందుకు కుట్రలు పన్నారు. ఇప్పటికే సుమారు 70 ఎకరాలు అక్రమార్కుల చెరలోకి వెళ్లిపోయింది. దాచూరు, పెరంకొండ, ముక్కతిప్ప గ్రామాలకు చెందిన పలువురు భూస్వాములు ఈ ఆక్రమణల వెనుక కీలకంగా ఉన్నట్లు తెలుస్తోంది.

ఒక్క పనీ చేయలేదు మోసగాళ్లుగా చూస్తున్నారు!

'ప్రజలు అడిగిన ఒక్క పని కూడా చేయలేకున్నాము, డివిజన్లలో మాకు కనీస గౌరవం లేదు, మోసగాళ్లను చూసినట్లు చూస్తున్నారు. ప్రతీ కౌన్సిల్లో గొంతెత్తి అరవడం తప్ప మా గోడు పట్టించుకోవడం లేదు. అధికారులకు కార్పొరేటర్లంటే లెక్కేలేదు. పారిశుధ్యంపై ప్రజలు మమ్మల్ని నిలదీస్తున్నారు.' అంటూ నెల్లూరు నగర పాలక సంస్థ సర్వసభ్య సమావేశంలో సభ్యులు వాపోయారు. కొందరు కార్పొరేటర్లు అధికారుల తీరును తూర్పారబట్టారు. ప్రతీ మూడు నెలలకోసారి జరగాల్సిన కౌన్సిల్ సమావేశాన్ని 11 నెలల తర్వాత నిర్వహించడం సబబుకాదంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు.

- కార్పొరేటర్లమనే గౌరవం లేదు
- నగర పాలికలో గళమెత్తిన సభ్యులు
- పారిశుధ్యలేమిపై మండిపాటు
- 64 అంశాలకు ఏకగ్రీవ ఆమోదం

నెల్లూరు(సిటీ), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం మేయర్ పొట్లూరి స్రవంతి అధ్యక్షతన కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం జరిగింది. తమ డివిజన్లలో స్థానిక సమస్యలు ప్రజలను పట్టిపీడిస్తున్నాయంటూ కార్పొరేటర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. సిటీ నియోజకవర్గానికి చెందిన 11వ డివిజన్ కార్పొరేటర్ అరుణ మాట్లాడుతూ తమను డివిజన్లలో ప్రజలు గౌరవించడం మానేశారని, వాళ్లు అడిగిన ఏ ఒక్క పనీ మేము చేయలేకపోతుండటంతో మోసగాళ్లుగా చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 3వ డివిజన్ కార్పొరేటర్ అశ్విని మాట్లాడుతూ ఒక్క సమస్యకూడా పరిష్కారం కాకపోవడంతో చెప్పిన సమస్యలే మళ్లీ చెప్పాల్సి వస్తోందన్నారు. కార్పొరేటర్‌తో సంబంధం లేకుండానే డివిజన్‌లో అన్నీ పనులు చేసేసుకుంటు న్నారని, ఇలాగైతే ఇక తామెందుకని 54వ డివిజన్ కార్పొరేటర్ సఫియా యంత్రాంగాన్ని ప్రశ్నించారు. చెత్తకుండీల్లేక రోడ్లపై చెత్త కుప్పలు పెరుగుతున్నా యని, నగరంలో ట్రాఫిక్‌ను పశువులు నియంత్రించే దుస్థితి దాపురించిందని కార్పొరేటర్ మహేష్ హేళన చేశారు. కిన్నెర మాల్యాద్రి, రవిచంద్ర, సత్తార్ మాట్లాడుతూ పారిశుధ్యం అధ్వానంగా ఉందని, దోమల బెడద తీవ్రమవడంతో ప్రజలకు సమాధానం చెప్పలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.



వైసీపీ సభ్యుల వాదనలు



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ కర్తం

టీడీపీ పేరు ప్రస్తావిస్తే ఊరుకోం : కర్తం

ఈ సమావేశంలో 13వ డివిజన్ వైసీపీ కార్పొరేటర్ నాగార్జున, 14వ డివిజన్ టీడీపీ కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి మధ్య ఆసక్తికర వాదన జరిగింది. దీంతో వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. 13వ డివిజన్‌లో టీడీపీ నాయకులు కాలువలు, ఖాళీ స్థలాలు ఆక్రమించుకుంటున్నారంటూ నాగార్జున పదే పదే పార్టీ పేరు ప్రస్తావించడంతో ప్రతాప్‌రెడ్డి జోక్యం చేసుకున్నారు. టీడీపీ పేరు ప్రస్తావిస్తే ఊరుకోమంటూ అభ్యంతరం చెప్పారు. దీంతో ఇరువురి మధ్య తీవ్ర స్థాయిలో వాగ్వాదం జరిగింది. వైసీపీ పాలనలో 13వ డివిజన్ వ్యాప్తంగా జరిగిన ఆక్రమణలపై విచారణ కమిటీ వేయాలని కర్తం డిమాండ్ చేశారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో నగర నియోజకవర్గానికి కార్పొరేషన్ నిధులు సుమారు రూ.2 కోట్ల వరకు ఖర్చు చేయడం నిబంధనలకు విరుద్ధమన్నారు. ఈ సమయంలో అటు వైసీపీ కార్పొరేటర్లు, ఇటు టీడీపీ కార్పొరేటర్లు వాదనకు దిగడంతో వివాదం ముదిరింది. దీంతో మేయర్ సమావేశాన్ని మధ్యాహ్నానికి వాయిదా వేశారు. కాగా, కోఆప్షన్ సభ్యుడు, జనసేన నాయకుడు నూనె మల్లికార్జున్ యాదవ్ సమావేశ మందిరంలో మోదీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఫొటోలు తీసుకుని రావడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. ఆ చిత్రపటాలను మందిరంలో ఏర్పాటు చేయాలని కోరగా ఇప్పటికే చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఫొటోలు ఉన్నాయని అధికారులు బదులిచ్చారు.

ముత్తుకూరు మార్గంలో రాత్రుళ్లు రోడ్డుపైనే మార్కె ట్ పెడుతున్నారని, దీనివల్ల ప్రయా ణికులకు తీవ్ర ఇబ్బంది కలుగు తోందని 17వ డివిజన్ కార్పొరేటర్ సుధాకర్ ఫిర్యాదు చేశారు.

మూడేళ్లయినా స్టాండింగ్ కమిటీ ఏదీ?

కార్పొరేషన్ ప్రస్తుత పాలక మండలి ఏర్పడి మూడేళ్లు పూర్తి కావస్తున్నా ఇప్పటి వరకు స్టాండింగ్ కమిటీ ఏర్పాటు కాకపోవడం ఆశ్చర్యకరంగా ఉందని సభ్యులు విమర్శించారు. ఇప్పటికైనా స్టాండింగ్ కమిటీ ఏర్పాటు చేయాలని కర్తం ప్రతాప్‌రెడ్డి, మొయిళ్ల గౌరీ పట్టుపట్టారు. ప్రతీ మూడు మాసాలకు జరపాల్సిన సర్వసభ్య సమావేశాన్ని 11 నెలల నుంచి జరపకపోవడాన్ని తప్పు పట్టారు. ఇక నుంచైనా త్రైమాసిక

- మిగతా 4లో

కనకం కోసం కడతేర్చారు!

కాయగూరలు తీసుకువస్తానని వెళ్లిన వృద్ధురాలు మధ్యాహ్నం దాటినా ఇంటికి చేరుకోలేదు. దీంతో కుటుంబ సభ్యులు గాబరా పడ్డారు. ఎక్కడికి వెళ్లిందోనంటూ నెల్లూరు నగరమంతా గాలించారు. గంటలు గడిచినా వృద్ధురాలి జాడ తెలియకపోవడంతో చివరకు పోలీసులను ఆశ్రయించి, ఫిర్యాదు చేశారు. వారు కూడా నగరాన్ని జల్లెడపట్టినా ఆచూకీ దొరకలేదు. ఇలా ఒక రాత్రి గడిచిపోయింది. ఉదయాన్నే పోలీసులు బాధితుల ఇంటికి వెళ్లి 'ఇక ఆమె రాదు.. నగల కోసం మీకు తెలిసినవారే ఆమెను హత్య చేశార'ని చెప్పడంతో కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదించారు.

ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కడానికి అతడు పన్నాగం వేశాడు. తన కుటుంబానికి బాగా తెలిసిన వృద్ధు రాలిని హతమార్చి బంగారు ఆభరణా లను దోచేయాలని పక్కా ప్లాన్ వేసి అమ లు చేశాడు. అయితే, సూట్ కేసులో కుక్కిన మృతదేహాన్ని పడవేసే క్రమంలో కుమార్తెతో సహా పోలీసులకు అడ్డంగా దొరికి పోయారు. తమిళ, తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన ఈ ఘటన వివరాల్లోకి వెళితే..

- నెల్లూరులో వృద్ధురాలి దారుణ హత్య
- సినీ ఫక్కీలో మృతదేహాన్ని మాయం చేసే ప్రయత్నం
- సూట్‌కేస్‌లో శవాన్ని కుక్కిన తండ్రి, కూతురు
- చెన్నై పరిసరాల్లో పడేసేందుకు విఫలయత్నం
- చివరకు తమిళ రైల్వేపోలీసులకు దొరికిపోయిన వైనం

తండ్రీకూతుళ్లను అదుపులోకి తీసుకున్న రైల్వే పోలీసులు





మృతురాలు రమణి (ఫైల్)

నెల్లూరు (క్రైం), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని రాజేంద్రనగర్‌లో మణ్యం మురుగేశం, రమణి దంపతులు ఉంటున్నారు. వీరికి నలుగురు సం తానం. సోమవారం ఉదయం కూరగాయల కోసం రమణి (65) సమీపంలోని దుకాణానికి వెళ్లింది. ఎంత సేపటికి ఆమె రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలించి సాయంత్రం సంతపేట పోలీసు లకు ఫిర్యాదు చేశారు. అదృశ్యం కేసుగా నమోదు చేసి, సంతపేట ఇన్‌స్పెక్టర్ మద్ది శ్రీనివాసరావు, ఎస్‌ఐ బాలకృష్ణలు తమ సిబ్బందితో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి సాంకేతికత ఆధారంగా గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలోనే మంగళవారం ఉదయం ఇన్‌స్పెక్టర్‌కు తమిళనాడులోని చెన్నై సమీపంలో ఉన్న మీంజూరు రైల్వే పోలీసులు ఫోన్ చేసి సూట్‌కేసులో వృద్ధురాలి మృతదేహం గుర్తించామని, సూట్‌కేసు తెచ్చిన నెల్లూరుకు చెందిన బాలసుబ్రహ్మణ్యం, ఈయన కుమార్తె దివ్యశ్రీ తమ అదుపులో ఉన్నారని చెప్పారు. మృతదేహం ఫొటోను పరిశీలించిన ఇన్‌స్పెక్టర్ రమణి అని రైల్వే పోలీసులకు తెలిపారు. దీంతో మింజూరు రైల్వే పోలీసులు తండ్రి, కుమార్తెలను స్టేషన్‌కు తరలించి తమదైన శైలిలో విచారించగా, హత్య చేసిన తీరును వెల్లడించారు. దీంతో పోలీసులు వారిని అరెస్ట్ చేశారు.

• పొరుగు రాష్ట్రంలో పడేయాలనీ..

బాలసుబ్రహ్మణ్యం కుటుంబం గతంలో రమణి ఇంటికి సమీపంలోనే ఉండేది. దీంతో వారి మధ్య పరిచయం ఉంది. కొంతకాలం క్రితం అదే ప్రాంతంలో అపార్ట్‌మెంట్‌లోకి బాలసుబ్రహ్మణ్యం కుటుంబం వెళ్లింది. అయితే, ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న బాలసుబ్రహ్మణ్యం తనకు తెలిసిన రమణి ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలు దోచుకోవాలని నిర్ణయించుకున్నాడు. దీంతో రెండు, మూడు రోజులుగా వృద్ధురాలి కదలికలపై నిఘా ఉంచారు. సోమవారం కూరగాయలకు వెళ్లిన వృద్ధురాలితో మాటామాటా కలిపి తన ఇంటికి తీసుకెళ్లాడు. అక్కడ ఆమెను హత్య చేసి ఒంటిపై ఉన్న సరుడు, నల్లపూసల దండ, కమ్మలు దోచుకున్నాడు. అయితే, మృతదేహాన్ని నెల్లూరు జిల్లాలో ఎక్కడైనా పడేస్తే దొరికిపోతామని భావించిన నిందితుడు తమిళనాడులోని చెన్నై సమీపంలో పడేయాలని నిర్ణయించుకున్నాడు. ఓ ట్రావెల్ సూట్‌కేస్‌లో రమణి మృతదేహాన్ని కుక్కారు. సోమవారం సాయంత్రం సూట్‌కేస్ తీసుకొని బాలసుబ్రహ్మణ్యం, దివ్యశ్రీలు ఊరెళ్తున్నామంటూ చుట్టుపక్కల వారిని నమ్మించారు. నెల్లూరు సౌత్ రైల్వేస్టేషన్‌లో సూట్‌కేస్‌తోపాటు చెన్నై వెళ్లే ప్యాసింజర్ రైలు ఎక్కారు. రైలులో రద్దీ ఎక్కువగా ఉండటంతో సూట్‌కేస్‌ను బయట పడవేసేందుకు అవకాశం దొరకలేదు. చెన్నై సమీపిస్తుండటంతో మీంజూరు స్టేషన్‌లో సూట్‌కేస్ తీసుకొని రైలు దిగేశారు. నెల్లూరు వైపు వెళ్లే రైలు ఎక్కి మార్గమధ్యంలో సూట్‌కేస్‌ను పడేయాలని అనుకుని అక్కడే ఉన్నారు. అదే సమయంలో ప్లాట్‌ఫాంపై రైల్వే పోలీసులు విజిల్ వేయడంతో తండ్రీకూతుళ్లు కంగారు పడి అక్కడ నుంచి వెళ్లబోయారు. ఇంతలో ఓ యువకుడు సూట్ కేస్‌ను మరిచిపోయి వెళుతున్నారంటూ పెద్దగా కేకలు వేశారు. రైల్వే పోలీసులు వారిని ఆపి సూట్‌కేస్ మీదేనా అని ప్రశ్నించడంతో భయంతో వారు సమాధానం చెప్పకపోవడంతో పోలీసులకు అనుమానం వచ్చింది. సూట్‌కేస్‌ను పరిశీలించగా అందులో నుంచి రక్తం వస్తుండటంతో వృద్ధురాలి మృతదేహం బయటపడింది. దీంతో రైల్వే పోలీసులు తమదైన శైలిలో విచారించగా బంగారు ఆభరణాల కోసమే హత్య చేసినట్లు బాలసుబ్రహ్మణ్యం వెల్లడించినట్లు తెలిసింది.

మృతదేహం అప్పగింత

హత్య విషయంపై సమాచారం అందుకున్న సంతపేట ఎస్‌ఐ బాలకృష్ణ, బాధిత కుటుంబసభ్యులతో కలిసి మీంజూరు స్టేషన్‌కు వెళ్లారు. అక్కడ రైల్వే పోలీసు అధికారులతో మాట్లాడి స్థానిక వైద్యశాలలో రమణి మృతదేహానికి పోస్టుమార్టం జరిపించారు. రైల్వే పోలీసులు మృతదేహాన్ని బాధిత కుటుంబసభ్యులకు అప్పగించారు. హత్య జరిగిన ప్రాంతం నెల్లూరు కావడంతో త్వరలోనే కేసును బదిలీ చేస్తామని అక్కడి పోలీసులు తెలిపారు. హత్య జరిగిన సమయంలో బాలసుబ్రహ్మణ్యం భార్య, కుమార్తె ఇంట్లోనే ఉన్నారు. దీంతో ప్రమేయం ఏమైనా ఉందా అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



నెల్లూరు: ధర్మరాజుల ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

నాగేంద్రాయ నమః

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా నాగుల చవితి పర్వదినాన్ని మంగళవారం భక్తిశ్రద్ధలతో జరుపుకు న్నారు. దేవాలయాలు, చెరువు గట్లు, పొలాలగట్ల వెంబడి ఉన్న పుట్టలకు పాలు పోసి, పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. చవితి నోము లు నోచారు. కన్యలు వివాహం కోసం, నవ దంప తులు సంతానం కోసం, మహిళలు సౌభా గ్యం కోసం, నాగేంద్రస్వామిని పూజించారు. నియమ నిష్టలతో ఉపవాస దీక్షను ఆచరించారు. కొందరు చంద్రోదయం అనంతరం దీక్ష విరమిం చగా మిగిలిన వారు బుధవారం ఉదయం పునః పూజానంతరం ఉపవాస దీక్ష విరమించను న్నారు. నెల్లూరులోని మూలాపేట శ్రీకృష్ణ ధర్మరాజుల స్వామి ఆలయం, పొర్లు కట్ట, శెట్టిగుంట రోడ్డు, నాగేంద్రనగర్, నిప్పో సెంటర్, డైకస్ రోడ్డులోని పుట్టల వద్ద భక్తుల రద్దీ నెలకొంది. తెల్లవారు జాము నుంచే బారులుతీరి నోముదారులు చుట్టి పాలుపోసి పూజలు చేశారు.



నెల్లూరు : నాగుల విగ్రహాన్ని పాలతో అభిషేకిస్తున్న ముస్లిం కుటుంబం

ముగ్గురు ఎస్కార్ట్ సిబ్బంది సస్పెన్షన్

నెల్లూరు(క్రైం), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ముగ్గురు ఎస్కార్ట్ సిబ్బందిని విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ఎస్పీ జీ కృష్ణకాంత్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. నెల్లూరుకు చెందిన ఓ వ్యక్తి కుమార్తెపై లైంగిక దాడికి పాల్పడిన ఘటనలో పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ప్రస్తుతం నిందితుడు జిల్లా జైలులో ఉన్నాడు. ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ రామారావు, కానిస్టేబుళ్ల విజయకుమార్, మోహన్‌రావు సదరు నిందితుడిని విచారణ నిమిత్తం కోర్టుకు తీసుకెళ్లారు. తిరిగి జైలుకు తరలించే క్రమంలో నిందితుడిని ఆయన ఇంటికి తీసుకెళ్లారు. భార్యవల్లే తాను జైలుకెళ్లానని అప్పటికే ఆగ్రహంతో ఉన్న నిందితుడు భార్యపై దాడికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని బాధితురాలు ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. విచారణకు ఆదేశించిన ఎస్పీ ఎస్కార్ట్ సిబ్బందిని విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

నెల్లూరులో రూ.10కే ఆర్టీసీ ప్రయాణం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగరం లోని ఆర్టీసీ బస్టాండు నుంచి అయ్యప్పగుడి వరకు ఆర్టీసీ పల్లెవెలుగు బస్సు ల్లో ఎక్కడ ఎక్కి ఎక్కడ దిగినా కేవలం రూ.10 మాత్రమే చార్జీ వసూలు చేస్తున్నామని 1వ డిపో మేనేజర్ మురళీకృష్ణ తెలిపారు. ఆటోలో ప్రయాణి కుల నుంచి రూ.20 కనీస చార్జి వసూలు చేస్తున్నారని, ఆర్టీసీ బస్సులో అయితే సగం ధరకే ప్రయాణం చేయవచ్చని, ప్రజలు ఆర్టీసీని ఆదరించాలని కోరారు.

ప్రభుత్వ భూమేగా.. ఆక్రమించేయ్!

- దాచూరులో అక్రమార్కుల బరితెగింపు
- 200 ఎకరాల ప్రభుత్వ భూమిపై కొందరి కళ్లు
- ఇప్పటికే 70 ఎకరాల్లో నిమ్మ, మినుము పైర్ల సాగు
- కొన్నేళ్లుగా ఈ పొలాలను కొట్టేసేందుకు ప్రయత్నాలు

నెల్లూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కలువాయి మండలం దాచూరు రెవెన్యూ పరిధిలోని సర్వే నెం.989లో 500 ఎకరాలకుపైగా మేత పోరంబోకు భూములు ఉన్నాయి. వీటిలో 300 ఎకరాలకుపైగా కండలేరు జలాశయం కింద ముంపునకు చేరింది. మరో 200 ఎకరాల భూమి ఖాళీగా ఉంది. కండలేరు జలాశయం కింద దాచూరు, కొలప నాయుడుపల్లి వంటి గ్రామాల్లోని కొందరు పేదలు సీజేఎఫ్ఎస్, డీకేటీ భూములు కోల్పోయారు. అటువంటి వారికి ఈ 200 ఎకరాలను పంపిణీ చేయాలని 2009లో నిర్ణయించారు. అందుకు అనుగుణంగా భూమి స్వభావాన్ని మేత పోరంబోకు నుంచి అనాదీనంగా మర్చారు. అయితే పేదల మాటున కొందరు పెద్దలు కూడా ఈ భూమిని సొంతం చేసుకునేందుకు అప్పటి నుంచే ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఈ క్రమంలో జిల్లా అధికారులు కొందరు అర్హులైన పేదలను గుర్తించి వారికి ఒక్కొక్కరికి ఎకరం చొప్పున భూమి ఇచ్చేందుకు నిర్ణ యించారు. కానీ ఈ భూమిపై కన్నేసిన పెద్దలు హైకోర్టును ఆశ్రయించారు. తమకు కూడా భూమి ఇవ్వాలంటూ పిటిషన్ వేయగా, ఆ పిటిషన్‌ను పరిశీలించాలని హైకోర్టు జిల్లా అధికారులకు సూచించింది. ఈ పిటిషన్‌ను పరిశీలించిన అప్పటి జిల్లా అధికారులు.. పిటిషన్ దారులంతా అనర్హులని తేల్చారు. ఆ తర్వాత అర్హులైన పేదలకు కొంత భూమిని పంపిణీ చేసినా ఆ భూమిలోకి వారిని వెళ్లనీయకుండా అడ్డంకులు సృష్టించారు. ఇప్పటికీ ఈ పట్టాలు అందుకున్న కొందరు లబ్ధిదారులు తమకు భూమి అప్పగించండి అంటూ కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నారు.

● కొంచెం కొంచెంగా ఆక్రమిస్తూ..

ఇదిలా ఉండగానే గడిచిన రెండు నెలలుగా కొందరు ఆక్రమణల పర్వం మొదలుపెట్టారు. కొంచెం కొంచెం ఆక్రమించుకుంటూ 70 ఎకరాల దాకా తమ గుప్పెట్లో పెట్టేసుకున్నారు. కండలేరు జలాశయాన్ని ఆనుకొని ఉన్న భూములు కావడం, ఎర్రమట్టి నేల కావడంతో నిమ్మ, మినుము వంటి పంటలను వేసేస్తున్నారు. రెవెన్యూ అధికారులకు తెలిసినా మొదట్లో స్పందించలేదు. అయితే ఆక్రమణలు ఎక్కువవుతుండటంతో సీరియస్‌గా తీసుకున్న రెవెన్యూ సిబ్బంది.. సోమవారం ఆక్రమించిన భూముల్లో బోర్డులు పెట్టారు. ఇవి ప్రభుత్వ భూములని, ఎవరైనా ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక చేశారు. అయినా ఆక్రమణదారులు వెనక్కు తగ్గడం లేదని తెలుస్తోంది. ఒకటి, రెండు రోజుల తర్వాత మళ్లీ మిగిలిన భూమిని చదును చేసుకు నేందుకు ప్లాన్ చేసుకుంటున్నట్లు స్థానికుల ద్వారా సమాచారం అందుతోంది. నిమ్మ, పెసర, మినుము సాగు చేస్తున్న భూముల్లో రెవెన్యూ సిబ్బంది బోర్డులు పాతారు తప్ప ఆ పంటలను దున్నేయలేదు. దీంతో కొన్నాళ్ల తర్వాత ఆ పంటలు పెరిగితే మళ్లీ ఆక్రమణదారులకు అవకాశమిచ్చి నట్లు అవుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. రూ.కోట్లు విలువైన ఈ 200 ఎకరాల భూమిపై మొదటి నుంచీ అధికార యంత్రాంగం నిర్లక్ష్యం కనిపిస్తోంది. కండలేరులో భూములు కోల్పోయిన వారితోపాటు స్థానికంగా అనేక మంది పేదలు ఉన్నారు. వీరికి ఆ భూములను నిబంధనల మేరకు పంపిణీ చేస్తే పేదలకు చేయూతను అందించవచ్చు. కానీ ఎవరూ కూడా ఈ ఆలోచన చేయకుండా ఆక్రమణలకు పరోక్షంగా సహకరిస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



దాచూరులోని ప్రభుత్వ భూముల్లో రెవెన్యూ సిబ్బంది ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

ఎవరికీ పట్టాలు ఇవ్వలేదు

దాచూరు రెవెన్యూ పరిధిలో ఆక్రమణలకు గురవుతున్న భూముల్లో ఎవరికీ పట్టాలు ఇవ్వలేదు. ఎవరైనా పేదలు ఉంటే నిబంధనల ప్రకారం అసైన్‌మెంట్ కమిటీల ద్వారా పంపిణీ చేయాల్సి ఉంటుంది. ఆక్రమణల విషయం మా దృష్టికి రాగానే హెచ్చరిక బోర్డులు పెట్టాం. ప్రభుత్వ భూముల్లో నాటిన మినుము, నిమ్మ చెట్లు వంటి వాటిని తొలగిస్తాం.

- శ్యామ్‌సుందరరాజు, కలువాయి తహసీల్దార్

సమాజ సేవే.. వారి అభిమతం

- అబ్దుల్ కలాం స్ఫూర్తిగా ముందడుగు
- స్వచ్ఛంద సంస్థల సహకారంతో సేవా కార్యక్రమాలు
- అందరికీ ఆదర్శం సిద్ధీపురం యువత

ఊరి బాగు కోసం ఆ యువకులంతా ఏకమయ్యారు. గ్రామస్థుల్లో విద్య, సామాజిక చైతన్యం తీసుకొచ్చి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలనుకున్నారు. అందుకు దివంగత మాజీ రాష్ట్రపతి ఏపీజే. అబ్దుల్ కలాంను స్ఫూర్తిగా తీసుకుని ముందడుగు వేశారు. అనుకున్నదే తడువుగా 2015లో స్నేహితులంతా 'యువనేస్తం సేవా ఫౌండేషన్' ఏర్పరుచుకుని, చంద్రకాంత్ సారథ్యం వహించారు. ఆనాటి నుంచి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ గ్రామస్థుల నోట 'శభాష్' అనిపించుకుంటున్నారు.

- సంగం (ఆంధ్రజ్యోతి)

సంగం మండలం సిద్ధీపురంలో వినాయక ఉత్సవాలకు ఏర్పడిన ఓ సంఘం చంద్రకాంత్ ఆధ్వర్యంలో ప్రసన్నకుమార్, వినోద్, శ్రీనివాస్, నాయబ్ రసూల్ అనే యువకులంతా ఒకటై యువనేస్తం సేవా ఫౌండేషన్‌గా రూపుదిదుద్దకుంది.

విద్యార్థులకు విద్యా సామగ్రి అందచేస్తున్న యువనేస్తం సభ్యులు





యువనేస్తం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

- అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా యేటా అక్టోబరు 15న రక్తదాన శిబిరం ఏర్పాటు.
- గ్రామంలో ఉన్న పాఠశాలలోని విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ.
- నెల్లూరుకు చెందిన లయన్స్ క్లబ్ సహకారంతో ఉచిత వైద్య, కంటి శిబిరాల నిర్వహణ
- దాతల సహకారంతో అగ్ని ప్రమాద బాధితులకు నిత్యావసర సరుకులు, కుట్టుమిషన్ అందజేత
- గ్రామంలో ధనిక, పేద తేడా లేకుండా కులమతాలకు అతీతంగా వినాయక ఉత్సవాల నిర్వహణ

అబ్దుల్ కలాం స్ఫూర్తితో ప్రజల్లో విద్య సామాజిక చైతన్యం వంటి సేవా కార్యక్రమాలు చేపడితే బాగుంటుందని ఆ ఫౌండేషన్ సభ్యులంతా భావించారు. మొదట్లో తమ వద్ద ఉన్న డబ్బులతో సేవా కార్యక్రమాలు చేపట్టారు. పాఠశాల పరిశుభ్రతపై విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించడం, బడి ఈడు పిల్లలను బడికి పంపే విధంగా కృషి చేశారు. అలాగే ప్లాస్టిక్ కవర్ల వాడకం వల్ల కలిగే అనార్థాలను ప్రజలకు వివరిస్తున్నారు. ఈ యువకులు చేస్తున్న సేవా కార్యక్రమాలను చూసి గ్రామస్థులు, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సహకారం అందించారు.

సేవా అకౌంట్ ఉండాలి



ప్రతి ఒక్కరికి బ్యాంకు ఖాతాలా సేవా అకౌంట్ ఉండాలి. బ్యాంకు నగదు లావాదేవీలు మాదిరిగా తరుచూ సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలి. అందరూ సేవా కార్యక్రమాల్లో భాగస్వాములైతే సమాజం అభివృద్ధి చెందుతుంది.

- పీ చంద్రకాంత్, యువనేస్తం సభ్యుడు

తీరనున్న ఆకాంక్ష!

(3వ పేజీ తరువాయి)

తమ కలలు నిజం కాబోతున్నాయన్న ఆనందంతో టెట్, డీఎస్సీలకు సన్నద్ధమవుతున్నారు. జిల్లావ్యాప్తంగా జడ్పీ, ఎంపీపీ, ప్రభుత్వ మేనేజ్‌మెంట్‌లలో 615 పోస్టులు భర్తీ చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. స్కూల్ అసిస్టెంట్ విభాగంలో లాంగ్వేజ్-1 37, లాంగ్వేజ్-2 17, ఆంగ్లము 83, లెక్కలు 62, ఫిజికల్ సైన్స్ 75, బయాలజీ 62, సోషల్ 102, ఫిజికల్ ఎడ్యుకేషన్ 105, ఎస్‌జీటీ 72 కలిపి మొత్తం 615 పోస్టులు ఉన్నట్లు గుర్తించారు. వీటితోపాటు మునిసిపల్ విభాగంలో మరో 60 పోస్టులకుపైగా భర్తీ చేయనున్నట్లు విద్యాశాఖ సిబ్బంది తెలిపారు.

డీఎస్సీ శిక్షణకు స్ర్కీనింగ్ టెస్ట్

నెల్లూరు (హరనాథపురం) : సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖలు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహిస్తున్న డీఎస్సీ శిక్షణకు స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ డీడీ బి. శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఆన్‌లైన్ విధానంలో ఈ ప్రక్రియ జరుగుతుందని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 9581630003 నెంబరుకు ఫోన్ చేయాలని, పరీక్ష హాలుకు ఒక గంట ముందుగానే చేరుకోవాలని కోరారు.

మోసగాళ్లుగా చూస్తున్నారు

(3వ పేజీ తరువాయి)

సమావేశాలు నిర్వహించా లని, ఆ మేరకు సభలో తీర్మానం చేయాలని కోరగా, మిగిలిన సభ్యులు మద్దతు తెలిపారు.

● నన్నూ గుర్తించండి : ఎమ్మెల్సీ

రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలతోపాటు తననూ గుర్తించి మర్యాద ఇవ్వాలని ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి మేయర్‌ను కోరారు. తాను సభలో ఉన్నప్పటికీ మాట మాత్రం కూడా పేరు ప్రస్తావించలేదని ఆక్షేపించారు. సర్వేపల్లి, జాఫర్‌సాహెబ్ కాలువలపై పచ్చదనం, వాకింగ్ ట్రాక్ నిర్మాణ పనులు కొనసాగించాలని కోరారు. కొన్ని దుకాణాలకు పసుపు రంగు వేయడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. వాటిపై విచారణ జరపాలంటూ మేయర్, కమిషనర్ వినతి పత్రం అందచేశారు.

● 64 అంశాలకు ఆమోదం

కాగా, సభ మధ్యాహ్నం తిరిగి సమావేశమయ్యాక పాలక మండలి 73 అంశాలతో ప్రవేశ పెట్టిన అజెండాలోని 64 అంశాలకు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. 4 అంశాలను పునఃసమీక్షించాలని నిర్ణయించారు. మరో ఐదింటిని తిరస్కరిస్తున్నట్లు మేయర్ వెల్లడించారు. టేబుల్ అజెండాపై చర్చించేందుకు సభ్యులు ఆమోదం తెలుపకపోవడంతో వాటిని పక్కనపెట్టేశారు. ఎప్పుడూ లేని విధంగా ఈసారి సమావేశానికి టీడీపీ, వైసీపీ కార్పొరేటర్లు వారి పార్టీ కండువాలతో హాజరవడం విశేషం. ఈ సభలో కమిషనర్ సూర్యతేజ, డీసీ చెన్నుడు, ఏడీసీ నందన్ తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాలతో మెరుగైన సేవలు

- పడుగుపాడులో అతి పెద్ద ధాన్యం నిల్వ కేంద్రం
- నూతన సంఘాల ఏర్పాటుకు కమిటీ
- కలెక్టర్ ఆనంద్



పరిశ్రమల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని సహకార సంఘాలను పటిష్టపరిచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ ఆనంద్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్లో జిల్లా సహకార అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ ప్రైవేటు బ్యాంకుల తరహాలో రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు సహకార సంఘాల ఆధునీకరణ, డిజిటలైజేషన్ చేపడుతున్నట్లు చెప్పారు. జిల్లాలోని 78 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో రికార్డుల కంప్యూటరీకరణ చివరి దశకు వచ్చిందన్నారు. దీనివల్ల సభ్యులకు సత్వర సేవలు అందుతాయన్నారు. జిల్లాలోని ఎన్‌డీసీసీబీ, ప్రకాశం జిల్లా డీసీసీ బ్యాంకుకు అనుసంధానించబడిన 61 పీఏసీఎస్‌లలో క్రియాశీలక సభ్యుల రుణాలు, డిపాజిట్లు, భూమి వివరాలు 87.99 శాతం కంప్యూటరీకరణ పూర్తయింద న్నారు. ప్రపంచ వికేంద్రీకృత ఆహార భద్రతా పథకం కింద పడుగుపాడు పీఏసీఎస్‌కు అతి పెద్ద ధాన్యం నిల్వ కేంద్రం మంజూరైనట్లు చెప్పారు. ఈ కేంద్రం ద్వారా బహుళ ప్రయోజన సేవలు రైతులకు అందుతాయని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో కొత్తగా బహుళ ప్రయోజన పీఏసీఎస్‌లు, మత్స్యకారుల సంఘాలు, పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాలు స్థాపించడానికి జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన జాయింట్ వర్కింగ్ కమిటీ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లాలో సహకార సంఘాల బలోపేతానికి కమిటీ సభ్యులు కృషి చేయాలని సూచించారు.

ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు

నెల్లూరు (వెంకటేశ్వరపురం,ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పరిశ్రమల్లో ప్రమాదాలు జరగకుండా ముందస్తుగా తీసుకోవాల్సిన చర్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. దీనికి సంబంధించిన జిల్లా కమిటీ సమావేశం కూడా శంకరన్ హాల్లో జరిగింది. పరిశ్రమల్లో ప్రమాదాలు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పరిశ్రమల ప్రతినిధులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. ప్రమాదం జరిగిన వెంటనే జిల్లా యంత్రాంగానికి తెలియపరచాలన్నారు. అధికారులు కూడా తరచూ తనిఖీలు చేపట్టి తగు సూచనలు ఇవ్వాలన్నారు. ముత్తుకూరు పరిసర ప్రాంతంలో ఫైర్ స్టేషన్, ఈఎస్‌ఐ ఆసుపత్రి నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమలశాఖ జీఎం మారుతీ ప్రసాద్, కార్మికశాఖ అధికారి వెంకటేశ్వర్లు, బాయిలర్స్ ఇన్‌స్పెక్టర్ సుష్మ, కాలుష్య నియంత్రణ అధికారి అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

హాకీ చాంపియన్ కడప

● ముగిసిన బాలబాలికల రాష్ట్ర హాకీ పోటీలు

నెల్లూరు(విద్య), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్ మండలం సౌత్‌మోపూరు జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి అండర్-17 బాల, బాలికల హాకీ పోటీల్లో రెండు విభాగాల్లో కడప జిల్లా జట్లు చాంపియన్‌గా నిలిచాయి. మంగళవారం జరిగిన ఫైనల్స్‌లో బాలుర విభాగంలో కడప ప్రథమస్థానం, చిత్తూరు ద్వితీయ, పశ్చిమగోదావరి జట్టు తృతీయ స్థానం సాధించాయి. బాలికల విభాగంలో కడప ప్రథమం, అనంతపురం ద్వితీయ, విశాఖపట్నం తృతీయ స్థానం దక్కించుకున్నాయి. విజేతలకు నెల్లూరు ఉప విద్యాశాఖాధికారి ప్రసన్నలక్ష్మి ట్రోఫీలను అందచేశారు. కార్యక్రమంలో సౌత్‌మోపూరు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం విజయలక్ష్మి, ఆర్‌పీ మహబూబ్ బాషా, జడ్పీ పాఠశాల హెచ్‌ఎం ఎస్‌కే అన్వర్‌బాషా, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ఎన్ విజయ, విద్యా కమిటీ చైర్మన్ టీ పెంచలయ్య, పోటీల నిర్వాహక కార్యదర్శి పీ నాగేంద్రరావు, పర్యవేక్షకులు థామస్‌పీటర్, సురేష్‌బాబు, పీఈటీల సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు, ఒలంపిక్ సంఘం కార్యదర్శి గురుప్రసాద్, పరిశీలకులు రవిరాజు, సెల్వపాండ్యన్ పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రణాళికలు పకడ్బందీగా ఉండాలి

- జడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ
- అధికారులకు శిక్షణ ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న ఆనం అరుణమ్మ

నెల్లూరు (జడ్పీ), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలు, మండలాల్లో పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించేం దుకు అభివృద్ధి ప్రణాళికలను పగడ్బందీగా రూపొం దించాలని అధికారులను జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ ఆదేశించారు. 2025-26 ఆర్థిక సంవత్సరం గ్రామాల అభివృద్ధి ప్రణాళికలపై జిల్లా పరిషత్ కార్యాలయంలో అధికారులకు రెండు రోజుల శిక్షణ తరగతులను మంగళవారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు మంజూరు చేస్తాయని, వాటిని సద్వినియోగం చేసుకుని మెరుగైన సదుపాయాలు కల్పించాల్సి ఉందన్నారు. దీనిపై శిక్షణ తరగతుల్లో అవగాహన పెంపొందిం చుకొని పగడ్బందీగా ప్రణాళికలను తయారు చేసి నిర్దిష్ట సమయంలోపు ప్రభుత్వానికి పంపాలని సూచించారు. అలాగే గ్రామ పంచాయతీలు, మండ ల పరిషత్‌ల పరిధిలో పారిశుధ్యాన్ని మెరుగుపరిచేందుకు అధికారులంతా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో మోహన్ రావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మహిళ మృతి



చేజర్ల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): గ్రామంలోని శివాలయం సమీపంలో గుర్తు తెలియని మహిళ (30 నుంచి 40 ఏళ్ల లోపు) మృతి చెంది ఉండడాన్ని మంగళవారం ఉదయం గ్రామస్థులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఇన్‌చార్జి ఎస్‌ఐ సైదులు, ఏఎస్‌ఐ నాగరాజు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. స్థానికులను అడిగి వివరాలు సేకరించారు. మృతురాలు స్థానికురాలు కాకపోవడంతో మృతదేహాన్ని ఆత్మకూరు జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతురాలి బంధువులు వచ్చేవరకు మృత దేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీలో ఉంచుతామని , వారు వచ్చాక పోస్టుమార్టం పూర్తిచేస్తామని పోలీసులు తెలిపారు.

పెదపవనిలో భారీ చోరీ

- ఎవరూ లేని ఇంట్లో 37 సవర్ల బంగారం, రెండున్నర కిలోల వెండి చోరీ
- వీటి విలువ రూ.6లక్షలు
- పోలీసులకు బాధితుడి ఫిర్యాదు
- ఇంటిని పరిశీలించిన డీఎస్పీ, క్లూస్‌టీం అధికారులు

లింగసముద్రం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): పెదపవని గ్రామంలోని ప్రతిభ బాల హైస్కూల్ సమీపంలోని తూర్పువైపు ఉన్న కాలనీలోని టీడీపీ గ్రామ నాయకుడు రామిశెట్టి మాలకొండయ్య ఇంట్లో సోమవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఈ ఘటనలో సుమారు రూ.6 లక్షల విలువ చేసే బంగారం, వెండి నగలు తీసుకెళ్లారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 1వ తేదీన మాలకొండయ్య కుటుంబసభ్యులతో కలిసి ఒంగోలు సమీపంలోని పేర్నమిట్టకు బంధువుల ఇంటికి వెళ్లారు. ఇదే అదునుగా భావించిన దొంగలు అర్ధరాత్రి ఎవరూలేని ఇంట్లో చొరబడ్డారు. ఇంటికి ఉన్న ప్రధాన ద్వారం తలుపుల తాళం పగులగొట్టి ఇంటిలోపలికి చొరబడ్డారు. పరుపు మంచం కింద ఉన్న లాకర్‌ను పగులగొట్టి అందులోని 37 సవర్ల బంగారం, రెండున్న కిలోల వెండి నగలు దోచుకెళ్లారు. మంగళవారం ఉదయం 6గంటల సమయంలో మాలకొండయ్య ఇంటి ఎదురుగా ఉన్న బ్రహ్మారెడ్డి అనే వ్యక్తి మాలకొండయ్య ఇంటి తలుపులు తెరిచి ఉండటాన్ని గమనించారు. అనుమానం వచ్చి వెంటనే మాలకొండయ్యకు ఫోన్ ద్వారా విషయం తెలిపారు. ఆయన ఉదయం 9.30 గంటల ప్రాంతంలో ఇంటికి వచ్చి, ఇంటి లోపల లాకర్ పగులగొట్టి ఉండడం, దుస్తులు చిందరవందరగా ఉండడం చూసి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

● క్లూస్‌టీం పరిశీలన

విషయం తెలుసుకున్న ఎస్‌ఐ షేక్ మహబూబ్ సుభాని వెంటనే విషయాన్ని పోలీసు ఉన్నతాధికారులకు సమాచారం తెలియజేసి సిబ్బందితో పెదపవని వెళ్లి ఇంటిని పరిశీలించి వివరాలు సేకరించారు. అనంతరం కందుకూరు డీఎస్పీ బాల సుబ్రహ్మణ్యం, గుడ్లూరు సీఐ మంగారావు, నెల్లూరు క్లూస్‌టీం అధికారులు బాధితుడితో మాట్లాడారు. ఇంటి పరిసరాలను, ఇంటి లోపల దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. క్లూస్‌టీం అధికారులు వేలిముద్రల కోసం పౌడర్ చల్లి ఆధారాలకు ప్రయత్నించారు. ఈ సందర్భంగా బాధితుడు మాలకొండయ్య మాట్లాడారు. బంగారు వస్తువులు 6గాజులు, 2 నెక్లెసులు, పూలహారం, పచ్చల హారం, చైన్లు, నల్లపూసల దండతో పాటు వెండి పళ్లాలు, హారతి ప్లేటు పోయినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ బాల సుబ్రమణ్యం తెలిపారు.



బాధితుడిని వివరాలు అడుగుతున్న డీఎస్పీ బాల సుబ్రహ్మణ్యం



ఇంటిలోని పరుపు, మంచం కింద ఉన్న లాకర్‌ను పగులగొట్టిన దుండగులు

న్యూస్ బాక్స్

ఇళ్ల మధ్యలో మద్యం దుకాణం వద్దు

అనంతసాగరం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ఇళ్ల మధ్యన మద్యం దుకాణం పెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, వెంటనే అధికారులు అడ్డుకోవాలని సీపీఎం నాయకులు అన్వర్‌బాష డిమాండ్ చేశారు. స్థానిక మహిళలతో కలసి తహసీల్దారు కార్యాలయం వద్ద మంగళవారం నిరసన వ్యక్తం చేసి డీటీ సునీతకు వినతిపత్రం అందచేశారు.

8న మండల సమావేశం

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఈనెల 8న ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ చేజర్ల జయంత్‌రెడ్డి అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో ఎం.వెంకటేశ్వర్లు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అన్నిశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని ఆయన తెలిపారు.

తల్లిదండ్రులకు అవగాహన

సంగం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక రాళ్లచెలిక మిక్స్‌డ్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల తల్లులకు పౌష్టికాహారంపై మంగళవారం అవగాహన కల్పించారు. చిన్నారుల బరువు, ఎత్తును పరిశీలించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ పద్మావతి మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త, ఆయా, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గోడను తొలగించండి

ఏఎస్ పేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నాయబ్ రసూల్ దర్గా నుంచి ఉస్తాద్ బాబా, సర్దార్ బాబా దర్గాలకు వెళ్లే దారికి అడ్డంగా ఉన్న గోడను తొలగించాలని మంగళవారం సీపీఎం నాయకులు దర్గా ఈవో మహమ్మద్ హరాసేన్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఐదేళ్ల క్రితం దారికి అడ్డంగా గోడను నిర్మించడంతో దర్గాలకు వెళ్లే భక్తుల తోపాటు శ్మశనానికి వెళ్లడానికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే గోడను తొలగించాలని కోరారు.

కొత్తపేటలో గ్రామసభ

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కొత్తపేటలో రీసర్వేలో వచ్చిన భూ సమస్యలపై తహసీల్దారు వై.నాగరాజు, సిబ్బందితో కలిసి మంగళవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు రీసర్వేలో నెలకొన్న తప్పిదాలపై అధికారులకు వినతులు అందజేశారు. వినతులను పరిశీలించి సమస్యలు పరిష్కరిస్తామని తహసీల్దారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

వరికుంటపాడు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి కరిష్మా, మలేరియా సబ్‌యూనిట్ అధికారి నౌషాద్ బాబు వైద్యసిబ్బందికి సూచించారు. స్థానిక వైద్యశాలలో మంగళవారం ఆశ కార్యకర్తలతో సమీక్ష నిర్వహించారు. వారు మాట్లాడుతూ దోమలు కుట్టకుండా, పుట్టకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో రాజశేఖర్, టీబీ సూపర్‌వైజర్ భోగ్యం వెంకటేశ్వర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్‌పై అవగాహన

కావలి టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): వంశపార్యంతో కేన్సర్ రావచ్చని నెల్లూరు రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రి వైద్యురాలు లక్ష్మీ తెలిపారు. మంగళవారం విట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో జేవీవీ, రెడ్‌క్రాస్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శేషయ్య అధ్యక్షతన జరిగిన సదస్సులో క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ కన్యాకుమారి, జేవీవీ అధ్యక్షులు తోట వెంకటేశ్వర్లు, హరినారప రెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ అధికారి మధుకర్ పాల్గొన్నారు.

దీక్ష సభను జయప్రదం చేయండి

కందుకూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఒంగోలు అంబేద్కర్‌భవన్‌లో ఈ నెల 24న బౌద్ధ దీక్ష ఉత్సవం నిర్వహించనున్నట్లు ధమ్మ చక్ర ఫౌండేషన్ అధ్యక్షుడు గాండ్ల హరిప్రసాద్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. సభలో అంబేద్కర్ - బుద్ధ అభిమానులు, ప్రజాస్వామికవాదులంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వాల్‌పోస్టర్ విడుదల

కందుకూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుట క్రిస్టియన్ గ్రౌండ్‌లో ఈ నెల 26న నిర్వహించనున్న మాలల మహాగర్జనను విజయవంతం చేయాలని అఖిల భారత మాల సంఘాల జేఏసీ గౌరవాధ్యక్షుడు పాలేటి కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. మంగళవారం కందుకూరులో సభకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు పాలేటి కోటేశ్వరరావు, బొట్లగుంట శ్రీనివాస్, గుంటక మల్లికార్జున పాల్గొన్నారు.

రైల్వే ఎల్సీ గేటుకు అడ్డంగా ఆటోల నిలిపివేత

బిట్రగుంట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): బోగోలు బజారు రైల్వే ఎల్సీ గేట్ 144 వద్ద పాసింజర్ల కోసం రోడ్డుకు అడ్డంగా ఆటోలు నిలుపుతుండటంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికితోడు నాల్గో లైన్ ప్రారంభమైనది మొదలు మంగళవారం అరగంటకు పైగా గేటు వద్ద ఉండాల్సి వస్తుందన్నారు. తీరా గేట్ తెరిచిన రెండు నిమిషాలకు మూసి వేస్తున్నట్లు ప్రజలు వాపోతున్నారు. ఈ సమస్యతో గంటల తరబడి రైల్వే గేట్ వద్ద పడి కాపులు కాసి సమయానికి అనుకున్న ప్రాం తాలకు చేరుకోలేక పోతున్నామని చెబు తున్నారు. పోలీసులు స్పందించి ఆటో వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

● రెండు లారీలు, డ్రైవర్లు అదుపులోకి..

కావలి రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): హద్దులు దాటిపోతున్న 55 కింటాల అక్రమ రేషన్ బియ్యాన్ని మంగళవారం రాత్రి పట్టణ ముసునూరు టోల్ గేట్ వద్ద రూరల్ పోలీసులు పట్టుకున్నారు. పలనాడు జిల్లా వినుకొండ నుండి చెన్నైకు రెండు లారీల్లో బియ్యాన్ని తరలిస్తున్నట్లు రూరల్ సీఐ రాజేశ్వరరావుకు వచ్చిన సమాచారం మేరకు టోల్ గేట్ వద్ద సిబ్బందితో కలసి వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీల్లో బియ్యంతో వస్తున్న రెండు లారీలు, డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ తెలిపారు.

ప్రమాదకరంగా పెద్ద చెరువు తూము

● శిథిలావస్థలో తూము, కదిలిస్తే చెరువులో నీరు గల్లంతే
● సాగునీటి పారుదలపై రైతుల ఆందోళన

కావలి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలకుల నిర్లక్ష్యంతో కావలి పెద్ద చెరువు కింద సాగు ప్రశ్నార్థకంగా మారింది. ఈ చెరువు కింద సుమారు 2వేల ఎకరాల ఆయకట్టు ఉంది. నీటి సరఫరాకు ఏర్పాటు చేసిన రెండు తూములు దెబ్బతిని పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. ప్రస్తుతం చెరువులోకి సగానికిపైన నీరు చేరడంతో మరమ్మతుల చేయడానికి వీలులేని పరిస్థితి. ఈ సీజన్‌కైనా తూమును తెరచి నీరు పారించుకోవచ్చంటే అది చెరువుకే మరింత ప్రమాదకర పరిస్థితిగా నెలకొంది. తూమును కదిలిస్తే అది పూర్తిగా ఊడిపోయి చెరువుకు గండిపడి నీరంతా వృథాగా వెళ్లే పరిస్థితి ఉంది. ఈ సమస్యతో ఈ ఏడాది వరి సాగు ఎలా చేయాలని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితిని జలవనరుల శాఖ అధికారులు కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ల డమే



దెబ్బతిన్న చెరువు తూము

కాకుండా ఆదివారం నెల్లూరులో జరిగిన డీఆర్సీ మీటింగ్‌లో కూడా కావలి నియోజకవర్గంలో చెరువులు దెబ్బతిన్న విషయాన్ని ప్రస్థావించారు. అయితే ప్రస్తుతం ఆ తూము కింద ఆయకట్టుకు సాగునీరు ఇవ్వాలంటే భగీరథ యత్నాలు చేయాల్సిందే. తూమును కదిలించకుండా దానికి లోపలవైపున వరిగడ్డి మోపులు, ఇసుకబస్తాలు లాంటివి వేసి తూము కొట్టుకుపోకుండా పటిష్టత పరచాలి. ఆ తర్వాత ఆ తూము నుంచి సాగునీరు పంటలకు లిఫ్ట్ ద్వారా అందిస్తేనే తూము వద్ద చెరువుకు రంధ్రం పడకుండా ఆ నీటిని సద్వినియోగం చేసుకునే పరిస్థితి ఉంది. చెరువు కట్టపై విద్యుత్ మోటార్లు, ఆయిల్ ఇంజన్లు కాని పెట్టి అక్కడ నుంచి ఆ కాలువకు నీటిని లిఫ్ట్ చేస్తే కింద ఉన్న పొలాలకు నీరు ఇవ్వాల్సి ఉంది. అయితే ఆ ఖర్చులు ఎవరు భరించాలన్నది చర్చనీయాంశంగా ఉంది.

ఉరూరా భక్తిశ్రద్ధలతో నాగులచవితి



ఉదయగిరి నాగులపుట్ట వద్ద భక్తుల పూజలు



సంగం: శివాలయంలో మహిళల పూజలు



కావలి: పూజలో పాల్గొన్న భక్తులు



బిట్రగుంట: పుట్టకు పూజలు చేస్తున్న భక్తులు

ఉదయగిరి రూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళవారం నాగులచవితిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వెంకట్రావుపల్లి, అప్పసముద్రం, కుర్రపల్లి బీసీ కాలనీ, గడ్డంవారిపల్లి, మిట్టపల్లి, శకునాలపల్లి, బోడబండ, కృష్ణంపల్లి, గండిపాళెం, వెంకట్రావుపల్లి, గుడినరవ, మసీదుపల్లి, బిజ్జంపల్లి, ఉదయగిరిలోని సంతానలక్ష్మి, నగిరితోట ప్రాంతాల్లోని పుట్టల వద్ద మహిళలు ప్రత్యేక పూజలు చేసి, ప్రసాదాలు పంచిపెట్టారు. గ్రామాల్లో అన్నదానం నిర్వహించారు.

● దుత్తలూరు : గ్రామాల్లో మహిళలు నాగులచవితిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నాగారప్పమ్మ శిలలు, పుట్టల వద్దకు వెళ్లి పోలుపోసి, దారాలు చుట్టి మొక్కు తీర్చుకున్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● సంగం : మండలంలో మహిళలు ఉదయాన్నే తలస్నానాలు చేసి తడి దుస్తులతో పుట్టల వద్దకు వెళ్లి పాలు పోసి ఉప వాసం ప్రారంభించారు. అనంతరం ఇంటికి వచ్చి ప్రసాదాలు తయారు చేసుకుని నాగశిలలు, పుట్టల వద్దకు వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు.

● ఆత్మకూరు : పట్టణంలోని శివాలయం, నాగేంద్రపురం, కాశీనాయన ఆశ్రమం, కొలగాని రామయ్యసత్రం, జ్యోతినగర్, ఎల్ఆర్ పల్లి, చెరువు, తదితర ప్రాంతాల్లో ఉన్న నాగులపుట్టల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీఅలఘునాథస్వామి, కాశీనాయన ఆశ్రమ నాగశిలల వద్దకు మహిళలు అధికసంఖ్యలో విచ్చేసి పూజలు నిర్వహించారు

● సీతారామపురం : మండలంలో మహిళలు భక్తిశ్రద్ధలతో వేడుకలు జరుపుకున్నారు. తెల్లవారుజాము నుండే పుట్టలో పాలు పోసేందుకు మహిళలు తరలివచ్చారు.

● ఏఎస్ పేట : ఏఎస్‌పేటతో పాటు హసనాపురం, చిరమన, అనుమసముద్రం గ్రామాల్లో నాగులచవితిని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఏఎస్‌పేట ఎర్రపోలలో ఉన్న పుట్ట వద్ద మహిళలు ప్రత్యేక పూజలు చేశారు.

● అల్లూరు : అన్ని గ్రామాల్లోని శివాలయాల్లో ఉండే నాగేంద్రుని పుట్టలు, చెరువు కట్టలు, కాలువ గట్లపై ఉండే నాగేంద్రుని పుట్టల వద్దకు మహిళలు చేరుకొని చలిపిండి, పాలు నైవేద్యాలను సమర్పించారు. ఉదయం నుండే మహిళలు మొక్కులను చెల్లించారు.

● వలేటివారిపాలెం : గ్రామాల్లో తెల్లవారుజామునే పుణ్యస్నానాలు చేసి, నోముల దారాలు, చలిపిండి తయారు చేసుకొని పుట్టలు వద్దకు చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉపవాస దీక్షలో ఉన్న మహిళలు కంకణాలు ధరించారు. నాగ పంచమి వరకు ఉపవాస దీక్షలు కొనసాగించి పుట్టలో పాలు, కొబ్బరి, బెల్లం వేసి దీక్షను విరమించారు.

● కావలి టౌన్ : స్థానిక ముసునూరు ట్రంకురోడ్డు పుట్ట, కోర్టు ప్రాంగణం లోని పుట్ట, వెంగళరావునగర్ ఆలయ ప్రాంగణం, ఉత్తరంపేట ట్రంకురోడ్డులోని పుట్టల వద్ద భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పుట్టకు దారాలు చుట్టి పాలు పోసి పూజలు నిర్వహించారు. సలిపిండి, నువ్వులు, వడపప్పు నాగదేవతకు నైవేద్యం సమర్పించారు.

● కావలి రూరల్ : వైకుంఠపురం పెంకుల ఫ్యాక్టరీ రోడ్డులోని నాగదేవత సమేత జంట నాగేంద్రస్వామి పుట్ట మందిరంలో దగ్గుపాటి ప్రభాకర్, నాగయ్య ఆధ్వర్యంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే మహిళలు పుట్ట మందిరానికి చేరుకుని పూజలు చేసి మొక్కులు చెల్లించారు. భక్తులకు అన్నసంతర్పణ చేపట్టారు.

● బిట్రగుంట : విశ్వనాథరావుపేట పంచాయతీ కొత్తూరుశివారులోని నాగవర పమ్మకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ సమీపంలోని నాగుల పుట్ట వద్ద పాలు, గుడ్లను ఉంచారు. సలివిడి, సొజ్జులు, పులిహోరాలను నైవేద్యంగా సమర్పించి భక్తులకు పంచిపెట్టారు. బోగోలు బజారు కూడలోని నాగులపుట్ట, ఇబ్రహీంపేట శివాలయ ఆవరణలోని నాగశిలకు పూజలు నిర్వహించారు. గంగతిప్ప శివలింగానికి పూజలు చేశారు.

● ఉలవపాడు : గ్రామ పొలిమేరల్లోని నాగేంద్ర స్వామి పుట్టలకు పసుపు కుంకమలతో పూజలు చేసి పుట్టలో పాలు పోసి నైవేద్యం సమర్పించారు. సంతానం లేని మహిళలు, నాగదోషం, కుజదోషం ఉన్న మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. ఉలవపాడు దక్షణ బైపాస్ వద్ద వెలసిన సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేసి పుట్టకు పూజలు చేసి పాలు, నైవేద్యం సమర్పించారు.



సీతారామపురం: దీపాలు వెలిగిస్తున్న మహిళలు



వలేటివారిపాలెంలో పూజలు చేస్తున్నమహిళలు

పొదుపు గ్రూపు సభ్యుల సమగ్ర సమాచారం పొందుపరచాలి : మెప్మా పీడీ

కావలి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాలకు సంబంధించిన సమగ్ర సమాచారం ఎస్‌జీహెచ్ ప్రొఫైల్ యాప్‌లో పొందుపరచాలని మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ రవీంద్ర తెలిపారు. మంగళవారం సాయంత్రం స్థానిక మున్సిపల్ సమావేశం మందిరంలో పొదుపు సంఘాల రీసోర్స్ పర్సన్‌కు ఎస్‌జీహెచ్ ప్రొఫైల్ యాప్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మహిళా సంఘాల పొదుపులు, అప్పు వివరాలతో పాటు ఎస్‌జీహెచ్ సభ్యులకు సంబంధించిన ప్రాథమిక, సాంఘిక, ఆర్థిక వాస్తవిక సమాచారం ఉండాలన్నారు. రీసోర్స్ పర్సన్స్ సమాచారం పొందుపరిచేందుకు కృషిచేయాలన్నారు. మున్సిపల్ కమిషనర్ శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ కావలి మున్సిపాలిటీలో ప్రతి సంఘం సభ్యురాలి సమగ్ర సమాచారాన్ని సేకరించి ప్రభుత్వ పథకాలు అందరికీ అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సీఎంఎం భారతి,



మాట్లాడుతున్న మెప్మా పీడీ రవీంద్ర, కమిషనర్ శ్రావణ్‌కుమార్

జిల్లా స్థాయి మెప్మా సిబ్బంది అంకయ్య, కాంతయ్య శంకర్ తదితరులు పాల్గొన్నారు.

● కందుకూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పొదుపు గ్రూపుల్లో అవకతవకల నివారణకు ప్రభుత్వం నూతన యాప్‌ను ప్రవేశపెట్టిందని మెప్మా ప్రాజెక్టు డైరక్టర్ రవీంద్ర తెలిపారు. కందుకూరు మున్సిపాలిటీలో పొదుపు గ్రూపుల ఆర్పీలకు సెల్ఫ్ హెల్ప్ గ్రూప్స్ (ఎస్‌హెచ్‌జీ) ప్రొఫైలింగ్ యాప్ వినియోగంపై మంగళవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌లో పాల్గొన్న పీడీ రవీంద్ర యాప్ వినియోగం, ఉపయోగాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అనూష, మెప్మా సీఎంఎం సంపత్‌కుమార్, సీఓలు మాధవీలత, సురత్న, డీఈఓ శ్రవణ్‌కుమార్, ఆర్పీలు పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.

శుభ్‌దిన్ భోజనం ఏర్పాటు

ఉదయగిరి రూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దళితవాడ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల విద్యార్థులకు మంగళవారం ఎంఈవో-2 తోట శ్రీనివాసులు తన జన్మదినం సందర్భంగా శుభ్‌దిన్ భోజనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, చిన్నారులకు రుచికరమైన భోజనంతోపాటు పండ్లు, మిఠాయిలు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం షేక్ షబ్బీర్ పాల్గొన్నారు.



పండ్లు పంపిణీ చేస్తున్న ఎంఈవో

వాలీబాల్ పోటీలకు ఎంపిక

ఉలవపాడు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఉలవపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ గారపాటి గోపీచంద్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. జూనియర్ ఇంటర్ ప్రవీణ్, నాగేంద్ర, యోగేంద్ర, చందు, శ్రీకాంత్, సీనియర్ ఇంటర్ హేమంత్‌లు ఉన్నారు. 9, 10, 11 తేదిల్లో విజయవాడ పోటీల్లో పాల్గొంటారు.



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

అభివృద్ధి చేసి మాట నిలబెట్టుకుంటాం : ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

కావలి టౌన్, నవంబరు 5: ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు అభివృద్ధి చేసి ఇచ్చిన మాట నిలబెట్టుకుంటామని ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం ముసునూరు రైల్వే అండర్‌పాస్ బ్రిడ్జి పనులు ట్రంకురోడ్డు వరకు, కనెక్టివిటి రోడ్డు, డ్రైన్ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాల విషయంలో రాజీ పడవద్దని ప్రజలకు ఇబ్బంది కల గకుండా సకాలంలో పనులు పూర్తి చేయాలని ఇంజనీర్లకు సూచించారు. పనులు పూర్తయితే రైల్వే ట్రాక్ అవల నివాసితులకు, పట్టణానికి రాకపోకలు సాగించేందుకు తుమ్మలపెంట మార్గంలో తీరప్రాంతవాసులకు, బీచ్‌కు వెళ్లే సందర్శకులకు అనుకూలంగా ఉంటుందన్నారు. ఆయన వెంట టీడీపీ లీగల్ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు గుంటుపల్లి రాజ్‌కుమార్ చౌదరి గ్రామ పెద్దలు, నేతలు తదితరులు ఉన్నారు.

టీబీ రహిత జిల్లాగా మార్చాలి : జిల్లా టీబీ అధికారి ఖాదర్‌వలి

ఉలవపాడు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): టీబీ రహిత జిల్లాగా మార్చేందుకు ఇంటింటి సర్వే చేపట్టి వ్యాధిగ్రస్తులను గుర్తించి సకాలంలో వారికి వైద్య పరీక్షలు చేయించాలని అడిషనల్ డీ ఎంహెచ్‌వో, జిల్లా టీబీ నివారణ అధికారి ఖాదర్‌వలి ఆశాలకు దిశా నిర్దేశం చేశారు. ఆశాడే సందర్భంగా మంగళవారం కరేడు పీహెచ్‌సీలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. నేషనల్ ట్యూబర్‌క్లోసిస్ ఎలిమినేషన్ ప్రోగాం(ఎన్‌టీఈపీ)లో భాగంగా ఇంటింటి సర్వే నిర్వహించి రెండువారాలకు పైగా దగ్గు, జ్వరము ఉన్న వారి నుంచి గళ్లను సేకరించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పంపాలన్నారు. ఆశాలను టీములుగా విభజించి బుధవారం నుంచి ఇంటింటి సర్వే చేపడతామని కరేడు పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీనివాసులు తెలిపారు.

రీసర్వే ప్రక్రియకు అన్ని ఏర్పాట్లు చేశాం..

కందుకూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపాలిటీ పరిధిలో రీ సర్వే కార్యక్రమాన్ని తిరిగి ప్రారంభించేందుకు అన్నిఏర్పాట్లు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ కె.అనూష తెలిపారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆమె వార్డు సచివాలయ సర్వేయర్లు, ఇతర సిబ్బందితో సమావేశం అయ్యారు. తక్షణం రీసర్వే ప్రక్రియను ప్రారంభించాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గ దర్శకాల మేరకు ఆయా ప్రాంతాల రైతులు, భూ యజమానులకు ముందస్తు సమాచారం అందించాలన్నారు. ప్రజలు కూడా తమ వద్ద ఉన్న డాక్యుమెంట్లను రీసర్వే సిబ్బందికి చూపించి స్థలాలు, భూముల రీ సర్వేకు సహకరించాలన్నారు.

ఆత్మకూరును ప్రథమస్థానంలో నిలపాలి : మంత్రి ఆనం

ఆత్మకూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): టీ డీపీ సభ్యత్వ నమోదులో ఆత్మకూరు నియోజకవర్గాన్ని రాష్ట్రంలో ప్రథమస్థానంలో నిలిపేందుకు పార్టీ నేతలంతా ప్రత్యేక దృష్టి సారించాలని దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం నెల్లూరులోని క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని మండల కన్వీనర్లు, నాయకులు, బూత్ లెవల్ ఏజెంట్లుకు ఆమన దిశానిర్దేశం చేశారు. టీడీపీ సభ్యత్వ నమోదుకు రాష్ట్రంలో 10 నియోజకవర్గాలను ఎంపిక చేయగా, ఇప్పటికి కళ్యాణదుర్గం ప్రథమ స్థానంలో, ఆత్మకూరు ద్వితీయ స్థానంలోనూ ఉందన్నారు. నెల్లూరు పార్లమెంట్ పరిధిలో ప్రథమస్థానంలో ఉందన్నారు. పార్టీ కోసం కష్టపడినవారికి అన్ని పదవుల్లోనూ ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ పరిశీలకులు బుల్లెట్ రమణ, కార్తీక్, నాయకులు బొల్లినేని గిరినాయుడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

రీ సర్వేలో తప్పులను సవరిస్తాం

లింగసముద్రం (ఆంధ్రజ్యోతి): రీ సర్వేలో జరిగిన తప్పులను సవరి స్తామని తహసీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం జరిగిన గ్రామసభలో 44 మంది రైతులు అర్జీలు ఇచ్చారన్నారు.

తలసేమియా ఆసుపత్రి ఏర్పాట్ల పరిశీలన

కావలి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక రెడ్‌క్రాస్ రక్తనిధి భవనంలో తలసేమియా ఆసుపత్రి ఏర్పాటు చేయటం కావలి ప్రాంత ప్రజలకు ఒక వరమని కావలి ఆర్డీవో, రెడ్‌క్రాస్ కన్వీనర్ ఎం.వంశీకృష్ణ తెలిపారు. మంగళవారం ఉదయం ఆయన ఆర్డీవో కార్యాలయ ఆవరణలోని రెడ్‌క్రాస్ రక్తనిధి భవనం, త్వరలో ప్రారంభం కానున్న తలసేమియా ఆసుపత్రి భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి నిర్వహణకు రెడ్‌క్రాస్ యోగా కేంద్రం కన్వీనర్ హరి నారపరెడ్డి రూ.1.9లక్షలు, ప్రముఖ బిల్డర్



దేవరపల్లి మధుసూదనరెడ్డి రూ.లక్ష116ల చెక్కులను ఆర్డీవోకు అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ రక్తకేంద్రం కన్వీనర్ బెజవాడ రవికుమార్, చైర్మన్ డీ రవిప్రకాష్, రొటేరియన్ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

భవన మరమ్మతులకు ప్రతిపాదనలు

ఉదయగిరి రూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): పాత ఎంపీడీవో కార్యాలయ భవన మరమ్మతులకు ప్రతిపాదనలు తయారు చేస్తున్నట్లు పంచాయతీరాజ్ డీఈ మణికుమార్ పేర్కొన్నారు. మంగళవారం సిబ్బందితో కలిసి భవనం కొలతలు తీయించారు. భవనానికి సంబంధించిన కలప, తదితర సామగ్రిని గుర్తించి రికార్డుల్లో నమోదు చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులతో భవనానికి మరమ్మతులు చేపడతామన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాసరాజు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు షరీఫ్, వెంకటేష్, నరసింహ, శేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

● గోపీనాథ్, మర్రిపాడు ప్రభుత్వ వైద్యాధికారి



మర్రిపాడు, (ఆంధ్రజ్యోతి) : వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మర్రిపాడు ప్రభుత్వ వైద్యాధికారి గోపీనాథ్ సూచించారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న సందర్భంగా ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడారు.

ఈ ఇంటర్వ్యూ

? మండలంలో జ్వర పీడితుల సంఖ్య పెరగడానికి కారణం.

! వాతావరణంలో మార్పులు.. భూగర్భ జలాలు కలుషితం కావడంతో వ్యాధులు ప్రబలుతున్నాయి.

? జాగ్రత్తలు ఏంటి

! కాచిన నీటిని తాగితే అనారోగ్యం చెంతకు రాదు.

? ఆరోగ్యం పట్ల అవగాహన కార్య క్రమాలు నిర్వహి స్తున్నారా.

! ఫ్రైడే డ్రైడే కార్యక్రమం పేరుతో ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు పారిశుధ్యంపై అవగాహన కల్పిస్తున్నాం.

బహుమతుల అందజేత



ప్రయాణికులకు బహుమతి అందజేస్తున్న డీఎం శ్రీనివాసరావు

ఉదయగిరి రూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): సీతారామపురం మార్గం లో తిరిగే బస్సులకు సంబంధించి గిఫ్ట స్కీమ్‌లో భాగంగా విజేతలైన ప్రయాణికులకు మంగళవారం ఆర్టీసీ డీఎం శ్రీనివాసరావు బహుమతులు పంపిణీ చేశారు. ఈ మార్గంలో తిరిగే బస్సుల్లో ఏర్పాటు చేసిన బాక్సుల్లో ప్రయాణికులు టికెట్లు వేశారు. ఆ టిక్కెట్లను డ్రా తీయగా మహేంద్ర, నిఖితలు విజేతలుగా నిలిచారు. వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డిపో సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

'ఉపాధి'పై గ్రామసభ

సీతారామపురం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): సీతారామపురం-1 సచివాలయంలో మంగళవారం సర్పంచి భాగ్యకుమారి అధ్యక్షతన ఉపాధి హామీ పథకంపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భం గా టెక్నికల్ అసిస్టెంట్ మురళీకృష్ణ మాట్లాడుతూ ఈ ఏడాదికి నూతన పనుల కోసం ప్రతిపాదనలు పంపుతామని, రైతులు పండ్ల తోటల పెంపకం, మునగ నర్సరీలు, పూలతోటల పెంపకం వంటి పనులకు ప్రతిపాదనలు తయారు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి షఫీ, వెల్ఫేర్ అసిస్టెంట్ హసనయ్య, మహిళా కార్యదర్శి హాజీరా బేగం, వార్డు మెంబర్ తోట మనోజ్‌బాబు, రవి,ఫీల్డ్ అసిస్టెంట్ జగదీష్ పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీ



నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న మాల్యాద్రి, నరసింహం

లింగసముద్రం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మాలకొండ ట్రస్టుబోర్డు మాజీ సభ్యులు మట్టె నాగేశ్వరరావు వర్ధంతి సందర్భంగా జంపాలవారిపాలెం పాఠశాల విద్యార్థులు, అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, పలకలు పలకలు, బలపాలు పంపిణీ చేశారు. ఆయన కుమారులు మాల్యాద్రి, నరసింహారావులు చేపట్టిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు, బంధువులు పాల్గొన్నారు.

బీమా చేయించుకోవాలి

వరికుంటపాడు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): రబీలో పంటలు సాగు చేసిన రైతులు డిసెంబరు 15వ తేదీలోపు బీమా చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి రవికుమార్ పేర్కొన్నారు. మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని రామాపురం, వరికుంటపాడు గ్రామాల్లో సాగులో ఉన్న పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ, పశు సంవర్ధకశాఖ సహాయకులు చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, సుబ్బరాయుడు, కిశోర్, రైతులు పాల్గొన్నారు.

మద్యం సీసాల పట్టివేత

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), నవం బరు 5 (ఆంధ్రజ్యోతి): నందిపాడు సెంటర్ లో నిర్వహిస్తున్న బెల్టు దుకాణంపై మంగ ళవారం ఉదయగిరి ఎక్సైజ్ ఎస్ఐ దీప్తికరంత్ తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. 16 సీసాలను స్వాధీనం చేసుకుని బత్తుల వేణుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆధునిక పద్ధతులపై దృష్టి

ఉలవపాడు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో ఆధునిక పద్ధతు లపై దృష్టి సారించాలని వ్యవసాయాధికారి తిరుమల జ్యోతి రైతులకు సూచించారు. మంగళవారం వీరేపల్లి ఆర్ఎస్‌కేలో నిర్వహించిన పొలం పిలుస్తుందిలో ఉద్యానవన అధికారి జ్యోతి వ్యవసాయ, ఉద్యానవన శాఖ సిబ్బంది పాల్గొన్నారు.